thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 262 | కరీంనగర్ శనివారం, 29 నవంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 10 వేల కోట్లతో క్షిపణుల కొనుగోలు

న్యూఢిల్లీ : గగనతలాన్ని శత్రు దుర్భేద్యంగా మార్చడానికి మనదేశం వేగంగా అడుగులు వేస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్ దాడులను సమర్థంగా తిప్పికొట్టిన ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థను మరింత విస్తరించ డానికి సిద్ధమైంది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) దీనిని ఓ గేమ్‌చేంజర్‌గా అభివర్ణిస్తున్న నేపథ్యంలో మరో ఐదు ఎస్-400లను కొనుగోలు చేయనున్నారు. డిసెంబరు 5న జరిగే ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీలో వీటితో పాటు మరిన్ని క్షిపణుల కొనుగోలుకు ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. అలాగే రూ. 63 వేల కోట్లతో సుఖోయ్-30ఎంకేఐ యుద్ధవిమానాల ఆధునీకరణ కార్యక్రమానికి కూడా భారత్ సిద్ధమవుతోందని టైమ్స్ ఆఫ్ ఇండియా తన కథనంలో తెలిపింది.

ఆ కథనం ప్రకారం.. మరిన్ని ఎస్-400 స్క్వాడ్రన్‌లు కొనుగోలుకు ఇప్పటికే రక్షణ శాఖ సిద్ధమైంది. అలాగే పాక్‌తో యుద్ధం సమయంలో తరిగిపోయిన నిల్వలను మళ్లీ పెంచడానికి ఎస్-400 క్షిపణులను కూడా కొనుగోలు చేయాలని నిర్ణయించింది.

# రెండు రోజుల్లో పైకి, లేదంటే లోపలికి.!


## -ఇది మన పోలీస్ వ్యవస్థ వర్కౌట్!!

### -మావోనేత దేవ్ జీ అరెస్టు పైన లేఖల వెల్లువ

### -నెల రోజుల పాటు 50 మంది మావోయిస్టులు నిర్బంధం అసాధ్యం

### -దేవ్ జీ అరెస్టు అంతా ఉత్తదేనని గతంలోనూ అధికారుల వెల్లడి






చురకలు ప్రత్యేక ప్రతినిధి పోలీసుల పనితీరును అంచనా వేయలేని పరిస్థితి పై మీడియాకు మావోయిస్టు పార్టీ పేరిట వస్తున్న లేఖ ల పరంపర కొనసాగుతోంది.పోలీస్ శాఖలో ఇప్పటి వరకూ జరిగిన సంఘటనలు ఎన్కౌంటర్లో అన్ని పట్టు బడిన నక్స లైట్లు తెల్లవారు ఝామున ఆరు గంటల నుంచి మధ్యాహ్నం వరకూ కథ ఐపోతున్నది.ఒకవేళ పోలీసులకు నగరాల్లో చిక్కితే ప్రయాణ సమయం బట్టి ఏ రాత్రి సమయంలోనైనా కథ క్లోస్ చేసిన సంఘటనలు అనేకం. అయితే రౌడీలు,పేరుమోసిన దొంగలను స్పాట్ లో విచారణ చేస్తున్న సమయంలో ఖతం చేస్తారు..ఎన్కౌంటర్లలో అన్ని రకాల ఇవే ఉన్నాయి కానీ,వీటికి భిన్నంగా నెలరోజుల క్రితం తిరుపతి సహా 50 మంది తమవాళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని వికల్ప్ తెలిపారు.అసలు వికల్ప్ అనే పేరుతో కొనసాగే ఇలాంటి వారు ఒకరు ఎన్కౌంటర్లో మరణించారు.మరొకరు లొంగిపోయారు కదా.మళ్లీ ఆ తర్వాత వస్తున్న లేఖలు ఎక్కడివి అనే దానిపై స్పష్టత లేదు.అంతా గందరగోళం నెలకొన్నది.సాధారణంగా ఎవరైనా పట్టుబడితే రెండురోజుల్లో ఖతం చేస్తారు.లీక్ అయితే మూడు రోజుల తర్వాత రిమాండుకు పంపిన అధికారులకు కూడా ఇలాంటి లేఖలు చిరాకు తెప్పిస్తున్నాయి.తిరుపతి ఏదేవ్ జి సహా ఎవరు కూడా తమవద్ద లేరని అటు ఏపీ ఇటు తెలంగాణ పోలీసులు చెబుతున్నారు.ఐనా తిరిగి గురువారం రాత్రి మళ్లీ వికల్ప్ పేరిట వచ్చిన లేఖతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కలకలం రేపుతోంది.తిరుపతి విషయంలో జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే అసలు తిరుపతి మావోయిస్ట్ పార్టీకి కాంటాక్ట్ తెగిపోనట్టు కనిపిస్తోంది.

**మల్లా రాజిరెడ్డి పై ఇదేం అరాచకం.!!...** -మావోయిస్టు టాప్ మోస్ట్ వాంటెడ్ మల్లా రాజిరెడ్డి పేరు మీద ఉన్న ప్రచారం అంతా అయోమయం రేపుతోంది.గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాజిరెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈ నేపథ్యంలో ఆయన లొంగిపోతారని వార్తలు కూడా వచ్చాయి.ప్రస్తుతం కేరళ,తమిళనాడు రాష్ట్రాల్లో మావోయిస్టు పార్టీ బలోపేతంపై సంగ్రామ్ పేరిట కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్.. ప్రస్తుతం కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉండటం గమనార్హం. గతంలో కూడా దండకారణ్యంలో రాజిరెడ్డి మృతిచెందినట్లు పేర్కొంటూ మావోయిస్టులు సోషల్ మీడియాలో ఓ వీడియో రిలీజ్ చేశారు. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఎగ్లాస్‌పూర్ పరిధిలోని శాస్త్రులపల్లికి చెందిన రాజిరెడ్డి.. తొలితరం మావోయిస్టు నేతల్లో ఒకరు. ఆయన అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్‌లతో కూడిన మావోయిస్టుల నైరుతి ప్రాంతీయ బ్యూరోలో విప్లవాత్మక ఉద్యమానికి ఇంఛార్జిగా రాజిరెడ్డి పని చేశారు. మావోయిస్టు అగ్గనేతగా ఉన్న రాజిరెడ్డిపై దేశవ్యాప్తంగా కేసులు నమోదయ్యాయి. వివిధ రాష్ట్రాల్లో ఆయనపై కోటి రూపాయల రివార్డు కూడా ఉంది. పీపుల్స్ వార్ అగ్రనేతలతో కూడా రాజిరెడ్డి పనిచేశారు. కొండపల్లి సీతారామయ్య, గణపతి, సత్యమూర్తికి రాజిరెడ్డి సహచరుడు. ఉమ్మడి ఏపీ మాజీ స్పీకర్ శ్రీపాదరావు హత్య కేసులో రాజిరెడ్డి నిందితుడిగా ఉన్నారు. 2008 జనవరిలో కేరళలో రాజిరెడ్డిని పోలీసులు అరెస్ట్ చేయగా.. ట్రాన్సిట్ వారెంట్ ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లా పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని మెట్‌పల్లి కోర్టులో హాజరుపరిచారు. చాలా కేసుల్లో నిందితుడిగా ఉన్న రాజిరెడ్డి రెండున్నరేళ్లు కరీంనగర్ జైలులో ఉన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తపాల్‌పూర్‌లో నలుగురి హత్య కేసులోనూ రాజిరెడ్డి నిందితుడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పీపుల్స్ వార్ చేసిన సమయంలో తొలి హత్యగా తపాల్‌పూర్ ఘటన. ఆ కేసులో ఏ 1 గా కొండపల్లి సీతారామయ్య, ఏ 2గా రాజిరెడ్డిపై పోలీసులు కేసులు నమోదు చేయటం గమనార్హం. 70 ఏళ్ల వయసున్న ఆయన నడవలేని స్థితిలో ఉన్నారని,నలుగురు కలిసి సాయం కోసం ఎదురుచూస్తున్నారని,అలాంటి వారు పార్టీ విడిచి లొంగిపోతారని అనుకుంటున్న సమయంలో ఈ లాంటి ప్రచారం జరిగింది.ఆర్నెల్ల క్రితం కూడా ఆయన పై ఎన్కౌంటర్ చేశారని పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి.తీరా చూస్తే ఆయన పూర్తిగా క్షేమంగా ఉన్నారని మావోయిస్టు పార్టీ ప్రకటించుకున్నది విదితమే.ఇప్పుడు వస్తున్న ప్రచారానికి కూడా ఆధారాలు లేవు.

# అమరావతికి కేంద్రం పూర్తి సహకారం

## అగ్రగామి ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం!

### బ్యాంకుల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్!!




గుంటూరు : అమరావతి నిర్మాణ పనులు మళ్లీ ప్రారంభించడం అంటే ఒక యజ్ఞం వంటిదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అమరావతిలో బ్యాంకు నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య ఆహ్వానితులుగా హాజరైన కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఒక ప్రణాళిక ప్రకారం నూతన రాజధాని నిర్మాణం అంటే సామాన్యమైన విషయం కాదన్నారు. ఆర్థికంగా ఎంతో వ్యయప్రయాసలను కూర్చాల్సి ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని దేశంలోనే అగ్రగామి ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. అమరావతి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో రూ. 1334 కోట్ల వ్యయంతో 25కు పైగా బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. అమరావతి నిర్మాణం ఆగిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజధాని పునర్నిర్మాణానికి అంకితభావంతో పనిచేయడం శుభ పరిణామంగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంకల్పం కలిసి రాష్ట్రానికి కొత్త దిశానిర్దేశం చేస్తున్నాయన్నారు. రాజధాని మౌలిక వసతుల కల్పన కోసం, ప్రత్యేకించి ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కట్టుబడి ఉందన్నారు. అమరావతి అభివృద్ధికి అవసరమైన నిధులను, సాంకేతిక సహకారాన్ని కేంద్రం అందిస్తుందని వివరించారు. ఒకే ప్రాంతంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్‌తో పాటు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు చెందిన 25కు పైగా బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాలు ఏర్పాటు కావడం అనేది అత్యంత అరుదైన, కీలకమైన ఘట్టంగా పేర్కొన్నారు. ఈ "ఫైనాన్షియల్ హబ్" కేవలం భవనాల నిర్మాణం మాత్రమే కాదు అన్నారు. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పునాది అని స్పష్టం చేశారు. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో అమరావతి ఒకటిగా నిలవడానికి ఈ పెట్టుబడులు దోహదపడతాయి అన్నారు. ఈ కేంద్ర కార్యాలయాలు రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మారుస్తాయన్నారు. ఈ బహుళ ప్రధాన కార్యాలయాల ఏర్పాటు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా బ్యాంకింగ్, బీమా రంగాల్లో నైపుణ్యం కలిగిన మానవ వనరులకు అమరావతి ఒక కేంద్రంగా మారుతుందన్నారు. ఇది రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను గణనీయంగా పెంచుతుందని తెలియజేశారు. బ్యాంకులన్నీ రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవటం బాధ్యతగా భావించాలన్నారు. బ్యాంకులు కేవలం కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలు ఇవ్వడానికే పరిమితం కావొద్దని సూచించారు. దానిని మించి ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలన్నారు. రైతులు దేశానికి పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. మహారాష్ట్ర నుంచి అరటి, తమిళనాడు నుంచి కొబ్బరి ఢిల్లీ , ముంబై లాంటి ప్రాంతాలకు రైళ్లలో తరలుతున్నాయన్నారు. ఏపీలోని రాయలసీమలో ఉన్న 9 జిల్లాల నుంచి ఉద్యాన ఉత్పత్తులు ఇతర రాష్ట్రాల మార్కెట్ లకు తరలించడానికి బ్యాంకులు సహకరించాలన్నారు. ప్యాకింగ్, కోల్డ్ చెయిన్ లాంటి పరిశ్రమల్ని కూడా ప్రోత్సహించాలని గుర్తుంచుకోవాలన్నారు. గతంలో మహిళల్ని బీమా ఏజెంటుగా మార్చేందుకు మహిళా సఖి పేరిట కార్యక్రమం ప్రారంభిస్తే అద్భుత ప్రయోజనాలు వచ్చాయని గుర్తు చేశారు. ఎప్పుడు ఆంధ్రప్రదేశ్ గురించి మాట్లాడినా ప్రధాని మోదీ తక్షణం అమోదిస్తారన్నారు. విభజన తర్వాత ఇబ్బందులు ఎదుర్కొన్న ఆంధ్రప్రదేశ్‌కు పూర్తిగా సహకరించాలని ప్రధాని మోదీ స్పష్టం చేశారన్నారు. ఏడాదిన్నరలో ఏపీ ఫ్యూచరిస్టిక్ కేపిటల్ నగరం అవుతుందన్నారు. అమరాతిలో కాస్మోస్ ప్లానెటోరియం నిర్మించాలని కోరుతున్నామన్నారు. ఆచార్య నాగార్జునుడు లాంటి శాస్త్రీయ పరిశోధకులు నివసించిన ప్రాంతం ఏపీ అన్నారు. రేర్ ఎర్త్ మినరల్స్ పై కూడా కేంద్రం ఓ కీలకమైన నిర్ణయం తీసుకుందని, రంగంలో కూడా ఏపీ పనిచేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇటీవల ఆర్థికంగా ఎదుర్కొన్న సవాళ్లను అధిగమించి, స్థిరమైన ప్రగతిని సాధించే దిశగా ప్రయాణించాలని కేంద్రం ఆకాంక్షిస్తోందన్నారు. కేంద్రం అందిస్తున్న నిధులను సక్రమంగా, పారదర్శకంగా వినియోగిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని కేంద్రమంత్రి ఈ సందర్భంగా కోరారు.

రాష్ట్రం తీసుకునే ప్రతి ఆర్థిక నిర్ణయానికి కేంద్రం అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు. ఈ శంకుస్థాపన కార్యక్రమం అమరావతి చరిత్రలో ఒక నూతన అధ్యాయమని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తును సాధిస్తుందని కేంద్రమంత్రి సీతారామన్ ఆశాభావం వ్యక్తం చేశారు.




## జనవరి 1న ఆయుధాలు విడిచి లొంగిపోతాం: మావోయిస్టులు

భద్రాచలం: మావోయిస్టులు కీలక ప్రకటన చేశారు. ఎంఎంసీ(మహారాష్ట్ర-మధ్యప్రదేశ్-ఛత్తీస్‌గఢ్) జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో లేఖను విడుదల చేశారు. జనవరి 1న ఆయుధాలను విడిచి లొంగిపోతామని అందులో పేర్కొన్నారు. ఒక్కొక్కరు బదులుగా అందరం ఒకేసారి లొంగిపోతామని తెలిపారు. మావోయిస్టు అగ్రనేతలు మల్లోజుల, ఆశన్న లొంగుబాటు, హిడ్మా ఎన్‌కౌంటర్‌తో పార్టీ బలహీనమైందని పేర్కొన్నారు. మిగతావారు లొంగిపోవాలన్న కేంద్రం విజ్ఞప్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. 2026 జనవరి 1న సాయుధ పోరాటాన్ని విరమించుకుంటామన్నారు. ఆయుధాలు అప్పగించి ప్రభుత్వ పునరావాసాన్ని అంగీకరిస్తామని చెప్పారు. తమకు సహకరించే రాష్ట్రంలో లొంగిపోవడానికి సిద్ధమని పేర్కొన్నారు. అందరూ లొంగిపోయే వరకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రభుత్వాలు సంయమనం పాటించాలని కోరారు. జనజీవన స్రవంతిలో కలిసేందుకు తమకు కొంత సమయం కావాలని గతవారం మావోయిస్టులు లేఖ రాసిన సంగతి తెలిసిందే.

# సర్పంచ్ ఎలక్షన్స్‌పై కాంగ్రెస్ ఫోకస్!

## సీఎం రేవంత్ ప్లాన్ అదిరిందిగా.. ప్రతిపక్షాలకు ఇక చుక్కలే?

## నేరుగా రంగంలోకి సీఎం రేవంత్‌రెడ్డి!!




హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని పల్లెల్లో ఎన్నికల వేడి రాజుకుంది. సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ రావడంతో పల్లెలు మొత్తం ప్రచారాలతో కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా ఈ ఎలక్షన్స్ ను రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతలుగా నిర్ణయించింది. మొదటి విడత ఎన్నికలు డిసెంబర్ 11న, డిసెంబర్ 14న, డిసెంబర్ 17వ తేదీన నిర్వహించనున్నారు.

మొదటి విడత ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. అలా నడుస్తున్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అని చెప్పి దానిపై చట్టం చేయాలనుకుంది. కానీ గవర్నర్,కేంద్ర ప్రభుత్వం సపోర్ట్ చేయకపోవడంతో పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది. ఈ విధంగా కాంగ్రెస్ లో పోటీ చేసే అభ్యర్థులకు సింహ భాగం బీసీలకు ఇవ్వాలని నిర్ణయించుకుంది. కాబట్టి పార్టీ నుంచి 42% రిజర్వేషన్ సీట్లు ఇవ్వాలని అనుకుంటుంది. ఇదిలా నడుస్తున్న సమయంలో ప్రతిపక్షాల్లో పెద్దగా సర్పంచ్ ఎన్నికలపై ఆసక్తి ఉన్నట్టు కనిపించడం లేదు. ముఖ్యంగా చాలా గ్రామాల్లో జనరల్ సీటు కేటాయించడం వల్ల ఆ సీట్లలో ఎక్కువ మంది బీసీలే పోటీకి ముందుంటున్నారు. అంతేకాదు కాంగ్రెస్పార్టీ పరంగా కూడా బీసీలకి ప్రాధాన్యత ఇస్తుంది. అయితే ఇతర పార్టీల నుంచి పోటీ చేసేవారు చాలా ఇరుకునపడ్డారు. ముఖ్యంగా 42% పార్టీ పరంగా కాంగ్రెస్ అమలు చేస్తూ ఉండడంతో ఇతర పార్టీల నుంచి అది అమలు చేయడం చాలా కష్టం అవుతుంది. దీనివల్ల చాలామంది గ్రామాల్లో ఉండే బీసీలు, బీసీ అభ్యర్థులకు సపోర్ట్ చేసే అవకాశం ఉంది. ఇదే కాకుండా సీఎం రేవంత్ రెడ్డి కూడా గ్రామాల్లో మంచి మైలేజ్ రావాలని జిల్లాల టూర్లు పెట్టుకున్నారు. ఒకటో తేదీ నుంచి టూర్లు ప్రారంభమవుతాయి. దీంతో ఆయన గ్రామాల్లో చేసే అభివృద్ధిపై ఉపన్యాసం అందిస్తారు. అలా గ్రామాల్లో సీఎం మాటల వల్ల కూడా కాంగ్రెస్ అభ్యర్థులకు వచ్చే అవకాశం ఉంది. మరీ ముఖ్యంగా ఇందిరమ్మ చీరలు కూడా ఈ మధ్యకాలంలోనే పంపిణీ చేయడంతో మహిళలంతా చాలా ఆనంద పడుతున్నారు. ఈ విధంగా అన్ని అంశాలు కలిసి వచ్చేటట్టు చేసి సర్పంచ్ ఎన్నికలకు సంసిద్ధం అయింది కాంగ్రెస్ సర్కారు.




## జిల్లాల పర్యటనకు సిద్ధమైన సీఎం రేవంత్..షెడ్యూల్ ఇదే..

హైదరాబాద్: జిల్లాల పర్యటనకు సీఎం రేవంత్ సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసింది. మొత్తం ఆరు రోజుల పాటు సీఎం జిల్లాల టూర్ కొనసాగనుంది. ఆరు రోజులు ఆరు జిల్లాల్లో సీఎం రేవంత్ పర్యటించనున్నారు.

**సీఎం రేవంత్ పర్యటన షెడ్యూల్ ఇదే..** డిసెంబర్ 1న మహబూబ్ నగర్ జిల్లా మక్తల్, డిసెంబర్ 2న ఖమ్మం జిల్లా కొత్తగూడెం, డిసెంబర్ 3న కరీంనగర్ జిల్లా హుస్నాబాద్, డిసెంబర్ 4న ఆదిలాబాద్, డిసెంబర్ 5న నర్సంపేట, డిసెంబర్ 6న నల్గొండ జిల్లా దేవరకొండ,

**పంచాయతీ ఎన్నికలే టార్గెట్..** కాగా, తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో త్వరలో పంచాయతీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. మొదటి విడత వచ్చే నెల డిసెంబర్ 11, రెండో విడత డిసెంబర్ 14, మూడో విడత డిసెంబర్ 17వ తేదీన ఉంటుంది. అయితే, ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన చేపట్టనున్నారని తెలుస్తోంది. తాజాగా, సీఎం రేవంత్ జిల్లాల పర్యటన ప్రకటనతో కాంగ్రెస్ శ్రేణుల్లో మరింత జోష్ నెలకొంది.




నయా భారత్ ఎలాంటి బెదిరింపులకు తలొగ్గదని, పౌరుల రక్షణ కోసం ఎంత దూరమైనా వెళ్తుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. కర్ణాటక పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ.. శుక్రవారం ఉడుపిలోని ప్రసిద్ధ శ్రీకృష్ణ మఠాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా లక్ష కంఠ భగవద్గీత పఠనంలో పాల్గొని గీతా పారాయణం చేశారు. అనంతరం భక్తులు, గాయకులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. "గీతలో శ్రీకృష్ణుడి బోధనలు ప్రతి యుగానికి సంబంధించినవి. మన జాతీయ విధానాన్ని అవి నిర్దేశిస్తాయి. ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలని కృష్ణుడు బోధించాడు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్', 'సర్వజన్ హితయ' అనే నినాదాలు గీత నుంచి స్ఫూర్తి పొందినవే. మహిళల రక్షణపై శ్రీ కృష్ణుడి సందేశమే.. రిజర్వేషన్ల చట్టానికి మార్గనిర్దేశనం. శాంతి, సత్యాన్ని సాధించడం కోసం అవసరమైతే దురాగతాలకు పాల్పడే వారిని అణచివేయాలని గీత మనకు బోధిస్తుంది" అని మోదీ తెలిపారు. "గతంలో ఉగ్రదాడులు జరిగినప్పుడు అప్పటి ప్రభుత్వాలు ఏమీ చేయకుండా చూస్తుండిపోయాయి. కానీ, నయా భారత్ అలా కాదు. ఎవరి ముందు తలవంచదు. దేశ రక్షణ విషయంలో ఎన్నటికీ వెనుకడుగు వేయదు. ఆపరేషన్ సిందూర్‌లో మన సంకల్పాన్ని ప్రపంచం చూసింది. మన మిషన్ సుదర్శన చక్ర.. శత్రువులను నాశనం చేస్తుంది" అని మోదీ వెల్లడించారు. శ్రీకృష్ణుడి స్ఫూర్తితో దేశానికి సుదర్శన చక్ర భద్రతా కవచాన్ని ఏర్పాటు చేయనున్నట్లు గతంలో ప్రధాని తెలిపిన సంగతి తెలిసిందే. రాబోయే పదేళ్లలో దేశంలోని అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో సాంకేతిక ఆధారిత వ్యవస్థల ద్వారా పూర్తిస్థాయి సురక్షా కవచం ఏర్పాటు చేయడమే ఈ మిషన్ ఉద్దేశం.

**మోదీ అర్జునుడు..** అంతకుముందు ఉడుపిలో మోదీ రోడ్ షో నిర్వహించారు. అనంతరం కృష్ణ ఆలయానికి చేరుకున్న ప్రధానికి పుతిగే మఠాధిపతి సుగుణేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అష్ట మఠాధిపతులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కనకన కిండి (కిటికీ) నుంచి శ్రీకృష్ణుడి మూలవిరాట్‌ను మోదీ దర్శించుకున్నారు. అనంతరం లక్ష కంఠ భగవద్గీత పారాయణంలో ప్రధాని పాల్గొన్నారు. గీతలోని 10 శ్లోకాలను ఆయన అలవోకగా పఠించారు. ఈ సందర్భంగా మఠాధిపతి మాట్లాడుతూ ప్రధానిపై ప్రశంసలు కురిపించారు. మోదీ అర్జునుడంటూ కొనియాడారు. ప్రధాని సేవలను ప్రశంసిస్తూ.. 'భారత భాగ్య విధాత' అనే బిరుదును ప్రదానం చేశారు.




హైదరాబాద్, నవంబరు28 : పంచాయతీ ఎన్నికల నిర్వహణపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ దశలో ఎన్నికలపై స్టే విధించలేమని స్పష్టం చేసింది న్యాయస్థానం. సబ్ క్యాటగిరీ రిజర్వేషన్ లేనందుకు మీరు ఎన్నికలు రద్దు చేయాలని కోరుకుంటున్నారా..? అని పిటీషనర్‌ను ప్రశ్నించింది హైకోర్టు. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ జీవో- 46పై హైకోర్టులో ఇవాళ (శుక్రవారం) విచారణ జరిగింది. 42 శాతం రిజర్వేషన్ జీవో విచారణ సమయంలో పాత పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని తామే చెప్పినట్లు హైకోర్టు గుర్తు చేసింది.

గతంలో 2009లో ఇదే తరహా పరిస్థితి వచ్చినప్పుడు జీహెచ్ఎంసీ ఎలక్షన్‌ను రద్దు చేశారని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలపగా.. ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చాక కోర్టుల జోక్యం ఉండకూడదని ఈసీ అడ్వొకేట్ చెప్పుకొచ్చారు. అయితే, ఈ దశలో తాము ఎలాంటి జోక్యం చేసుకోలేమని మరోసారి స్పష్టం చేసింది న్యాయస్థానం. తామే ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించి, తామే స్టే ఎలా ఇస్తాం..?? అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. ఈ క్రమంలో డెడికేటెడ్ కమిషన్ రిపోర్టును బహిర్గతం చేసి కాపీ ఇవ్వాలని కోరారు పిటిషనర్ న్యాయవాది. ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. సబ్ కేటగిరి రిజర్వేషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆరు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని న్యాయస్థానం హుకుం జారీ చేసింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది హైకోర్టు.

## రాష్ట్రాల అధికారాలను హరించే విధంగా కేంద్ర విత్తన బిల్లు: మంత్రి తుమ్మల

హైదరాబాద్, నవంబరు28 : కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన విత్తన ముసాయిదా బిల్లుపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను హరించే విధంగా కేంద్ర విత్తన బిల్లు ఉందని మండిపడ్డారు. ఇవాళ(శుక్రవారం) ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీలో సెంట్రల్ డ్రాఫ్ట్ సీడ్స్ బిల్లు-2025 రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు మంత్రి తుమ్మల. విత్తన ముసాయిదా బిల్లుపై సర్టిఫికేషన్ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండాలని సూచించారు. నకిలీ విత్తనాలను నియంత్రించాలంటే రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేకపోతే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. విత్తన ముసాయిదా బిల్లుపై అభ్యంతరాలు, సవరణలు రాష్ట్ర ప్రభుత్వం తరపున పంపాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. జిల్లాల వారీగా రైతు సమావేశాలు నిర్వహించి సంబంధిత అధికారులు అభిప్రాయ సేకరణ చేయాలని ఆదేశించారు. పంట నష్ట పరిహారం విషయంలో విత్తన ముసాయిదా బిల్లులో స్పష్టత లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వ పక్షాన కేంద్ర ముసాయిదా విత్తన బిల్లుపై అభ్యంతరాలు, సవరణలు గట్టిగానే తెలుపుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు.




దిల్లీ: విమానంలో శబరిమల వెళ్లే అయ్యప్పస్వామి భక్తులకు శుభవార్త. శబరిమల దర్శనానికి వెళ్లే అయ్యప్ప స్వాములు విమాన ప్రయాణం సమయంలో తమ పవిత్ర ఇరుముడిని (కొబ్బరికాయతో సహా) ఇప్పుడు చేతి సామానుగా తమతో పాటు తీసుకెళ్లే విధంగా ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు అమలులో ఉన్న భద్రతా నియమావళి ప్రకారం ఇరుముడిని తప్పనిసరిగా చెక్-ఇన్ లగేజీగా పంపాల్సిరావడం వల్ల భక్తులు కొంత అసౌకర్యాన్ని ఎదుర్కొన్నారు. ఈ సమస్యపై తీవ్రంగా దృష్టి సారించిన రామ్మోహన్ నాయుడు.. భక్తుల విశ్వాసాలను పరిగణనలోకి తీసుకుని, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, సంబంధిత భద్రతా సంస్థలతో సమన్వయం చేసుకుని, అయ్యప్ప స్వాముల కోసం ప్రత్యేక మినహాయింపు అమలు చేయాలని నిర్ణయించారు. ఈ ప్రత్యేక సడలింపు ఈ రోజు నుంచి జనవరి 20 వరకు దేశవ్యాప్తంగా వర్తిస్తుందని తెలిపారు. ఈ కాలంలో శబరిమల యాత్రకు వెళ్లే భక్తులు, ఎయిర్‌పోర్టు భద్రతా తనిఖీలను పూర్తి చేసిన అనంతరం, తమ ఇరుముడిని చేతి సామానుగా విమాన క్యాబిన్‌లో తమతో పాటు తీసుకెళ్లవచ్చు. అయితే.. భక్తులందరూ ఎయిర్‌పోర్టు భద్రతా సిబ్బందికి పూర్తిగా సహకరించి, సూచించిన మార్గదర్శకాలను సమయానికి పాటించాలని రామ్మోహన్ నాయుడు సూచించారు. ఇరుముడి స్క్రీనింగ్, తనిఖీ ప్రక్రియల విషయంలో అధికారుల సూచనలను కచ్చితంగా అనుసరించాలని, శబరిమల యాత్ర పవిత్రతకు ఏమాత్రం భంగం కలగకుండా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. అయ్యప్ప స్వామి భక్తుల దీక్ష, భక్తి, ఆచార వ్యవహారాల పట్ల గౌరవంతో తీసుకున్న ఈ నిర్ణయం.. దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి విమాన మార్గం ద్వారా శబరిమల చేరే భక్తులకు ప్రయాణ సౌలభ్యం కల్పిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. భక్తులందరికీ అయ్యప్ప స్వామి ఆశీస్సులతో శాంతి, ఆరోగ్యం, సుఖసమృద్ధులు కలగాలని ఆకాంక్షించారు.




## ఢిల్లీలో తెలంగాణ పోలీసుల ఆపరేషన్.. వెలుగులోకి సంచలన విషయాలు

హైదరాబాద్, నవంబర్ 28: డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు ఈగల్ టీమ్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో తెలంగాణ ఈగల్ టీమ్, ఎన్‌సీబీ, ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు సంయుక్తంగా జరిపిన ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. న్యూఢిల్లీలోని 20 ప్రాంతాల్లో.. గడువు తీరిన 50 మందికిపైగా నైజీరియన్లు ఉంటున్నట్లు గుర్తించింది. వారిని ఈ టీమ్ అదుపులోకి తీసుకుంది. నోయిడా, గ్వాలియర్, విశాఖపట్నం తదితర నగరాల్లో ఈ డ్రగ్స్‌తో సంబంధాలు ఉన్న కీలక నిందితులను అరెస్ట్ చేసింది. నాలుగు ప్రాంతాల్లో 5,340 ఎక్స్ సిటీ మాత్రలు, 250 గ్రాముల కొకైన్, 109 గ్రాముల హెరాయిన్, 250 గ్రాముల మెథాంఫెటమైన్‌ను సీజ్ చేసింది. ఢిల్లీలోని 59 మ్యూల్ ఖాతాలతోపాటు 16 డ్రగ్స్ కేంద్రాలను గుర్తించింది. ఇక నైజీరియాకు చెందిన 107 బ్యాంకు ఖాతాలు ఈగల్ టీమ్ స్తంభింప జేసింది. మల్నాడు రెస్టారెంట్, మహీంద్రా యూనివర్సిటీ కేసులో నైజీరియన్ నిక్‌ను అరెస్ట్ చేసింది. దేశవ్యాప్తంగా ఈ ముఠాతో దాదాపు 2 వేలకు పైగా డ్రగ్స్ వినియోగదారులు,పెడ్లర్లు ఉన్నట్లు ఈగల్ టీం గుర్తించింది. ఢిల్లీ నుంచి డ్రగ్స్ పార్శిళ్లు.. బూట్లు, దుస్తులు, కాస్మోటిక్ వస్తువులు, చెప్పులు మధ్యలో డ్రగ్స్ పెట్టి కొరియర్ ద్వారా సప్లై చేసినట్లు పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది. శ్రీ మారుతి కొరియర్స్, డీటీడీసీ, ప్రొఫెషనల్ కొరియర్స్, షిప్ రాకెట్, ఇండియా పోస్ట్, ఢిల్లీ వేరీ, బ్లూ డార్ట్, ట్రాక్ ఆన్ తదితర కొరియర్స్ నెట్‌వర్క్‌ను ఈ నైజీరియన్ ముఠా ఉపయోగించినట్లు ఈ కేసు విచారణలో బహిర్గతమైంది.

మరికొద్ది రోజుల్లో నూతన సంవత్సర వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో డ్రగ్స్ కంట్రోల్‌కు ఈగల్ టీమ్ భారీ ఆపరేషన్ చేపట్టింది. ఈ సందర్భంగా అంతర్జాతీయ డ్రగ్స్ ఆపరేషన్‌ను ఛేదించింది. ఢిల్లీలో అరెస్ట్ చేసిన 50 మందిని హైదరాబాద్‌కు తరలించేందుకు ఈ టీమ్ ఇప్పటికే చర్యలు చేపట్టింది. వీరిని హైదరాబాద్‌కు తరలించిన తర్వాత కోర్టులో హాజరుపరచనుంది. అనంతరం వీరిని మరింత లోతుగా విచారణ జరపనుందని తెలుస్తోంది. ఈ విచారణలో మరిన్నీ కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని ఈగల్ టీమ్ భావిస్తోంది. ఈ విచారణలో వీరు చెప్పే కీలక ఆధారాలతో మరిన్ని అరెస్ట్‌లు జరిగే అవకాశం ఉందని సమాచారం.

## తెలంగాణ కోసం కేసీఆర్ చేసిన దీక్ష ఒక నాటకం: టీపీసీసీ చీఫ్ మహేశ




హైదరాబాద్: తెలంగాణ సెంటిమెంట్‌ను కేసీఆర్ వాడుకున్నారని, ఇప్పుడు దీక్షా దివస్ పేరుతో మరోసారి సెంటిమెంట్ రాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ కోసం కేసీఆర్ చేసిన దీక్ష ఒక నాటకమన్నారు. "కేసీఆర్ మూడు రోజులకే దీక్ష ముగించి పలాయనం చిత్తగించారు. దీక్షను మధ్యలోనే విరమిస్తే విద్యార్థి సంఘాల నుంచి వ్యతిరేక వచ్చింది. కేవలం కేసీఆర్ వల్ల తెలంగాణ రాలేదు. కాంగ్రెస్ వల్ల తెలంగాణ వచ్చింది. పొట్టి శ్రీరాములు చేసిన దీక్షకు.. కేసీఆర్ దీక్షకు పొంతన లేదు. ఉద్యమంలో పాల్గొన్న పేదలు, విద్యార్థులు, ఎస్సీలు, ఎస్టీలు ఆత్మార్పణం చేసుకున్నారు. వారి త్యాగాల వల్ల వచ్చిన రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం పదేళ్లు దోచుకుంది. సోనియా గాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైంది"అని మహేశ్‌కుమార్ అన్నారు.

## జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీల విలీనాన్ని వ్యతిరేకిస్తున్నాం: తెలంగాణ భాజపా



హైదరాబాద్: జీహెచ్ఎంసీలో పలు మున్సిపాలిటీలను విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామ్‌చందర్‌రావు వెల్లడించారు. మున్సిపాలిటీ విలీనం అశాస్త్రీయంగా ఉందన్నారు. మజ్లిస్ పార్టీకి లబ్ధి చేకూర్చేందుకే మున్సిపాలిటీలను విలీనం చేస్తున్నారని ఆరోపించారు. విలీనంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు.




## ఒకరు ఎనిమిదో తరగతి.. మరొకరు తొమ్మిదో తరగతి.. విజయవాడ టు హైదరాబాద్..

విజయవాడ : ప్రేమ కోసం ఎంతటి సాహసానికైనా దిగుతారు ప్రేమికులు. జీవితంలో స్థిరపడి ప్రేమించి పెళ్లి చేసుకుంటే వారి లైఫ్ ఆనందంగా సాగిపోతుంది. కానీ ఇప్పుడు ఉన్న యువత అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తోంది. వయస్సు ఆకర్షనో, సినిమాల ప్రభావమో, సోషల్ మీడియా ఎఫెక్టో తెలియదు కానీ స్కూల్ ఏజ్‌లోనే పిల్లలు ప్రేమ అంటూ పిచ్చిపనులు చేస్తున్నారు. ప్రేమే లోకంగా భావిస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు. చిన్న వయస్సుల్లోనే తప్పటడుగులు వేస్తూ జీవితాన్ని నాశనం చేసుకునే పరిస్థితికి వస్తున్నారు. ఇప్పుడు మనం చెప్పుకోయేది ఇలాంటి ఘటనే. ఓ ఇద్దరు మైనర్లు ప్రేమ అంటూ ఇంట్లోంచి వెళ్లిపోయారు. వారి వయస్సు, వారు చదవే తరగతి గురించి తెలిస్తే షాక్ అవకుండా ఉండలేరు. చివరకు ఎలాగోలా పోలీసులకు చిక్కడంతో కథ సుఖాతమైంది. విజయవాడ కృష్ణలంకలో ఇద్దరు విద్యార్థులు అదృశ్యమవడం కలకలం రేపుతోంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విద్యార్థుల కోసం వేట మొదలు పెట్టారు. చివరకు వారి సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా ఆ ఇద్దరు హైదరాబాద్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఎట్టకేలకు అదృశ్యమైన విద్యార్థులను పట్టుకున్నారు. ఇంటి అద్దె కోసం తిరుగుతున్న మైనర్లను గుర్తించిన ఓ ఆటో డ్రైవర్ వారి వివరాలను తెలుసుకున్నాడు. ఆపై పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్ లొకేషన్‌తో విద్యార్థులను పోలీసులు పట్టుకున్నారు.

ఆ ఇద్దరూ ప్రేమించుకున్నామని అనుకుని ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు విచారణలో తేల్చారు. అయితే బాలిక తొమ్మిదో తరగతి చదువుతుండగా... బాలుడు ఎనిమిదో తరగతి చదువుతున్నట్లు తెలుసుకుని పోలీసులు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ప్రభావంతో ప్రేమించుకున్నామనుకున్న ఆ విద్యార్థులు.. ఇంటి నుంచి పారిపోయి స్వతంత్రంగా ఉండాలని భావించినట్లు తెలుస్తోంది. చివరకు పోలీసులకు చిక్కారు. కాగా.. పిల్లల నడవడికపై ఎప్పటికప్పుడు తల్లిదండ్రుల పరిశీలన ఉండాలని పోలీసులు చెబుతున్నారు. తమ పిల్లలను క్షేమంగా ఇంటికి చేర్చడంతో కృష్ణలంక పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

చురకలు

శనివారం 29 నవంబర్ 2025

# నవంబర్ 29... గురునానక్ జయంతి



పదిమంది సిక్కు గురువులలో ప్రధములు గురునానక్ దేవ్. 1469లో పాకిస్తాన్ లోని ప్రస్తుతం లాహోర్ సమీపంలోని తల్వాండీ గ్రామంలో (నన్కానా సాహిబ్)లో నానక్ దేవ్ కార్తీక పౌర్ణమి పుణ్య దినాన నవంబర్ 29న హిందూ కుటుంబంలో జన్మించారు. హిందూ ఇస్లామియా మత గ్రంథాలను చదివి, అవగాహన చేసుకుని, రెండు మతాలకు భిన్నమైన సిక్కు మతాన్ని స్థాపించారు. సిక్కు మతం ఏకేశ్వరోపాసక మతం. సిక్కులు ఏక్ ఓంకార్ (ఏకైక దేవుడు)ని విశ్వసిస్తారు. సిక్కుమత స్థాపకులై, ఏకేశ్వరోపాసనను ప్రబోధించి, కుల వ్యవస్థను వ్యతిరేకించారు. నానక్ దేవ్ అనంతరం ఈ గురు పరంపర కొనసాగు తున్నది. ఐదవ గురువు అర్జున్ తమకు ముందు గురువులకు దైవం అనుగ్రహించిన సూక్తులను, బోధనలను సంకలనం చేసి, "గురుగ్రంథ సాహిబ్" పవిత్ర గ్రంథ రూప కల్పన గావించారు. నానక్ తండ్రి కళ్యాణ్ చంద్ దాస్ కలుమెహతాగా సుపరిచితులై, ప్రభుత్వంలో భూ రెవెన్యూ వ్యవహారాల గుమాస్తాగా పని చేసే హిందూ పట్వారీ. తల్లి మాతా త్రిపుర, అక్క బీబీ నాన్కీ, నానక్ దేవ్ బాల్యం నుండే ప్రశ్నించే, ఆలో చించే తత్వం కలవారు. చిరుప్రాయంలోనే మతపరమైన ఉపనయనం చేసి, జంధ్యం వేయబోగా తిరస్కరించి, అంతకంటే భగవంతుని నిజ నామాన్ని హృదయంలో ధరిస్తామని, భగవ న్నామం యజ్ఞోపవీతం నూలుపోగులా తెగిపోవడం, మట్టిలో కలిసి పోవడం ఉండక, అఖండంగా రక్షణ కలిగిస్తుందని వాదించారు. అత్యంత చిన్న వయసునుండి అక్క బీబీనాన్కీ, తమ్మునిలో భగవంతుని జ్యోతిని చూడగా, ఈ రహస్యాన్ని ఎవరితోనూ ఆమె పంచుకోలేదు. ఆమె నాన క్ జీ తొలి శిష్యురాలిగా పేరొందారు. బాల్యంలోనే హిందూ మతంలోని తాత్వికతకు ఆకర్షితులై జీవిత రహస్యాల అన్వేషణకై ఇల్లు వదలి పోయారు. ఈ క్రమంలోనే నానక్ దేవ్ ముఖ్య తాత్వికులైన కబీర్, రవిదాస్ లను కలుసుకున్నారు. బతాలాకు చెందిన వ్యాపారి మూల్ చంద్ చోనా కూతురు సులేఖినిని వివాహ మాడారు. శ్రీచంద్, ,లక్ష్మీదాస్ అనే కుమారులు వారికి కలిగారు - 28ఏళ్ళ వయసులో నానక్ ఒక ఉదయం నది స్నానం, ధ్యానానికి వెళ్ళగా, మూడు రోజులు ఎవరికీ కన్పించలేదు. తిరిగి వచ్చి, దేవుని పవిత్రాత్మను నింపుకున్నాను అని ప్రకటించారు. అనంతరం "హిందువూ లేదు, ముస్లిమూ లేదు" అని మత సామరస్య బోధనలను వ్యాప్తి చేయడం ప్రారంభించారు.

ఆ తర్వాత నాలుగు ప్రధాన దిశల్లో టిబెట్ దక్షిణాసియాలోని పలు ప్రాంతాలు, అరేబియా, మక్కా, బాగ్దాద్, ముల్తాన్ తదితరాలలో ఉదాసీలనే పేరున భగవంతుని సందేశాన్ని ప్రబోధిస్తూ, ప్రయాణాలు సాగిం చారు. నానక్ జీవిత చరమాంకంలో ఉచిత ప్రసాదం లభించిన కర్తార్ పూర్ లో జీవించారు. తాను తీసుకునే ఆహారాన్ని కుల, మత, ధన బేధం లేకుండా పంచుకునే వారు. పొలాలలో పని చేసి, జీవితం గడిపారు. కొత్త సిక్కు గురువుగా భాయ్ లెహ్నాను ప్రకటించాక అక్టోబర్ 10న 1539లో తన 70వ ఏట స్వర్గప్రాప్తి పొందారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# 2030లో బంగారం విలువ ఎంత ఉంటుంది.?



గత రెండు దశాబ్దాలుగా బంగారం నిలకడైన వృద్ధిని నమోదు చేస్తూ పెట్టుబడిదారులకు స్థిరమైన రాబడిని ఇస్తోంది. ఆర్థిక అనిశ్చితి, ద్రవ్యోల్బణం పెరిగినప్పుడల్లా పెట్టుబడిదారులు సురక్షితమైన ఆశ్రయంగా భావించే పసిడి.. విలువ గత కొన్నేళ్లుగా సరికొత్త శిఖరాల ను తాకుతోంది. ఈ నేపథ్యంలో, 2030 నాటికి బంగారం విలువ ఎంత ఉంటుంది అనే ప్రశ్న ప్రస్తుతం పెట్టుబడిదారులలో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

**చారిత్రక వృద్ధి రేటు...** పసిడి ధరలు ఎంత వేగంగా పెరుగుతున్నాయో పరిశీలిస్తే, దాని భవిష్యత్తు అంచనాకు ఒక స్పష్టమైన చిత్రం లభిస్తుంది. 2000లో 10 గ్రాముల (24 క్యారెట్ల) బంగారం ధర కేవలం రూ.4,400 మాత్రమే... 2025 నాటికి ఇదే 10 గ్రాముల పసిడి ధర రూ.1,25,000 మార్కును తాకి కొత్త రికార్డులు సృష్టిస్తోంది. గణాంకాల ప్రకారం గత 25 ఏళ్లలో బంగారం సుమారు 14% కాంపౌండ్ వార్షిక వృద్ధి రేటు సాధించింది. ఇది ఇతర పెట్టుబడి మార్గాలతో పోలిస్తే అత్యంత ఆకర్షణీయమైన రాబడి.

**2030 నాటికి బంగారం ధర అంచనా...** ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, అంతర్జాతీయ పరిణామాలను విశ్లేషిస్తే... రాబోయే ఐదేళ్లలో కూడా పసిడి వృద్ధి ధోరణి కొనసాగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. మార్కెట్ విశ్లేషకుల అంచనా ప్రకారం ప్రస్తుత జియోపాలిటికల్ ఉద్రిక్తతలు మరియు అధిక ద్రవ్యోల్బణం కొనసాగితే, బంగారం ధరలు మరింత పెరుగుతాయి. ఈ అంచనాల ప్రకారం, ప్రస్తుతం రూ.5 లక్షల విలువ చేసే బంగారం... 2030 నాటికి రూ.10 లక్షల మార్కును దాటే అవకాశం ఉంది. ఈ అంచనా ప్రకారం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.2,00,000 లేదా అంతకంటే ఎక్కువ స్థాయికి చేరుకునే అవకాశం ఉందని భావించవచ్చు. ఇది బంగారాన్ని దీర్ఘకాలిక పెట్టుబడిగా చూసే వారికి నిజంగా ఒక శుభ సూచిక.

**బంగారం ధరలను ప్రభావితం చేసే కీలక అంశాలు...** బంగారం ధరలు కేవలం డిమాండ్‌పై మాత్రమే కాకుండా, అనేక అంతర్జాతీయ, దేశీయ అంశాలపై ఆధారపడి ఉంటాయి. యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలు వంటి అనిశ్చిత పరిస్థితులు పెరిగినప్పుడు, పెట్టుబడిదారులు సురక్షితమైన ఆస్తి అయిన బంగారం వైపు మొగ్గు చూపడం వల్ల ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరిగేటప్పుడు, కరెన్సీ విలువ తగ్గుతుంది. ఈ సమయంలో కొనుగోలు శక్తిని కాపాడుకోవడానికి బంగారంలో పెట్టుబడి పెట్టడం వల్ల దాని విలువ పెరుగుతుంది. డాలర్ బలహీనపడితే, బంగారం ధరలు పెరుగుతాయి. ఎందుకంటే అంతర్జాతీయంగా పసిడిని డాలర్‌లలో కొనుగోలు చేస్తారు. ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు తమ బంగారం నిల్వలను పెంచుకోవడం లేదా తగ్గించడం ధరలపై ప్రభావం చూపుతుంది.

**పెట్టుబడిదారులకు సూచనలు....** పెట్టుబడిదారులు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే.. బంగారం ధరలను కచ్చితంగా అంచనా వేయడం కష్టం. మార్కెట్ విశ్లేషకులు కొన్ని సలహాలు ఇస్తున్నారు. దీర్ఘకాలికంగా చూస్తే, అధిక ద్రవ్యోల్బణం నుంచి రక్షణ, ఆస్తి భద్రత కోసం పసిడి ఇప్పటికీ అత్యంత భద్రమైన పెట్టుబడిగా కొనసాగుతుంది. 2030 నాటికి బంగారం పెరుగుదల అవకాశాలు బలంగా ఉన్నప్పటికీ, పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం వివేకం. మీ పోర్ట్‌ఫోలియో అవసరాలకు అనుగుణంగా పెట్టుబడి పెట్టడం ఉత్తమం. బంగారం అనేది భవిష్యత్తు కోసం పొదుపు చేయాలనుకునేవారికి .. తమ పోర్ట్‌ఫోలియోలో వైవిధ్యం కోరుకునేవారికి ఒక అనివార్యమైన పెట్టుబడి మార్గంగా ఉంది.

# కేసిఆర్ ఆమరణ దీక్ష పూర్వాపరాలు - నేడు దీక్షా దివస్

## 2009 నవంబర్ 29... తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ, రాష్ట్ర ఏర్పాటులో సువర్ణాక్షరాలతో లిఖించ బడిన దినం.

ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ గతిని మార్చేసిన చారిత్రక సందర్భం. నాలుగున్నర కోట్ల ప్రజలను ఒక్క టి చేసి, ఊరూ వాడను ఏకం చేసి, ముక్తకంఠంతో ఉద్యమ అగ్రనేత కు యావత్ తెలంగాణ ప్రజలు మద్దతుగా నిలిచిన రోజు. తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా తెరాసను స్థాపించి, లక్ష్య సాధనకై, ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా వెరవక, అలుపెరుగని పోరాట స్ఫూర్తితో, లక్ష్య సాధన పై అకుంఠిత విశ్వాసంతో, మరణ శాస నాన్ని స్వయంగా లిఖించుకుని, సంతకించ డానికి సంసిద్ధమై ప్రాణ త్యాగానికి తెరాస అధినేత సిద్ధమైన రోజు. అదే కేసిఆర్ ఆమరణ దీక్ష ప్రారంభానికి సిద్ధమైన రోజు. కేసిఆర్ త్యాగ నిరతే ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావానికి పునాది యనేది వివాద రహిత అంశం. కాదనలేని వాస్తవం. 2009 నవంబర్ 29న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మొదలు పెట్టిన ఆమరణ దీక్ష మలి దశ ఉద్యమంలో కీలక ఘట్టంగా నిలిచి, ఢిల్లీ పాలకుల చేత రాష్ట్ర ఏర్పాటు ప్రకటనకు మూలమైన నేపథ్యం, కేసిఆర్ ఆమరణ దీక్ష సందర్భం, క్రమాను గత సంఘటనల క్రమాన్ని మననం చేసుకునే ప్రయత్నం. ఆమరణ నిరాహార దీక్షకు ముందు వ్యూహరచన, మానసిక సన్నద్ధం కోసం 26వ తేదీ సాయంత్రం కేసిఆర్ కరీంనగర్ తీగల గుట్టపల్లిలోని ఉత్తర తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అప్పటికే దీక్షకు సంబంధించి వాతావరణం వేడెక్కడంతో, ఆయనకు పార్టీ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికాయి. మహిళలు ముందుండి వీరతిలకం దిద్దారు. కేసిఆర్ తెలంగాణ భవన్‌లో బస చేయడంతో ప్రభుత్వం కరీంనగర్‌పై ప్రత్యేక దృష్టి నిలిపింది. కేసిఆర్ దీక్షను అడ్డుకోవడానికి 144 సెక్షన్ విధించడం, తెలంగాణ భవన్ వద్ద భారీగా పోలీసులు, ఇంటలిజెన్స్ వర్గాలు చేరడంతో కరీంనగర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కేసిఆర్ ఆమరణ దీక్ష చేపడుతారా, పోలీసులు అడ్డుకుంటారా అనే సంశయం యావత్ తెలంగాణ ప్రజల్లో టెన్షన్. 29న ఉదయం దీక్షకు బయలు దేరకుండా హౌజ్ అరెస్టు చేస్తారని.. మార్గమధ్యలో అదుపులోకి తీసుకుంటారని, దీక్షాస్థలి సమీపంలో అరెస్టు చేస్తారంటూ పలు ఊహాగానాలు చోటు చేసుకున్నాయి. అనాటి అర్ధరాత్రి ఎమి జరగనుందో అని 28వ తేదీ రాత్రి కరీంనగర్‌లో ఉత్కంఠ క్షణక్షణం పెరిగింది. దీక్షను అడ్డుకోవడానికి అన్ని రకాల ప్రయత్నాలు జరిగాయి. ప్రభుత్వం కేసిఆర్ బస చేసిన ఉత్తర తెలంగాణ భవనం వద్ద పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించింది. అర్ధరాత్రి 12 గంటలకు భవన్‌ను పోలీసులు చుట్టు ముట్టారు. పోలీసుల ప్రయత్నాలను ఎదుర్కోవడానికి కార్యకర్తలు, నేతలు కూడా పెద్ద సంఖ్యలో భవన్‌కు చేరుకొని కేసిఆర్ కు అండగా లోపలే ఉండి పోయారు. రాత్రంతా ధూంధాం నిర్వహించారు. కార్యకర్తలు పలుమార్లు పోలీసులపైకి రాళ్లు రువ్వడంతో ఉద్రిక్తత పెరిగింది. 29వ తేదీ ఉదయం తెలంగాణ భవన్‌లోనే మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించి ప్రభుత్వ దమనకాండను నిరసించారు. ఉత్తర తెలంగాణ భవన్ నుంచి దీక్షకు సిద్ధమయ్యారు. తర్వాత ఉదయం 7.30 గంటలకు తెరాస సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్, నాయిని నర్సింహారెడ్డి, కెప్టెన్ లక్ష్మీకాంతరావుతో కలిసి మెదక్ జిల్లా సిద్దిపేట దగ్గర రంగధాంపల్లిలో ఏర్పాటు చేసిన దీక్షా స్థలికి వాహనంలో బయలు దేరారు. భవన్‌లో కాకుండా మార్గమధ్యలో అరెస్టు చేయాలనే పక్కా వ్యూహంతో పోలీసులు కేసిఆర్ ను వెంబడించారు. కేసిఆర్ కాన్వాయ్ బయలు దేరగానే, కార్తకర్తలు, మీడియా వాహనాలు కాన్వాయ్‌ను అనుసరించకుండా అల్గునూర్ బ్రిడ్జివద్ద నిలిపివేశారు. ఎమ్మెల్యేల వాహనాలను సైతం అనుమతించ లేదు. అత్యంత నాటకీయ పరిణామాల మధ్య అల్గునూరు ఛౌరస్తా వద్ద వాహనాన్ని నిలిపివేసి కేసిఆర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టుకు నిరసనగా అల్గునూరు ఛౌరస్తాలోని రోడ్డుపై కూర్చొని కేసిఆర్ కొద్దిసేపు ఆందోళన చేశారు. కార్యకర్తలు వాహనాల టైర్లలో గాలి తీసి ముందుకు కదలకుండా చేశారు. అక్కడి నుండి కెసిఆర్‌ను మరో




వాహనంలో హుజురాబాద్, వరంగల్ మీదుగా పోలీసులు ఖమ్మం తరలించారు. ఆగ్రహించిన కార్యకర్తలు ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం చేశారు. కేసిఆర్ కు మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించడంతో.. ఖమ్మం జైలుకు తరలించగా, జైలులోనే ఆయన ఆమరణ దీక్ష ప్రారంభించారు. అలా తెలంగాణ భగ్గుమంది. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు వేల సంఖ్యలో రోడెక్కారు. జైల్లోనే గులాబీ అధినేత దీక్షతో, ఆరోగ్యం క్షీణించడంతో హైదరాబాద్ నిమ్స్ కు తరలించారు. డాక్టర్లు వద్దంటున్నా నిమ్స్ లో కూడా దీక్ష కొనసాగించిన కేసీఆర్ కేంద్రం దిగి వస్తేనే వెనక్కు తగ్గుతానని స్పష్టం చేశారు. కేసీఆర్ ఆరోగ్యం క్షీణిస్తోందన్న సమాచారంతో%% తెలంగాణలో అగ్గి రాజుకుంది. ఉస్మానియా యూనివర్సిటీ ఉరకలెత్తింది. కాకతీయ విశ్వవిద్యాలయం కదం తొక్కింది. శాతవాహన శివాలెత్తింది. పోలీసులు రబ్బరు బుల్లెట్లు వదిలినా.. బాష్పవాయు గోళాలు పేల్చినా విద్యార్థులు పిడికిళ్లు దించలేదు. డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు, మేధావులు, రాజకీయ నాయకులు, టీచర్లు, విద్యార్థులు. కోట్ల గొంతుకలు ఒక్కటయ్యాయి. 10 జిల్లాల్లో ఎటు చూసినా జై తెలంగాణ నినాదమే వినిపించింది. వరుస బంద్ లతో బస్సులు, రైళ్లు స్తంభించి పోయాయి. పరిస్థితి చేయి దాటుతుండడంతో.. అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి రోశయ్య అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఉమ్మడి రాష్ట్రానికే కట్టుబడి ఉన్న సీపీఎం మినహా మిగిలిన అన్ని పార్టీలు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు అంగీకరించాయి. ఇదే విషయం స్పష్టం చేస్తూ ఢిల్లీకి నివేదిక కూడా ఇచ్చాయి. చివరికి కేసీఆర్ దీక్ష ప్రారంభించిన 12 రోజులకు.. సరిగ్గా డిసెంబర్ 9.. 2009న కేంద్రం దిగి వచ్చి ప్రత్యేక రాష్ట్ర ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు ఆ రోజు అర్ధరాత్రి.. అప్పటి కేంద్ర హోం మంత్రి చిదంబరం ద్వారా ప్రకటింప చేశారు. ఈ ప్రకటనతో యావత్ తెలంగాణ పులకించి పోయింది. ఆందోళన స్థానంలో హర్షాతిరేకాలు చేరాయి. ధర్నాలు, నిరసన స్థానంలో సంబరాలు, విజయోత్సవాలు కనిపించాయి. అయితే రోజులోనే పూర్తిగా మారి పోయింది. తెలంగాణ ప్రకటనను అడ్డుకునేందుకు.. సీమాంధ్ర ప్రజాప్రతినిధులు రాజీనామాలతో ఒక్కటయ్యారు. సీమాంధ్ర నేతల తీరుతో కేంద్రం కూడా వెనక్కి తగ్గింది. రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను పక్కన పెట్టింది. ఈ ఆలస్యమే తెలంగాణ ఉద్యమకారుల్లో మరింత ఉద్రేకాన్ని రగిల్చింది. చివరగా అన్ని వర్గాల పోరాటంతో తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# 2025 లాస్ట్ మంత్ లో సెలవలే సెలవులు

చూస్తూండగానే 2025 టాటా కొట్టేసి వెళ్ళిపోబోతోంది. డిసెంబర్ నెలతో కౌంట్ డౌన్ మొదలవుతోంది. అలా 2025 కాల గర్భంలో కలిసేందుకు కొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. దాదాపుగా నవంబర్ పూర్తి అయింది. డిసెంబర్ లోకి ప్రపంచం అడుగుపెడుతోంది. ఈ నేపథ్యంలో కొత్త నెల అనగానే సెలవులు ఎన్ని అన్న చర్చ వస్తుంది. పైగా ఇయర్ ఎండింగ్ మంత్ కావడంతో చాలా ప్లాన్స్ ఉంటాయి. టూర్స్ బాకీ ఉంటాయి. దాంతో డిసెంబర్ మీద చాలా మంది ఫోకస్ కచ్చితంగా ఉంటుంది.

**పాతిక శాతం పైగా :** అయితే డిసెంబర్ నెలలో ఏకంగా ఎనిమిది రోజుల సెలవులు రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఉన్నాయని తెలుస్తోంది. ఇందులో నాలుగు ఆదివారాలు, ఒక సెకండ్ శాటర్ డే, 25న క్రిస్మస్ ఉన్నాయి. అలాగే క్రిస్మస్ ముందు రోజు అంటే డిసెంబర్ 24న క్రిస్మస్ ఈవ్,న కూడా ఆప్షనల్ సెలవులు ఉన్నాయి. ఇక డిసెంబర్ 26 బాక్సింగ్ డే గా సాధారణ సెలవు కూడా ఇస్తారు అని చెబుతున్నారు. ఇలా కలుపుకుంటే ఎనిమిది రోజులు అయ్యాయి అన్న మాట. క్రిస్టియన్ మిషనరీలు, ఎస్సి గురుకులాలు, క్రిస్టియన్




విద్యార్థులు ఎక్కువగా చదివే విద్యాసంస్థలకు మాత్రం ఎక్కువ రోజులు సెలవులు ఉంటాయి. క్రిస్టియన్ స్కూళ్లకు డిసెంబర్ 21 నుండి 28 వరకు 8 రోజులు సెలవులు ఉంటాయి.

**వింటర్ సీజన్ లో :** సాధారణంగా టూరిజం అంతా వింటర్ సీజన్ లోనే ఎక్కువగా నడుస్తుంది. దాంతో సెలవులు ఎక్కువగా ఉంటే బాగుంటుంది అని అంతా కోరుకుంటారు.

ఈ నేపథ్యంలో డిసెంబర్ లో ఎనిమిది రోజులు సెలవులు రావడం అంటే గ్రేటే అని అంటున్నారు. వీటితో పాటు కొత్తగా కొన్ని రోజులు సెలవులు పెట్టుకుంటే హ్యాపీగా నచ్చే ప్లేస్ కి టూర్లు చేసుకోవచ్చు. బంధువులు స్నేహితులు తమకు కావాల్సిన వారితో ఈ విధంగా టూర్లకు ప్లాన్స్ వేసుకునే వారికి డిసెంబర్ ఒక భారీ ఆఫర్ గా ఎక్కువ సెలవులు ఇస్తోంది అని అంటున్నారు.

**బ్యాంకులకు ఎక్కువే :** ఇక డిసెంబర్ నెలలో బ్యాంకులకు ఎక్కువ సెలవులు ఉన్నాయి. దాంతో కస్టమర్లు జాగ్రత్తగా తమ లావాదేవీలను చూసుకోవాల్సి ఉంది. దేశంలోని అనేక బ్యాంకులకు ఆయా చోట్ల సెలవులు కలుపుకుని బ్యాంకులకు మొత్తంగా పదహారు దాకా సెలవులు ఇస్తున్నారు. అయితే రెండు తెలుగు రాష్ట్రాలలో చూస్తే ఏడు సెలవులు కచ్చితంగా ఉన్నాయి. అవి నాలుగు ఆదివారాలతో పాటు రెండు శనివారాలు, క్రిస్మస్ డేగా ఉండబోతున్నాయి. దాంతో బ్యాంకులు ఆయా సమయంలో మూత పడతాయని అంటున్నారు.

# కొత్త అవతారంలో ర్యాపిడో.. దేశంలోనే తొలిసారిగా 'డ్రైవర్-కం-గైడ్' సేవలు

పర్యాటకులకు ఆంధ్రప్రదేశ్ అందాలను మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాపిడో సంస్థ సహకారంతో దేశంలోనే తొలిసారిగా 'డ్రైవర్-కం-గైడ్' విధానాన్ని ఏపీ పర్యాటక శాఖ ఆవిష్కరించింది. సీఎం చంద్రబాబు, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, రాపిడో సహ-వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి సమక్షంలో విశాఖలో జరిగిన సిఐఐ సదస్సులో ఈ మేరకు ఒప్పందం కుదిరింది. ర్యాపిడో-ఏపీ రాష్ట్ర ప్రభుత్వం మధ్య తదుపరి చర్చలు సఫాగా జరగడంతో దేశంలోనే తొలిసారిగా డ్రైవర్ కం గైడ్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వంతో చేసుకున్న ఎంఓయూ ద్వారా రాపిడోలో మంచి రేటింగ్ ఉన్న డ్రైవర్లను ఎంపిక చేసి, వారికి రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, ఆతిథ్యం, భద్రతపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. వచ్చే నెల నుంచి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహిస్తారు. విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం నగరాల్లో చారిత్రక, పర్యాటక స్థలాలపై ర్యాపిడో డ్రైవర్లకు శిక్షణ ఇచ్చి వారిని గైడులుగా కూడా వినియోగించుకుంటారు. ఇందుకోసం రాపిడో యాప్‌లోనే టూరిస్ట్ ఆటోలు/క్యాబ్‌లు, పర్యాటక సర్క్యూట్ల వివరాలు అందుబాటులో ఉండేలా మార్పులు చేయనున్నారు. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లలో పర్యాటకుల సౌకర్యార్థం ప్రత్యేక కో-బ్రాండెడ్ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి పర్యాటక సేవలను




సులభతరం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం - ర్యాపిడో సంయుక్తంగా నిర్ణయించాయి. దీనివల్ల క్యాబ్, ఆటో డ్రైవర్ల ఆదాయం కూడా రెట్టింపు అవుతుందని పర్యాటకులకు మంచి అనుభూతి కలుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. టెక్నాలజీ సాయంతో పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో చేపడుతున్న ఈ ప్రాజెక్ట్, పర్యాటక రవాణాలో దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని భావిస్తున్నారు. ఈ కార్యక్రమం భారతదేశంలోనే మొట్టమొదటి కార్యక్రమం కాగా, ప్రపంచవ్యాప్తంగా అరుదైన కార్యక్రమాల్లో ఒకటిగా నిలవనుందని మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీలో బైక్, ఆటో సర్వీసులను ర్యాపిడోతోపాటు ఓలా, ఉబర్ వంటి సంస్థలు అందిస్తున్నాయి. అయితే ర్యాపిడో మాత్రం గత కొంతకాలంగా ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి చొరవ చూపుతోంది. గత ఏడాది మహిళలను ప్రోత్సహించే విషయంలో ర్యాపిడో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. సుమారు వెయ్యి మంది మహిళలు ర్యాపిడో డ్రైవర్లుగా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా మెప్మా కింద మరో పది వేల మందికి ఉపాధి కల్పించేందుకు ర్యాపిడో-ప్రభుత్వం చర్చలు జరుపుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలో ఎక్కడా లేని విధంగా డ్రైవర్ కం గైడ్ సేవలను అందుబాటులోకి తేవడం వినూత్నంగా చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు నుంచి వచ్చిన ఫలితంతో ఈ సేవలను మరింత విస్తరించే అవకాశం ఉందంటున్నారు.

# చురకలు

## సంపాదకీయం

### కోర్టు దగ్గర మంత్రదండం లేదు.. సుప్రీంకోర్టు వ్యాఖ్యల వెనుక!

శీతాకాలం ఎంటరైందంటే దేశ రాజధాని ఢిల్లీలో వాతావరణం తీవ్ర ఆందోళనలు కలిగిస్తుందనే సంగతి తెలిసిందే. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఈ సమయంలో భయంకరమైన నంబర్లు చూపిస్తుంటుంది! ఈ క్రమంలో కోవిడ్ కంటే ఢిల్లీలో గాలి పీల్చడం ఎక్కువ ప్రమాదం అనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఈ సమయంలో ఢిల్లీలోని గాలి నాణ్యత విషయంలో దాఖలైన పిటిషన్ ను స్వీకరించిన సుప్రీం కీలక వ్యాఖ్యలు చేసింది. అవును... ఢిల్లీ – ఎన్సీఆర్ (నేషనల్ క్యాపిటల్ రీజియన్) ప్రాంతంలో గాలి నాణ్యత రోజు రోజుకీ దిగజారిపోతోన్న సంగతి తెలిసిందే. దీనిపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితులు ప్రతి ఏటా ఎదురవుతున్నా ప్రభుత్వం వైపు నుంచి చర్యలు ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి! ఈ సమయంలో ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ సందర్భంగా స్పందించిన సీనియర్ న్యాయవాది అపరాజిత సింగ్... పరిస్థితి ఆందోళనకరంగా ఉందని.. ఇది ఆరోగ్య అత్యవసర పరిస్థితి అంటూ తన వాదనలు వినిపించారు. దీంతో.. ఆ వాదనను కోర్టు పరిగణలోకి తిసుకుంది. ఈ సందర్భంగా... సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యాలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా స్పందించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్... న్యాయవేదిక దీనిపై ఏ మంత్రదండం ఉపయోగించగలదు అని ప్రశ్నించారు. ఢిల్లీ – ఎన్సీఆర్ ప్రమాదకరమని తెలుసని.. అయితే, ఈ సమస్యకు పరిష్కారం ఏమిటనేది ముఖ్యమని.. దీనికి గల కారణాలను గుర్తించాలని.. పరిష్కారాలు కేవలం ఆ రంగంలోని నిపుణుల నుంచే లభిస్తాయని అన్నారు. కాగా... దేశ రాజధాని, దాని చుట్టుపక్కల జిల్లాల్లో దీపావళి సందర్భంగా గ్రీన్ కాకర్స్ కాల్చడానికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది! అయితే.. కాలుష్య స్థాయిలు పెరుగుతున్నందున కొన్ని వారాల పాటు ఢిల్లీని విడిచి వెళ్లాలని వైద్య నిపుణులు ప్రజలను కోరారు. దీపావళి సందర్భంగా ఢిల్లీలోని గాలి నాణ్యత పర్యవేక్షణ కేంద్రాలు మూసివేయబడ్డాయని తెలిసిన అర్వాత.. కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్మెంట్ నుంచి తాజా పరిస్థితి నివేదికను కోర్టు కోరింది! మరోవైపు... ఉత్తర భారత మైదానాల్లో గాలి నాణ్యతను మరింత దిగజార్చే కారణాల్లో ఒకటైన రైతులు పంట వ్యర్థాలను తగలబెట్టడాన్ని అరికట్టడానికి తీసుకున్న చర్యలపైనా.. పంజాబ్, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కోర్టు నివేదికలను కోరింది.

# భారత యూనియన్లో విలీనానికి నైజాం విముఖత... నిజాం నిరంకుల పాలనపై ప్రజల తిరుగుబాటు...

## నవంబర్ 29న యథాతథ ఒప్పందం... హైదరాబాద్ విమోచన నేపథ్యం




1947 నవంబర్ 29 తేదీకి ఒక ప్రత్యేకత ఉంది. హైదరాబాద్ రాష్ట్రంలో స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్న స్థితే కొనసాగాలని నిజాం – భారత ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరిన రోజు. ఈ దిన పూర్వాపరాలు ఒక్కసారి మననం చేసుకునే చిరు ప్రయత్నం ఇది. యావత్ భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినా, నైజాం పాలిత హైదరాబాద్ రాజ్యానికి మాత్రం స్వాతంత్ర్యం రాలేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి దేశవ్యాప్తంగా 565 సంస్థానాలు ఉండేవి. బ్రిటీష్ పాలకులు స్వాతంత్ర్యం ఇస్తూనే... సంస్థానాలు ఇండియాలో కలవాలో లేదో నిర్ణయించుకునే అవకాశం సదరు పాలకులకే ఇచ్చారు. ఫలితంగా... మూడు సంస్థానాలు ఇండియాలో కలవలేదు. అవి కాశ్మీర్, జునాఘడ్, హైదరాబాద్ (నైజాం). ఆ పరిస్థితుల్లో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్... ప్రత్యేక శ్రద్ధ పెట్టి... జునాఘడ్ సంస్థానాన్ని భారత్‌లో కలిసేలా చేశారు. నైజాం నవాబ్ మాత్రం విలీనానికి ఒప్పుకోలేదు. అప్పట్లో రాజాకార్ల పేరుతో ప్రత్యేక సైన్యాన్ని తయారుచేసిన ఖాసిం రజ్వీ... మారణకాండకు తెగబడ్డారు. స్వాతంత్ర్యం వచ్చాక దాదాపు 13 నెలలపాటూ... తెలంగాణ ప్రజలు చూడని నరకం లేదు. కనీసం తినడానికి తిండి, తాగడానికి నీళ్లు కూడా లేకుండా చేశారు. పొట్ట కూటికోసం వర్తక వ్యాపారాలకై వచ్చిన శ్వేత జాతీయులు , రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంలో సమస్త భారతావనిని అంతర్భాగం చేసుకోగా, ఎన్నో సుదీర్ఘ పోరా టాలు, ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సాధించినా, నిజాం ఏలుబడిలో ఉన్న తెలంగాణ ప్రాంతం స్వతంత్రం కావడానికి సంవత్సరంకు పైగా సమయం పట్టింది. 1724–1948 మధ్యకాలం 224 సంవత్సరాల పాటు 8 తెలంగాణ జిల్లాలు, 5 మరట్వాడా జిల్లాలు, 3 కర్ణాటక జిల్లాలతో కలిపి 16 జిల్లాల హైదరాబాద్ రాష్ట్రం మూడు భాషలతో కొనసాగింది. హైదరాబాద్ సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ పరిపాలనా చివరి అంకంలో ఖాసిం రజ్వీ నేతృత్వంలో రజాకార్ల దళాల దురాగతాలు సహించరానివైనాయి. ఉద్యమ కారులను గురి చేసిన క్రూరాతిక్రూర అమానుష చిత్రహింసలకు హద్దులు లేకుండా పోయాయి. 90 రకాల పన్నుల విధింపే కాకుండా తమ పలుకు బడిలోని ప్రజలను బానిసలుగా చూస్తూ , వెట్టి చాకిరీలు చేయించు కున్నారు . ప్రజల సొమ్ముతో జల్సాలు చేసు కున్నారు. ఎదిరిస్తే కాల్చి చంపారు. మత మార్పిడులు బలవంతంగా చేశారు. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయలను అణచి వేశారు. స్థానీయ భాషలను, అనాదిగా ఉన్న సంప్రదాయాలను హీనంగా చూశారంటే తెలుగు వారి దుర్గతి స్పష్టమవుతుంది. స్వామి రామానంద తీర్థ నాయకత్వంలో ఆర్యసమాజ్, కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాయుధ పోరాటాలు, కవులు, రచయితలు తమతమ పాత్రలు నిర్వహించి, నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజా చైతన్యానికి కృషి సల్పారు. నల్గొండలో పురుడు పోసుకున్న నిజాం వ్యతిరేక పోరాటం రాజ్యం అంతటా విస్తరించింది. రావి నారాయణ రెడ్డి, చంద్ర రాజేశ్వరరావు , మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలా దేవి, బొమ్మగాని ధర్మభిక్షం, మాడపాటి హన్మంతరావు , సురవరం ప్రతాపరెడ్డి, కాళోజీ నారాయణరావు, దాశరథి, షోయబుల్లా ఖాన్, అనభేరి ప్రభాకర్ రావు, జమలాపురం కేశవరావు, లక్ష్మీనర్సయ్య, బద్ధం ఎల్లారెడ్డి, మగ్దూం మొహియుద్దీన్, దొడ్డి కొమురయ్య, కోదాడ నారాయణరావు , బెల్లం నాగయ్య, సింగిరెడ్డి భూపతిరెడ్డి, రాంజీగోండు, కొమురం భీం, రఘునాధరావు కాచే , అలుగు వీరమ్మ, కిషన్ మోదాని, లక్క కిష్టయ్య, బత్తిని మొగిలయ్య, కాటం లక్ష్మీ నారాయణ, మర్రి చెన్నారెడ్డి, వందేమాతరం రాంచందర్ రావు , కర్నె వెంకట కేశవులు ఒక్కరేమిటి... వివిధ పోరాట మార్గాలలో, ఎందరో త్యాగధనులు తమతమ పాత్రలను పోషించి, ప్రాణాలను ఫణంగా పెట్టారు. నారాయణరావు పవార్, శంశా బాద్ గంగారామ్ తో కలిసి ఏకంగా నిజాం పైనే బాంబులు విసిరి సంచలనం సృష్టించారు. దాశరథి కారాగారంలో గోడలపై నిజాం వ్యతిరేక కవితలు రాశారు. కాళోజి, సుద్దాల హనుమంతు, యాదగిరి లక్ష్మీనారాయణ లాంటి వారు జన బాహుళ్య కవితలల్లారు. ఇలా నిజాం వ్యతిరేక పోరాటాలు వివిధ రూపాల్లో ఉధృతం అయిన వేళ . . .రజాకార్ల ఆగడాలు భారత ప్రభుత్వానికి, నిజాంకు మధ్య జరిగిన అన్ని చర్చలూ విఫలమయ్యాయి. భారత దేశంలో విలీనానికి నిజాం అంగీకరించలేదు. రజాకార్ల ఆగడాలు మితిమీరి పోయాయి. మరోవైపు కమ్యూనిస్టుల సాయుధ పోరాటం సాగుతోంది. హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగా నైనా , లేక పాకిస్తాన్లో అంతర్భాగంగా నైనా ఉండాలని నిజాం ప్రయత్నిస్తూ, ఐక్య రాజ్య సమితికి నిజాం, భారతదేశంపై ఫిర్యాదు చేయడానికి దూతలను సైతం పంపాడు. పోరాటానికి దేశాల నుండి ఆయుధ సంపత్తిని పొందే కృషి సల్పారు. 1946 – 1948 ల మధ్య హైదరాబాదు రాజ్యంలో నెలకొన్న పరిస్థితులు అత్యంత ఉద్రిక్తమైనవి. హైదరాబాదుకు స్వతంత్ర ప్రతిపత్తి కావాలని ఆశిస్తూ, దాన్ని ప్రత్యేక దేశంగా గుర్తించాలని నిజాం ప్రతిపాదించాడు. ఇత్తెహాదుల్ ముస్లిమీన్ సైనిక విభాగమైన రజాకార్ల కు చెందిన ఖాసిం రజ్వి రంగంలోకి దిగడం దానివల్లనే జరిగింది.

**యథాతథ స్థితికి ఒప్పందం...** వాస్తవ పరిస్థితిని నిజాం రాజుకు అర్థమయ్యేలా చెప్పడానికి కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించి, 1947 నవంబర్ 29న యథాతథ స్థితి ఒప్పందం కుదిరింది. 1947 ఆగష్టు 15కు పూర్వపు పరిస్థితికి ఒక సంవత్సరం పాటు కట్టుబడి ఉండాలనేది ఈ ఒప్పంద సారాంశం. నవాబు స్వయంగా ఢిల్లీకి వెళ్లి సర్దార్ పటేల్‌ను కలిసి, 1947 నవంబర్ 29వ యథాతథ ఒప్పందంపై మౌంట్‌బాటన్ నిజాం నవాబు సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా హైదరాబాదులో భారత్ తరపున ఏజంట్ జనరల్‌గా కె.ఎం.మున్షీ నియమితుడయ్యాడు. అయినా నైజాం, ఆయన నియమిత సైన్యం ఆగడాలు ఆగలేదు. ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది. ఆదివాసీలు ఏకమై ఎదురు తిరిగారు. ఎంతో మంది ఉద్యమ నేతలు, కళాకారులు... అందరూ తమ ప్రాణాలు ఫణంగా పెట్టారు. ఉద్యమం అత్యంత తీవ్ర స్థితికి చేరిన స్థితిలో, కేంద్ర ప్రభుత్వం నిజాం సంస్థాన్ని ఇండియాలో కలిపేయమని సర్దార్ వల్లభాయ్ పటేల్‌కి సూచించగా, ఈ క్రమంలోనే "ఆపరేషన్ పోలో," పేరుతో నాటి భారత హోం మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ పటేల్ నేతృత్వంలో " పోలీసు చర్య" చేపట్టడం జరిగింది. జనరల్ జె. ఎన్. చౌదరి నాయకత్వంలో 1948 సెప్టెంబర్ 13 న సైనిక చర్య ప్రారంభమైంది. భారత సైన్యం విడివడి విజయవాడ, బీదర్ వైపుల నుండి నలు వైపులా ముట్టడికి ముందుకు సాగాయి. ఓటమిని తప్పించుకో లేని నిజాం, దిక్కు తోచక, లేక్ వ్యూ అతిథి గృహంలో ఉన్న భారత ఏజెంట్ మున్షీని కలిసి, లొంగు బాటు నిర్ణయాన్ని ప్రకటించాడు. బొల్లారం వద్ద నిజాం, సర్దార్ పటేల్ ముందు తలవంచి, లొంగి పోవడంతో, సైనిక చర్య సెప్టెంబర్ 17 న సఫలీకృతమైంది. తద్వారా హైదరాబాద్ రాజ్యం, భారత యూనియన్లో విలీనమైంది. నిజాం ప్రధాన మంత్రి లాయక్ అలీని తొలగించి, ఖాన్ రజ్వీని ఖైదు చేశారు. తర్వాత లాయక్, రజ్వీ పాకిస్తాన్ పారి పోయారు. శాసన సభ రద్దు చేయబడి సెప్టెంబర్ 18న సైనిక చర్యను సఫలం చేసిన జే. ఎన్. చౌదరి, సైనిక గవర్నర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు . ఎం. కె. వెల్లోడి ముఖ్యమంత్రి గా, నియుక్తు లైనారు. 1956 ఏప్రిల్ 1న నిజాంకు , భారత ప్రభుత్వానికి ఒప్పందం కుదిరి, నిజాంకు ఏడాదికి పన్నులు లేకుండా, యాభై లక్షల రూపాయల భరణం చెల్లింపు కు, ప్రపంచంలో నిజాం ఎక్కడికి వెళ్ళినా హైదరాబాద్ పూర్వపు రాజుగా బిరుదులు కొనసాగింప బడేందుకు, ప్రభుత్వం అంగీకరించింది. అలా 1956 అక్టోబర్ 31 వరకు నిజాం రాజ్ ప్రముఖ్ గా కొనసాగారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# పారిశ్రామిక దిగ్గజం జెహంగీర్ రతన్‌జీ దాదాభాయ్ టాటా - నవంబర్ 29...జె ఆర్ డి టాటా వర్ధంతి



జెహంగీర్ రతన్‌జీ దాదాభాయ్ టాటా (జె ఆర్ డి టాటా) భారతదేశ ప్రఖ్యాత పారిశ్రామికవేత్త, సాహసవంతుడు, సమాజ సేవకుడు. ఆయన భారత పారిశ్రామిక రంగానికి విశేషమైన సేవలు అందించి, టాటా గ్రూప్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లడంలో కీలక పాత్ర పోషించారు. జె ఆర్ డి టాటా 1904 జూలై 29న ఫ్రాన్స్‌లోని పారిస్‌లో జన్మించారు ఆయన తండ్రి రతన్‌జీ దాదాభాయ్ టాటా, టాటా కుటుంబానికి చెందినవారు, తల్లి సుజాన్ బ్రునో ఫ్రెంచ్ వంశస్థురాలు. జె ఆర్ డి టాటా పాఠశాల విద్య ఫ్రాన్స్, జపాన్, భారతదేశం, ఇంగ్లాండ్‌లో సాగింది. చిన్నతనంలోనే ఆయనకు విమానయానంపై ప్రత్యేకమైన ఆసక్తి ఏర్పడింది. 1929లో, జె ఆర్ డి టాటా భారతదేశంలో తొలి కమర్షియల్ పైలట్ లైసెన్స్ పొందిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఈ ఆసక్తి పునాది మీదే భారతదేశంలో విమానయాన రంగం అభివృద్ధి చెందింది. జె ఆర్ డి టాటా 1938లో టాటా గ్రూప్ చైర్మన్‌గా నియమితులయ్యారు. అప్పట్లో గ్రూప్‌లో కేవలం 14 కంపెనీలు మాత్రమే ఉన్నప్పటికీ, ఆయన నేతృత్వంలో టాటా గ్రూప్ 100కి పైగా కంపెనీలతో విస్తరించింది.

**టాటా గ్రూపులో ముఖ్యమైన కొన్ని సంస్థలు:** టాటా ఎయిర్‌లైన్స్ (ఇప్పటి ఎయిర్ ఇండియా): 1932లో జె ఆర్ డి టాటా స్థాపించిన ఈ సంస్థ భారతదేశంలో మొదటి కమర్షియల్ ఎయిర్‌లైన్‌గా మారి విమాన యానానికి కొత్త దారులు చూపింది.

టాటా స్టీల్: ప్రపంచ స్థాయిలో భారతీయ ఉత్పత్తులను చాటి చెప్పిన సంస్థ.

టాటా మోటార్స్: వాహన రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఈ సంస్థ, దేశీయ మార్కెట్లో ముందంజలో ఉంది.


టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ : 1968లో ప్రారంభమైన ఈ సంస్థ ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ సేవల్లో మార్గదర్శిగా నిలిచింది.

జె ఆర్ డి టాటా కార్మికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన టాటా సంస్థల్లో 8 గంటల పని వ్యవస్థను ప్రవేశపెట్టారు. సంపాదిత సెలవులు అందించారు. ఆరోగ్య బీమా, పింఛన్ ప్లాన్స్ వంటి ప్రయోజనాలను అమలు చేశారు.

ఇది భారతదేశం లోని అనేక ఇతర సంస్థలకు ప్రేరణగా మారింది. జె ఆర్ డి టాటా "సమాజానికి సేవ చేయడం వ్యాపారాల మూల ఉద్దేశ్యం కావాలి" అన్నది. అందుకే ఆయన టాటా మెమోరియల్ హాస్పిటల్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ వంటి ఎన్నో సంస్థలను ప్రారంభించారు. జె ఆర్ డి టాటాకు అనేక గుర్తింపులు వచ్చాయి. భారతదేశ అత్యున్నత పౌర పురస్కారం భారత రత్న (1992)తో గౌరవింప బడ్డారు. పద్మ విభూషణ్ (1955)తో కూడా సత్కరింప బడ్డారు. అంతర్జాతీయ స్థాయిలో కూడా ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. జె ఆర్ డి టాటా సూటి దృష్టి, శ్రద్ధ, అంకిత భావం, వినయం ఆయన విజయాలకు మూలాధారం. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ, టాటా గ్రూప్‌ను లాభదాయకతతో పాటు సామాజిక బాధ్యతలు నిర్వహించే సంస్థగా తీర్చిదిద్దారు. జె ఆర్ డి టాటా 1993 నవంబర్ 29న స్విట్జర్లాండ్‌లో కన్ను మూశారు. ఆయన మరణం భారత పారిశ్రామిక రంగానికి తీరని లోటు. జె ఆర్ డి టాటా జీవితాన్ని ఒక స్ఫూర్తిదాయక గాథగా చెప్పుకోవచ్చు. వ్యాపారవేత్తగా మాత్రమే కాకుండా, సమాజ సేవకుడిగా, దాతృత్వమూర్తిగా ఆయన పేరు సుస్థిరంగా నిలిచి పోతుంది. భారత దేశంలో పారిశ్రామిక విప్లవానికి జె ఆర్ డి టాటా వేసిన పునాది, ఆయన వారసత్వం ఈనాటికీ భారతీయ వ్యాపార రంగానికి మార్గదర్శిగా నిలుస్తోంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# "శబ్దానికి శాశ్వత జీవం: థామస్ ఎడిసన్ ఫోనోగ్రాఫ్ విప్లవం"

### 1877 నవంబర్ 29: శబ్దాన్ని శాశ్వతంగా మార్చిన ఫోనోగ్రాఫ్ జననం - 1877 నవంబర్ 29... థామస్ ఆల్వా ఎడిసన్ మొదటిసారిగా ఫోనోగ్రాఫ్ ప్రదర్శించిన రోజు



1877 నవంబర్ 29 ప్రపంచ శాస్త్ర–సాంకేతిక చరిత్రలో ఒక అద్భుతమైన మలుపును తెచ్చిన రోజు. ఆ రోజు థామస్ ఆల్వా ఎడిసన్ తన ప్రయోగశాలలో ఒక చిన్న పరికరాన్ని ఆవిష్కరించి చూపించాడుకానీ ఆ చిన్న పరికరం మానవ జీవితాన్ని శాశ్వతంగా మార్చేసింది. "ఫోనోగ్రాఫ్" అనే ఆ పరికరం శబ్దాన్ని కేవలం రికార్డు చేయడమే కాక, తిరిగి వినిపించ గలిగే అతి ప్రథమ యంత్రం. ఎడిసన్ దీనిని "నా జీవిత ఆవిష్కరణలలో అతి అద్భుతం" అని పేర్కొనగా, ప్రపంచం దీనిని మానవ మేధస్సు సృష్టించిన సంగీత–శబ్ద విప్లవానికి ఆరంభ బిందువుగా గుర్తించింది. ఆ కాలంలో శబ్దాన్ని మనిషి చెవులకు కాకుండా ఒక వస్తువులో నిల్వ చేయవచ్చనే ఆలోచనకే సైన్స్ ప్రపంచం ఆశ్చర్య. పోయింది. ఎడిసన్ మొదట టెలిగ్రాఫ్ యంత్రాల అభివృద్ధిలో నిమగ్నుడై ఉండగా, ఆ యంత్రాల లోపలి సూదులు వెళ్తున్న విధానం అతనికి శబ్ద తరంగాలను యాంత్రికంగా బంధించి మళ్లీ విడుదల చేసే ఆలోచనను కల్పించింది. ఇలాగే వెలసింది "టిన్ ఫాయిల్ ఫోనోగ్రాఫ్"ఏలోహపు సిలిండర్‌పై తగిలించిన టిన్ పొరపై సూదితో చెక్కబడే శబ్దపు తరంగాలను యాంత్రిక పద్ధతిలో తిరిగి వినిపించే క్రాంతికారి పరికరం. ఎడిసన్ "Mary had a little lamb" అనే వాక్యాన్ని రికార్డు చేసి మళ్లీ వినిపించగా, అక్కడున్నవారంతా ఆశ్చర్యంతో నిశ్శబ్ద మయ్యారు. ప్రథమంగా మానవ స్వరం యంత్రం ద్వారా తిరిగి వినబడిన ఆ క్షణమే శబ్ద చరిత్రకు నూతన యుగం ఆరంభమైంది. ఫోనోగ్రాఫ్ ఆవిర్భావం సంగీత ప్రపంచాన్ని పునర్నిర్మించింది. ఇంతకుముందు సంగీతం కేవలం ప్రదర్శనలోనే ఉండేదిబీ రికార్డింగ్ అనేది అసంభవం. ఈ పరికరం వచ్చిన తర్వాతే గాయకులు, వాద్యకారులు, నాటక కళాకారులు తమ కళను శాశ్వతంగా నిలుపుకునే మార్గం పొందారు. అనంతరం గ్రామోఫోన్ రికార్డులు, షెలాక్ డిస్కులు, వినైల్ ఫలకాలు, మాగ్నెటిక్ టేపులు, క్యాసెట్లు, సిడీలు, డిజిటల్ ఆడియో ఇవన్నీ ఈ మొదటి ఫోనోగ్రాఫ్ సూత్రాలే పరిపక్వ రూపాలు. ప్రపంచ సంగీత పరిశ్రమ, రేడియో ప్రసారాలు, ధ్వని శాస్త్ర పరిశోధనలు, సినిమాల నేపథ్య సంగీతం, వాయిస్ ఆర్కైవ్‌లుఇవన్నీ ఈ ఒక్క ఆవిష్కరణ నుంచి పుట్టిన పుష్కల విభాగాలు. ఎడిసన్ యంత్రం కేవలం శబ్దాన్ని నిల్వ చేయడమే కాదు, రికార్డింగ్‌ను అధ్యయనం చేసే శాస్త్రానికి కొత్త దారి చూపింది. ధ్వని రసాయనిక లక్షణాలు, యాంత్రిక తరంగాల స్వభావం, మానవ స్వరకళా విశేషాలు, సంగీత కోణాలు అన్నింటినీ శాస్త్రీయంగా విశ్లేషించే వ్యవస్థల ఆవిర్భావానికి ఇది కేంద్రబిందువైంది. ప్రపంచంలోని అనేక అరుదైన భాషల ఉచ్చారణలు, జాతి సంగీతాలు, సంస్కృతి%–%జానపద మాధుర్యాలు శాశ్వతంగా నిలిచి పోవడానికి ఫోనోగ్రాఫ్ ప్రారంభించిన శబ్ద సంరక్షణ సాంకేతికత ప్రధాన కారణం. భారతదేశం లోనూ దీని ప్రభావం త్వరగానే విస్తరించింది. రవీంద్రనాథ్ టాగోర్ కవిత్వం, వాయల్ శ్రీనివాసయ్య వంటి తొలి సంగీత విద్వాంసుల గాన ధ్వనులు, జానపద పాటలు, హరికథలు ఇవి రికార్డు కావడం వల్లే నేటి తరాలకు అందుబాటులో ఉన్నాయి. తెలుగు సంగీత%–%సాహిత్య చరిత్రలోనూ ఫోనోగ్రాఫ్ అద్భుతమైన స్థానం సంపాదించింది. తాళ్లపాక అన్నమాచార్య కీర్తనలనుంచి తొలి గాయకుల స్వరాలు నేటికీ చరిత్రగా మిగిలి ఉండటం రికార్డు సాంకేతికత వల్లే సాధ్యమైంది. 1877 నవంబర్ 29 కేవలం ఒక యంత్రం ప్రదర్శన రోజు కాదు. మానవ స్వరం, భావోద్వేగాలు, సంగీతం, సంస్కృతిఇవన్నీ కాలాన్ని దాటి ముందుకు సాగడానికి పుట్టిన రోజే. శబ్దాన్ని శాశ్వతంగా మార్చిన ఆ ఆవిష్కరణ నేడు ప్రతి ఇంటిలో ఒక రూపంలో వెలసి ఉంది. మొబైల్ ఫోన్, మ్యూజిక్ ప్లేయర్, రేడియో, పోడ్కాస్టు ఇవి ఫోనోగ్రాఫ్ వారసులు. థామస్ ఆల్వా ఎడిసన్ ఆ రోజు చేసిన ఆ చిన్న ప్రయోగం ప్రపంచాన్ని శబ్ద%–%యుగంలోకి నడిపిందిబీ ఆ ప్రయాణం నేటికీ ఆగలేదు. శబ్దాన్ని నిలుపుకునే సామర్థ్యాన్ని మానవజాతికి అందించిన ఆ రోజు సాంకేతిక చరిత్రలో అచంచలమైన స్వర్ణాక్షరాలుగా నిలిచిపోయింది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

చురకలు



## కిన్నెరసానికి మొసళ్ల బెడద!

పాల్వంచ : మొసళ్ల సంచారంతో కిన్నెరసాని కాల్వ ప్రమాదకరంగా మారింది. గత వారం వ్యవధిలో నాలుగు మొసళ్లు సంచరించి ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేశాయి. కరకవాగు సమీపంలో ఓ మొసలి ఒడ్డుకు రావడంతో కుక్కలు చూసి అరిశాయి. స్థానికులు పరిశీలించగా మొసలి కనిపించింది. మనుషులను గమనించిన మొసలి కాల్వలోకి జారుకుంది. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వచ్చి గమనించినప్పటికీ అది కనిపించలేదు. నీటి ప్రవాహం ఎక్కువ ఉండటం, నీటిరంగు మారడంతో మొసలిని పట్టుకునే అవకాశం లేదని అటవీశాఖ అధికారులు తెలిపారు.

**కాల్వల్లో సంచారంతో బెంబేలు..**

కిన్నెరసానికి వరద ఉధ్ధృతి ఎక్కువగా ఉండటంతో కేటీపీఎస్ అధికారులు గేట్లు ఎత్తారు. ఆ గేట్ల నుంచి మొసళ్లు బయటకు వస్తున్నాయి. కిన్నెరసాని రిజర్వాయర్ నిర్మాణం అనంతరం డ్యాంకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా 1974లో అధికారులు 32 మొసళ్లను వదిలారు. ప్రస్తుతం అవి వందల సంఖ్యకు చేరాయి. గేట్లు ఎత్తుతున్న నేపథ్యంలో బయటకు వస్తున్నాయి. కొన్ని మొసళ్లు నీటిలో కొట్టుకెళ్లి గోదావరిలో కలుస్తుండగా మరికొన్ని ఒడ్డుకు చేరి ఇళ్లల్లోకి వస్తున్నాయి.




ఇటీవల పూసలతండా సమీపంలో ఓ మొసలి నీటిలో కనిపించిందని స్థానికులు భయాందోన వ్యక్తం చెందుతున్నారు. ఇటీవల ఓ మొసలి కిన్నెరసాని పాఠశాలల సమీపంలో కనిపించింది. కేటీపీఎస్ కాల్వల్లో పెద్ద మొసలి, చిన్న పిల్లలు సైతం తిరుగుతున్నాయి. కేటీపీఎస్ కాల్వ పక్కనున్న కరకవాగు, పూసలతండా తదితర గ్రామాల ప్రజలు కాల్వ నీటిలోనే దుస్తులు శుభ్రం చేసుకుంటారు. కొందరు పిల్లలు ఆ కాల్వలోనే ఈత కొడతారు. రైతులు కాల్వ పక్కనే ఉన్న పొలాల్లో పనులు చేసుకుంటారు. మొసళ్ల సంచారంతో అందరూ భయాందోళనకు గురవుతున్నారు. ఇదేకాక కిన్నెరసాని గురుకుల పాఠశాలల పిల్లలు సైతం బహిర్భూమికి ఆ కాల్వ వద్దకే వెళ్తారు. అధికారులు స్పందించి మొసళ్లను పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే భవిష్యత్తులో ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ఈ అంశంపై అటవీశాఖ అధికారులు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. నీటి ప్రవాహం ఎక్కువ ఉండటంతో మొసళ్లు కనిపించట్లేదని తెలిపారు. ఒడ్డున కనిపిస్తే వాటిని బెదరకొట్టకుండా తక్షణం సమాచారమిస్తే వచ్చి పట్టుకుంటామన్నారు.

## పరిశోధన మెరుగైతేనే పంట వైవిధ్యం

జగిత్యాల : యాసంగి.. వానాకాలం.. సీజన్ ఏదైనా వరి సాగుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. కూలీల కొరత, మార్కెటింగ్ ఇబ్బందులు, కోతులు, అడవిపందుల బెడద వంటి కారణాలతో ఆరుతడి పంటలకు దూరంగా ఉంటున్నారు. దీంతో ఏటికేడు వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతూ పంటల వైవిధ్యం కనుమరుగవుతోంది. ఈ నెల ఆరంభం నుంచి యాసంగి సీజన్ ప్రారంభమైన దృష్ట్యా ఈసారైనా ఆరుతడి పంటల సాగుకు ప్రభుత్వం నుంచి పరిశోధనపరమైన ప్రోత్సాహం పెరగాల్సిన అవసరం ఉంది.

**ఉమ్మడి జిల్లా అవసరాలివీ..**

జగిత్యాల వ్యవసాయ పరిశోధన స్థానంలో వరి, నువ్వులపై ఎక్కువ పరిశోధనలు జరుగుతున్నాయి. వేరుశనగ, పత్తి, కంది, చెరకు తదితర ఆరుతడి పంటలపై పరిశోధనలు చేపడితే ఇక్కడి నేలలకు అనువైన వంగడాల రూపకల్పన సాధ్యమవుతుంది. ఇటీవలి కాలంలో జగిత్యాల జిల్లాలో ఆవాల సాగు గణనీయంగా పెరిగినందున పొలాస పరిశోధన స్థానంలో ఐసీఏఆర్ ఆధ్వర్యంలో ఆవాల పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో పూర్తి స్థాయి పత్తి పరిశోధనలను అందుబాటులోకి తేవాలి. శనగ, కుసుమ, పొద్దుతిరుగుడు, ఆముదం, పెసర, మినుము తదితర పంటల్లో మేలైన వంగడాలను అందుబాటులోకి తెస్తే నల్లరేగడి నేలలున్న పెద్దపల్లి, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో సాగు విస్తీర్ణం పెరుగుతుంది. జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో ఏరువాక కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కూనారం వరి పరిశోధన స్థానంలో ఆరుతడి పంటలపై పరిశోధనలు చేపట్టాలి. కరీంనగర్‌లో కేవలం మొక్కజొన్నపైనే పరిశోధనలు సాగుతుండగా స్థానిక నేలలకు అనువైన పంటలపై చేయాల్సి ఉంది. జగిత్యాల సమీపంలోని చల్‌గల్ వాలంతరీ ప్రదర్శన క్షేత్రంలో ఉద్యాన పరిశోధన స్థానాన్ని ఏర్పాటు చేస్తే మామిడి, పసుపు, ఉల్లి, అల్లం, కూరగాయలు, పసుపు, మిరప, సీతాఫలం, జామ, బత్తాయి, బొప్పాయి, అల్లం, కర్బూజా, సపోటా, అరటి తదితర పండ్లు, పూల



సాగు చేపట్టే రైతులకు మేలైన వంగడాలు అందుబాటులోకి వస్తాయి. యాసంగిలో జొన్న, సజ్జ, నువ్వులు, ఆవాలు తదితర పంటల్లో విత్తనోత్పత్తి చేపడుతున్నందున ప్రభుత్వం ఉత్తరాది రాష్ట్రాల కంపెనీలు రైతులతో ధర నిర్ణయం, ముందస్తు ఒప్పందం చేసుకొనేలా చర్యలు తీసుకోవాలి.ముత్యంపేట చెరకు కర్మాగారాన్ని తెరిస్తే చెరకు సాగు గణనీయంగా పెరుగుతుంది. పాలీహౌస్‌ల రాయితీని పునరుద్ధరించాలి. పంటల బీమాను యాసంగి నుంచి అమలు చేయాలి.

**పంట మార్పిడితో లాభాలు**

వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగుతో దిగుబడి, నేల స్థితిగతులు మెరుగుపడతాయి. నేలలో పోషకాలు, నీటి లభ్యత, కూలీల అందుబాటు, వన్యప్రాణుల బెడద, మార్కెటింగ్ వసతి చూసుకొని రైతులు పంట మార్పిడి పాటించాలి.

డా.ఎస్.హరీష్ కుమార్‌శర్మ, ఏడీఆర్, పొలాస పరిశోధన స్థానం

# తటాకం.. ఆక్రమణలనేకం



జగిత్యాల : జగిత్యాల పట్టణం, పరిసర గ్రామాల్లో చెరువుల ఆక్రమణలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. పట్టణం చుట్టూ ఉన్న ఏడు చెరువులు అక్రమ నిర్మాణాలతో క్రమంగా కుచించుకుపోతున్నాయి. స్థానికంగా మోతె చెరువు, రాజుల చెరువు, తిప్పన్నపేట సమీపంలో ముప్పాల చెరువు, కండ్లపల్లి, చింతకుంట చెరువు, అంతర్గాం సమీపంలో లింగం చెరువు, పట్టణానికి 365 రోజులు తాగునీటిని అందించే ధర్మసముద్రం చెరువులున్నాయి. గోవిందుపల్లె సమీపంలోని చెరువును పదేళ్ల కిందటే మాయం చేశారు. ఈ చెరువు నామరూపాలు లేకుండా పోగా ప్రస్తుతం నివాసాలే కనిపిస్తున్నాయి.

మట్టి పోసి.. కబ్జా చేసి

ఇప్పుడున్న 7 చెరువుల్లో కొద్దికొద్దిగా మట్టి పోస్తూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. అత్యధికంగా మోతె చెరువులో ఎఫ్‌టీఎల్(ఫుల్ ట్యాంక్ లెవెల్)లో సగానికి పైగా నిర్మాణాలు జరుగుతున్నాయి. భారీ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు కళ్లు మూసుకుంటుండగా ఏటా వర్షాకాలంలో వరద జనావాసాలను ముంచెత్తుతోంది. అధికారులు ఎఫ్‌టీఎల్ గుర్తించకపోవడం, హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. దీనికితోడు చెరువు స్థలాల్లో నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు యథేచ్ఛగా అనుమతులు ఇస్తున్నారు. కండ్లపల్లి, చింతకుంట, ముప్పాల చెరువుల పైభాగాన ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయి.

**ఇలా చేస్తే అడ్డుకట్ట**

పట్టణంలో 7 చెరువులకు హద్దులు గుర్తించి కందకాలు ఏర్పాటు చేస్తే ఆక్రమణలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. మోతె చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలతో సగం చెరువు ఆక్రమణకు గురైంది. వెనుక భాగంలో రహదారి నిర్మించి మొక్కలు నాటి వరద పోయేలా పలుచోట్ల కల్వర్టులు నిర్మిస్తే కబ్జాను అరికట్టవచ్చని నీటిపారుదల శాఖకు చెందిన ఓ అధికారి అభిప్రాయపడ్డారు. హద్దులు ఏర్పాటు చేశాక ప్రతి చెరువుకు మత్స్యకారుల ద్వారా రక్షణ కమిటీ ఏర్పాటు చేస్తే ఫలితం ఉంటుంది.

హద్దులు గుర్తిస్తాం

-ఖాన్, నీటిపారుదల శాఖ ఈఈ

పట్టణం చుట్టూ చెరువుల ఆక్రమణ జరిగింది వాస్తమే. వాటి ఎఫ్‌టీఎల్ హద్దులు గుర్తించి రక్షణ చర్యలు తీసుకుంటాం. వనరుల స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే స్థానికులు మాకు సమాచారం ఇవ్వాలి.

## అమృత్ పనులు.. అర్ధాంతరంగా వదిలి



మంథని: మంథని పురపాలికలో అమృత్-2.0 పథకం కింద చేపట్టిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. గుత్తేదారుకు నోటీసులు జారీ చేసినా ముందుకు సాగటం లేదు. రూ.12.10 కోట్ల వ్యయంతో వాటర్ ట్యాంకు, నీటి సరఫరా పైపులైన్ నిర్మాణం కోసం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు 2024 జులై 15 న శంకుస్థాపన చేశారు. 15 నెలలు గడిచిన పనుల్లో పురోగతి లేదు. మూడు నెలల క్రితం వరకు పనులు జరిగాయి. అనంతరం నిలిపివేశారు. కొన్ని నల్లా కనెక్షన్‌లకు సక్రమంగా నీరు సరఫరా కావటం లేదు. వాటర్ ట్యాంకు నిర్మాణం పునాది వరకు పనులు చేసి వదిలి వేశారు.

**1765 నల్లా కనెక్షన్‌లకు సరఫరాలో ఇబ్బంది**

అమృత్-2.0 పథకంలో భాగంగా 12 కిలోమీటర్ల మేర నీటి సరఫరా పైపులైన్ నిర్మించాలి. ఇప్పటి వరకు బస్సు డిపో, పోచమ్మవాడ, గంగాపురి ప్రాంతాల్లో 5 కి.మీల వరకు పైపులైన్ వేశారు. ఇంకా పట్టణంలోని వివిధ వాడల్లో 7 కి.మీల దూరం వరకు పైపులు వేయాల్సి ఉంది.800 కిలోలీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకును పునాది వరకు మాత్రమే నిర్మించి పనులు వదిలేశారు. ట్యాంకు నుంచి నీటి సరఫరాకు 1.2 కిలోమీటరు మేర ప్రధాన పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభించలేదు. ఇప్పటివరకు కేవలం రూ.70 లక్షల వ్యయం గల పనులు మాత్రమే జరిగాయి. పైపులైన్, ట్యాంకు పనులు చురుకుగా జరగకపోవడంతో మున్సిపాలిటీలో 1765 నల్లా కనెక్షన్‌లకు సక్రమంగా నీరు సరఫరా కావటం లేదు.

**డిసెంబరులో పనులు చేపడతాం- మౌనిక, మున్సిపల్ ఏఈ**

మైనింగ్ ఏడీని గ్రావెల్ అనుమతి కోరాం. అనుమతి వచ్చిన వెంటనే డిసెంబరులో పనులు చేపడతాం. మార్చి 30లోగా పనులు పూర్తి చేస్తాం. పనులు చేపట్టడంలో జాప్యంతో గుత్తేదారుకు అయిదు సార్లు నోటీసులు జారీ చేశాం.

## ఆటంకం లేకుండా ఆమోదం

హైదరాబాద్: వర్షం పడితే చాలు విద్యుత్తు అంతరాయం.. ఈదురుగాలులు వీస్తే తెగిపడే విద్యుత్తు తీగలతో ప్రమాదం.. సిటీలో ఎక్కడ చూసినా ఓవర్‌హెడ్ లైన్లతో ఆటంకాలు.. వీటన్నింటికి పరిష్కారంగా హైదరాబాద్‌లో భూగర్భ విద్యుత్తు తీగలు వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రాజెక్ట్‌కు రాష్ట్ర మంత్రిమండలి తాజాగా ఆమోదం తెలిపింది. భూగర్భ కేబుళ్లను వేసేందుకు రూ.14,725 కోట్లు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఏటా రూ.3వేల కోట్ల కేటాయింపుతో ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయవచ్చని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం డిస్కం నిధులు కేటాయించే పరిస్థితిలో లేదు. ఎలా సమకూరుస్తారు అనేది స్పష్టత రావాల్సి ఉంది.

**బెంగళూరు తరహాలో..**

హైదరాబాద్ నగరం ఇప్పుడు ఔటర్ వరకు విస్తరించింది. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్)గా వ్యవహరిస్తున్నారు. ఇక్కడి వరకు భూగర్భ కేబుళ్లను వేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే బెంగళూరుకు వెళ్లి అక్కడ కేబుళ్ల పనుల తీరును అధ్యయనం చేసి వచ్చారు. క్షేత్రస్థాయిలో సర్వే చేసి డీపీఆర్‌కు రూపకల్పన చేశారు.

**10 సర్కిళ్లను..**

నగరంలోని 10 సర్కిళ్లను క్షేత్రస్థాయిలో సర్వే అనంతరం భూగర్భ విద్యుత్తు కేబుళ్ల ప్రాజెక్ట్ కోసం పలు భాగాల కిందకు తీసుకొచ్చారు.

సౌత్ ఈస్ట్: హైదరాబాద్ సౌత్, సరూర్‌నగర్

సౌత్ వెస్ట్: హైదరాబాద్ సెంట్రల్, రాజేంద్రనగర్

నార్త్ ఈస్ట్: సికింద్రాబాద్, హబ్సిగూడ, మేడ్చల్

నార్త్ వెస్ట్: బంజారాహిల్స్, సైబర్‌సిటీ సర్కిల్, పటాన్‌చెరు డివిజన్

## కోకాపేట.. కొత్త బాట

హైదారబాద్: కోకాపేట...ఈ పేరు వింటే...కాసుల గలగలలు విన్పిస్తాయి. అక్కడ గజం స్థలం బంగారం కంటే ఎక్కువ. ఈ నేపథ్యంలో మరోసారి కోకాపేట హెచ్‌ఎండీఏకు కోట్లు కురిపించింది. హైదరాబాద్ చరిత్రలోనే ఎకరా రికార్డు ధర పలికింది. ఎకరా ఏకంగా రూ.137 కోట్లకు వేలంలో అమ్ముడు పోవడంతో స్థిరాస్తి మార్కెట్‌కు ఊపునిచ్చే అంశమని చెబుతున్నారు. కోకాపేటలోని నియోపొలిస్‌లో మొత్తం 9.9 ఎకరాలను ఆన్‌లైన్‌లో వేలం వేయగా...ఏకంగా రూ.1,356 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ నెల 28న, డిసెంబరు 3న ఇదే ప్రాంతంలో ఉన్న మరో 17 ఎకరాలు వేలం వేయనున్నారు. తర్వాత డిసెంబరు 5న కోకాపేట్ గోల్డెన్ మైల్‌లో ఉన్న మరో 1.98 ఎకరాలు వేలంలో విక్రయించనున్నారు. ఇక్కడ కనీసం ఎకరాకు ధర రూ.70 కోట్లు నిర్ణయించారు.

**హెచ్‌ఎండీఏ పరిధిలో పెరిగిన అనుమతులు..**

భవనాల నిర్మాణం, లేఅవుట్ల కోసం హెచ్‌ఎండీఏకు వచ్చే దరఖాస్తుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఈ ఏడాదిలో ఇప్పటికే సంస్థకు రూ.వెయ్యి



కోట్ల ఆదాయం సమకూరింది. కొత్త సంవత్సరంలో రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, మెదక్ జిల్లాల పరిధిలోని బైరాగిగూడ, చందానగర్, పుప్పాలగూడ, బాచుపల్లి, బౌరంపేట్, చెంగిచర్ల, సూరారం ప్రాంతాల్లో ఉన్న విలువైన ల్యాండ్ పార్శిళ్లను వేలం వేయనున్నారు. మొత్తంగా రూ. 10వేల కోట్లు ఆదాయం రానుందని భావిస్తున్నారు.

## జలాశయానికి నిధుల ప్రవాహం

చర్ల : చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా జలాశయం ప్రధాన కాల్వల స్ట్రక్చర్ల మరమ్మతులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. నిధులు మంజూరైనా వివిధ కారణాలతో పనుల్లో జాప్యం నెలకొంది. ఆయకట్టు రైతులు ముందుకొచ్చి పంట విరామం ప్రకటించడంతో మరమ్మతులకు మార్గం సుగమమైంది.

**నిధుల మంజూరు ఇలా..**

దశాబ్దాలుగా అధ్వానంగా దర్శనమిస్తున్న ప్రాజెక్టు ప్రధాన ఎడమ, కుడి కాల్వలపై స్ట్రక్చర్ల మరమ్మతులకు గతేడాది ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఓఅండ్‌ఎం(ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్) గ్రాంటు నుంచి ఇవి మంజూరయ్యాయి. విడతలవారీగా (13/02/2024 నుంచి 27/05/2024, 13/06/2024)ఈ పనులకు పరిపాలనా అనుమతులు వచ్చాయి. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పనులు అప్పట్లో ప్రారంభించలేదు.

యాసంగిలో నీటి సరఫరా నిలిపివేతతో ఫిబ్రవరి నుంచి కాల్వ పనులను ప్రారంభించనున్నారు. ఖరీఫ్‌కు ముందు ఈ పనులు పూర్తి కావాలంటే మే నాటికి అంటే నాలుగు నెలల సమయంలో పనులు పూర్తి చేయాల్సి ఉంది. వచ్చే ఖరీఫ్‌కల్లా కాల్వల పనులు పూర్తి చేసేందుకు అధికారులు కార్యాచరణ చేస్తున్నారు.

**స్ట్రక్చర్ల వారీగా నిధుల కేటాయింపు ఇలా..**

ప్రధాన ఎడమ కాల్వలో 9.154 కిలో మీటరు యూటీ(అండర్ టెన్నెల్)



మరమ్మతులకు రూ.60.80 లక్షలు, 13.098 కి.మీ. వద్ద రూ.59.30 లక్షలు, 16.072 కి.మీ. వద్ద రూ.22.20 లక్షలు, 24.566 కి.మీ. రూ.35 లక్షలు, 14.474 కి.మీ. ఎస్‌ఎల్‌ఆర్‌బీ(రీకన్‌స్ట్రక్షన్)కు రూ.48.90 లక్షలు, ఆర్డీ-7 డిస్ట్రిబ్యూటర్‌లో స్ట్రక్చర్ మరమ్మతులకు రూ.49.75 లక్షలు, ఆర్డీ-26 డిస్ట్రిబ్యూటర్‌లో పైపు కల్వర్ట్ మరమ్మతులకు రూ.9.09 లక్షలు, 34.338 కి.మీ. కెనాల్ లైనింగ్, యూటీ మరమ్మతులకు రూ.4.50 లక్షలు, ఆర్డీ-1 డిస్ట్రిబూటరీలో మరమ్మతులకు రూ.4.98లక్షలు, ఆర్డీ-02కు రూ.4.30 లక్షలు, కుడి ప్రధాన కాల్వ ఎల్డీ-03, ఎల్డీ-04 డిస్ట్రిబ్యూటర్ల మరమ్మతులకు రూ.11.04 లక్షలు, 15.035 కి.మీ. వద్ద యూటీ రీకన్‌స్ట్రక్షన్ కోసం-రూ.99.98 లక్షలు, కుడి ప్రధాన కాల్వ ఎల్డీ-03, ఎల్డీ-04 డిస్ట్రిబ్యూటర్ల బాగు కోసం రూ.11.04 లక్షలు కేటాయించారు.

## కరకట్టల విస్తరణే శ్రీరామరక్ష..!

భద్రాచలం : పోలవరం ముంపు ప్రభావం గోదావరి తీరప్రాంతంలోని భద్రాచలం, బూర్గంపాడుతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఏమేరకు ఉంటుందనే చర్చ ఆందోళన కలిగిస్తోంది. ప్రాజెక్టులో 41.45 మీటర్ల వద్ద నీటిని నిల్వ చేయటం వల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితుల గురించి భిన్నవాదనలు వ్యక్తమవుతున్నా ముంపు ముప్పు ఉంటుందని మాత్రం స్పష్టమవుతోంది. ఇప్పటికే వివిధ రకాల సర్వేలు జరిగినా తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ కలిసి ఉమ్మడి అధ్యయనం చేస్తే నిజానిజాలు నిగ్గు తేలే అవకాశముంది. ఈ దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిసింది.

**కాల్వలను గుర్తించాలి..**

వాగులు, ఉపనదులు 30కి పైగా భద్రాచలం చుట్టుపక్కల నదిలో కలుస్తున్నాయి. వర్షాకాలంలో వీటి తీవ్రతపైనా నిగ్గు తేల్చనున్నారు. తాలిపేరు, తూరుబాక, ఎటపాక వాగు, కిన్నెరసాని, పాములేరు, ముర్రేడు వంటి వాటిని పరిగణనలోకి తీసుకోవాలి. లోతట్టు గ్రామాల సంఖ్యతో పాటు వ్యవసాయ భూములకు వాటిల్లే నష్టాన్ని పరిశీలించాలి. పోలవరం బ్యాక్ వాటర్ వల్ల ముంపు జాబితాలో లేని 900 ఎకరాలకు కొత్తగా ముంపు వాటిల్లే ప్రమాదం ఉందన్నది అంచనా. భద్రాచలంలోని కొత్తకాలనీ, విస్తా కాంప్లెక్స్, అయ్యప్ప కాలనీకి వరదల తరుణంలో ప్రమాదం వాటిల్లకుండా ప్రస్తుతం 80 అడుగుల ఎత్తులో ఉన్న కరకట్టకు మరమ్మతులు చేయించాలి. కొత్త ప్రతిపాదనల ప్రకారం



భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు మండలాల్లోని లోతట్టు ప్రాంతాల భద్రతకు కొత్త కరకట్టలు నిర్మించాలి. శిశుమందిర్ వైపు నిర్మాణ దశలోని పాత కరకట్టను పటిష్ఠపరచాలి. అన్ని స్లూయిస్‌ల వద్ద వర్షం నీటిని తోడే వ్యవస్థ ఉండాలి.

**ముందస్తు ప్రణాళికలు అవసరం**

43, 48, 53 అడుగుల వరదొస్తే వరసగా మొదటి, రెండు, మూడో ప్రమాద హెచ్చరికలు జారీ చేస్తుంటారు. ఒక్కోసారి భారీ వర్షం వచ్చినప్పుడు అన్నదాన సత్రం వైపు నీరు చేరి రాకపోలు ఆగిపోతుంటాయి. గోదావరికి 1986 ఆగస్టు 16న 75.60 అడుగుల గరిష్ఠ వరద రావటంతో తీరప్రాంతం అతలాకుతలమైంది. 2022లో 71.30 అడుగుల వరదొస్తే తీరప్రాంతంలో 16వేల కుటుంబాలు పునరావాస కేంద్రాలకు తరలిపోయాయి. ఇలాంటి వాటిపై అధ్యయనం చేసి ముందస్తు ప్రణాళికలు రూపొందించాలి.

## నాణ్యత డొల్ల.. పట్టించుకోరా..?

వైరా: వైరా మండల పరిధిలో ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల్లో నాణ్యత లోపాలు బయటపడుతున్నాయి. స్నానాలలక్ష్మీపురంలో వైరా నదిపై హైలెవల్ వంతెన పిల్లర్ కూలిన ఘటన సర్వత్రా చర్చనీయాంశమైంది. రూ.కోట్ల వ్యయంతో చేపట్టిన పనుల్లో నాణ్యత లోపం బయటపడింది. పటిష్ఠంగా ఉండాల్సిన అతిపెద్ద పిల్లర్ నిర్మాణ సమయంలోనే కూలడంతో ఉన్నతాధికారులు, నాణ్యత విభాగం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. సిరిపురం నుంచి స్నానాల లక్ష్మీపురం వద్దనున్న వైరా నది మీదుగా గండగలపాడు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డుతో పాటు వంతెన నిర్మాణానికి రూ.31.50 కోట్లు మంజూరయ్యాయి. ఏడాది నుంచి ఆయా పనులు జరుగుతున్నా కొలిక్కి రాలేదు. అక్కడక్కడ సగం పనులు చేసి వదిలేశారు. ఇదే రోడ్డుకు సంబంధించి గండగలపాడు వద్ద అర కిలోమీటరు వరకు కంకర పోసి మిగతా పనులు చేయకుండా వదిలేశారు. వాహన రాకపోకల సమయంలో కంకర లేచి, దుమ్ముతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ఉప గుత్తేదారుల సిబ్బంది తప్ప అధికారుల పర్యవేక్షణ తూతూమంత్రంగానే మారింది. పది వేల క్యూసెక్కులు ప్రవహించే సమయంలో తీవ్రతను తట్టుకునేలా పిల్లర్లు నిర్మించాల్సి ఉండగా పనులు జరుగుతుండగానే ఒకటి కూలింది.

చురకలు

శనివారం 29 నవంబర్ 2025

# నయా నగరం




హైదరాబాద్: ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, ఏకరూప పరిపాలనే లక్ష్యంగా రాజధానిని ప్రపంచస్థాయి మౌలిక సౌకర్యాలతో తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కలిపి 27 పట్టణ స్థానిక సంస్థలను(యూఎల్‌బీ) జీహెచ్‌ఎంసీలో విలీనం చేసేందుకు సమాయత్తమైంది. 650 చ.కి.మీ పరిధిలో ఉన్న జీహెచ్‌ఎంసీని 2వేల చ.కి.పరిధికి విస్తరించేందుకు చర్యలు ప్రారంభించింది. ఈ విషయమై అధ్యయనం చేపట్టి, సూచనలు చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను.. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సర్వ సభ్య సమావేశం ఆమోదించింది. నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రిమండలి తీసుకున్న నిర్ణయంపై నేతలు సంతోషం వ్యక్తం చేశారు.

**గ్రామాల విలీనంతో మొదలు..**

ఓఆర్‌ఆర్ వరకు ఒకే నగరమనే ప్రక్రియ అంచెలంచెలుగా జరుగుతోంది. సెప్టెంబరు 2, 2024లో ఆర్డినెన్స్ ద్వారా 51 గ్రామ పంచాయతీలను ప్రభుత్వం చుట్టుపక్కలున్న పట్టణ స్థానిక సంస్థ(యూఎల్‌బీ)ల్లో విలీనం చేసింది. ఆయా 27 యూఎల్‌బీల పాలకమండళ్ల పదవీ కాలం జనవరి, 2025లో పూర్తయింది. జీహెచ్‌ఎంసీ పాలకమండలి పదవీ కాలం ఫిబ్రవరి 11, 2026తో ముగియనుంది. ప్రస్తుత పాలకమండలి విలీనంపై ఎలాంటి అభిప్రాయం తెలిపినప్పటికీ.. తర్వాత జీహెచ్‌ఎంసీలో నియమితులయ్యే ప్రత్యేక కమిషనర్ శివారులోని 27 యూఎల్‌బీల విలీనాన్ని ఆమోదిస్తారు.

**అసలైన సవాలు అప్పుడే..**

శివారు ప్రాంతాలను విలీనం చేయడమంటే.. జీహెచ్‌ఎంసీ హద్దులను ఓఆర్‌ఆర్ వరకు విస్తరించడం. అది జరగాలంటే.. విశాల నగరాన్ని ఎన్ని డివిజన్లు, సర్కిళ్లు, జోన్లుగా విభజించాలి.. జనాభా విభజన, ఆదాయ వనరుల పంపకం వంటి అంశాలపై సమగ్ర చర్చ జరగాలి. రాజకీయ, సామాజిక అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తదుపరి నిర్ణయం తీసుకుంటుందని అధికారులు చెబుతున్నారు.

**ఇంతింతై.. వటుడింతై అన్నట్లు..**

నగరం నిజాం నవాబుల పాలన నుంచి నేటి వరకు అంచెలంచెలుగా ఎదుగుతోంది. హద్దులు లేని నగరంగా విస్తరిస్తోంది. ఔటర్ లోపల ఉన్న 20 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లు బల్దియాలో విలీనమయ్యే ప్రక్రియకు అడుగుపడడంతో జీహెచ్‌ఎంసీ విస్తీర్ణం మరింత పెరిగింది. 55చ.కి.మీ విస్తీర్ణంతో మొదలైన హైదరాబాద్ అభివృద్ధి ప్రణాళిక.. నేడు 2వేల చదరపు కిలోమీటర్లకు విస్తరిస్తోందంటే.. ఎల్లలు లేని భాగ్యనగరం అభివృద్ధి.. ఏ స్థాయిలో దూసుకెళ్తుందో అర్థం చేసుకోవచ్చు.

**ఈ నిర్ణయం ఎందుకంటే...**

"ఓఆర్‌ఆర్ పరిధిలోని ప్రాంతాలన్నింటినీ టీసీయూఆర్(తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్)గా పేర్కొంటూ.. ఒకే గొడుకు కింద అభివృద్ధి చేయాలనేది ప్రభుత్వ ఆలోచన. కానీ.. టీసీయూఆర్‌లో ప్రస్తుతం నాలుగు రకాల పాలన ఉంది. ఈ వ్యత్యాసాల్ని తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే.. జి.వో.నెం.570 ప్రకారం వార్డుల పునర్విభజన చేపడతాం" అని ఎక్స్ అఫీషియో సభ్యులు, కార్పొరేటర్ల ప్రశ్నలకు కమిషనర్ ఆర్వీ కర్ణన్ సమాధానమిచ్చారు.

**అంచెలంచెలుగా..**

నిజాం ప్రభుత్వం 1869లో పురపాలక వ్యవస్థను అమల్లోకి తెచ్చింది. అప్పట్లో హైదరాబాద్ జనాభా 3.5లక్షలు. విస్తీర్ణం 55 చదరపు కిలోమీటర్లు.

1933లో హైదరాబాద్ నగరపాలక సంస్థ (హెచ్‌ఎంసీ) ఏర్పాటైంది.

1950లో సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటైంది.

1955లో హైదరాబాద్, సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను ఒకటిగా చేసి.. హెచ్‌ఎంసీ చట్టం-1955ను అమల్లోకి తీసుకొచ్చారు.

2007లో రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని 12 మున్సిపాల్టీలు, 8 గ్రామపంచాయతీలను హెచ్‌ఎంసీలో విలీనం చేసి.. జీహెచ్‌ఎంసీని ఏర్పాటు చేశారు.

2019లో జీహెచ్‌ఎంసీ పరిధిని ఆరు జోన్లు, 150 డివిజన్లుగా విభజించారు. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ విస్తీర్ణం 650చ.కి.మీ.

ఇప్పుడు శివారులోని మున్సిపాల్టీలను విలీనం చేసే ప్రక్రియ మొదలైంది. దాంతో నగర విస్తీర్ణం 2 వేల చ.కి.మీలకు పెరుగుతుంది. ఆ మహా నగరాన్ని మూడు నగరపాలక సంస్థలుగా విభజించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. డివిజన్ల పునర్విభజన, సర్కిళ్లు, జోన్ల హద్దులపై మున్ముందు స్పష్టత వస్తుంది.

## మేడ్చల్ నామమాత్రం.. రంగారెడ్డి గ్రామీణ ప్రాంతం

హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ విస్తరణతో మేడ్చల్ జిల్లా నామమాత్రంగా మిగలగా.. రంగారెడ్డి జిల్లాలో గ్రామీణ ప్రాంతాలు మాత్రమే మిగిలాయి. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్బీనగర్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాలు ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్‌లో అంతర్భాగంగా ఉన్నాయి. తాజాగా జీహెచ్‌ఎంసీలోకి రెండు జిల్లాల్లోని ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 17 మున్సిపాలిటీలు విలీనమయ్యాయి.

**మేడ్చల్... మూడు మున్సిపాలిటీలే..**

మేడ్చల్ జిల్లాలో నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లు జవహర్‌నగర్,




పీర్జాదిగూడ, బోడుప్పల్, నిజాంపేట, తొమ్మిది మున్సిపాలిటీలు విలీనం కానున్నాయి. దీంతో కొత్తగా మున్సిపాలిటీలుగా మారిన మూడు చింతలపల్లి, అలియాబాద్, ఎల్లంపేటలు మాత్రమే మిగిలాయి. ఇప్పటికే ఒక్క గ్రామం లేని జిల్లాగా మారిన మేడ్చల్ జిల్లా.. ఇకపై గ్రేటర్‌లో అంతర్భాగం కానుంది.

**చేవెళ్ల.. ఇబ్రహీంపట్నం.. షాద్‌నగర్...**

రంగారెడ్డి జిల్లాలో మూడు కార్పొరేషన్లు మీర్‌పేట్, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, ఎనిమిది మున్సిపాలిటీలు విలీనం కానున్నాయి. ఫలితంగా చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రాలు, కొత్తూరు, ఆమన్‌గల్, కల్వకుర్తి, మొయినాబాద్ మున్సిపాలిటీలు మాత్రమే జిల్లాలో మిగిలాయి. తుక్కుగూడను భారత్ ఫ్యూచర్‌సిటీలో విలీనం చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేసినా.. జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయించింది.

## కాల్చొద్దు.. ప్రాణంపైకి తెచ్చుకోవద్దు!

చేగుంట : పాపన్నపేట మండలం పొడ్చన్‌పల్లికి చెందిన నర్సింహులు వరి కొయ్యలను కాల్చే సమయంలో మంటలు ఎగిసిపడి, అందులో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయాడు. బెజ్జంకిలో వరి కొయ్యలను కాలుస్తుండగా.. మంటలు వ్యాపించాయి. సమీపంలోని పొలంలో బిందు సేద్యం పైపులు కాలిపోయాయి. రూ.3 లక్షల నష్టం వాటిల్లింది. వరి కోతల అనంతరం మిగిలిన మొదళ్లకు రైతులు నిప్పు పెట్టి ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. ఇది భూసారాన్ని దెబ్బతీయడంతో పాటు కాలుష్యం ఏర్పడి పర్యావరణానికి ముప్పు కలిగిస్తుంది. మంటలు వ్యాపించి తీవ్ర నష్టాన్ని మిగులుస్తున్నాయి. భూసారం దెబ్బతింటే పంట దిగుబడిపై ప్రభావం చూపిస్తుందని సిద్దిపేట డాట్ సెంటర్ శాస్త్రవేత్త పల్లవి చెబుతున్నారు. ఆమె సూచనలు ఇలా..

**ఏం చేయాలంటే...**

వరి నూర్పిడి చేశాక ట్రాక్టర్ బేలర్ సాయంతో గడ్డిని కట్టలుగా చేసుకుని పశుగ్రాసంగా వినియోగించాలి.

గడ్డి, కొయ్యలు త్వరగా కుళ్లిపోవడానికి ఫాస్పేట్, డీకంపోజర్ వాడాలి. డ్రిల్లింగ్ పద్ధతిలో విత్తనాలు వేసుకోవచ్చు. ఇది కలుపు మొక్కలను పెరగనీయకుండా, తేమ పోషకాల స్వరక్షణకు ఉపయోగపడుతుంది. ః రోటవేటర్ సాయంతో దున్నితే మేలు. ః భూమిలో కలియదున్నితే కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలి.ః దున్నటానికి ముందు సింగిల్ సూపర్ ఫాస్పేట్ 150 కిలోలు ఎకరాకు చల్లితే కొయ్యలు త్వరగా మురిగి భూమిలో కలిసిపోతాయి.

**యంత్రాలతోనే సమస్య**

ప్రస్తుతం యంత్రాల సాయంతో వరి కోస్తుండటంతో చివర్లో కొయ్యలు మిగిలిపోతున్నాయి. తర్వాత పంట సాటుకు సులభంగా ఉంటుందని వాటిని కాల్చివేస్తున్నారు. ఇక్కడే సమస్య ఉత్పన్నమవుతోంది.

నష్టాలు ఇలా...భూమ్నిలోని పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు, కీటకాలు మృతి చెందుతాయి.మంటలు ఎగిసిపడి గడ్డివాములు, నీటి పైపులు దగ్ధమవుతాయినల్లటి పొగ కమ్ముకొని పర్యావరణం దెబ్బతింటుందికార్బన్ మోనాక్సైడ్ విడుదలై ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందిటన్ను కొయ్యలు కాలిస్తే.. సూక్ష్మపోషకాలతో పాటు 5.5 కిలోల నత్రజని, 2.3 కిలోల భాస్వరం, 25 కిలోల పొటాషియం, 1.2 కిలోల సల్ఫర్ దెబ్బతింటుంది.

## గనులు తవ్వకో.. అందినంత దోచుకో!

జిల్లాలో గనుల తవ్వకాల్లో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. రెండు రోజుల కిందట అక్రమ మైనింగ్ కేసులో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డి యజమానిగా ఉన్న మైనింగ్ కంపెనీకి చెందిన ఆస్తులను ఈడీ జప్తు చేయడమే ఇందుకు నిదర్శనం. జిల్లా పరిధిలోని గనుల్లో అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులపై 2022లో ఆ శాఖ ఈటీఎస్ సర్వే నిర్వహించింది. ఉల్లంఘనలపై రూ.619.36 కోట్ల జరిమానా విధిస్తూ 14 క్వారీల నిర్వాహకులకు తాఖీదులు జారీ జారీచేసింది. దీనికి తోడు అనుమతులకు మించి తవ్వకాలు చేస్తున్నట్లు గనుల శాఖ తేల్చింది. ఈ క్వారీలన్నీ బడాబాబుల చేతుల్లోనే ఉండటంతో చర్యలు చేపట్టేందుకు గనులశాఖ మీనమేశాలు లెక్కిస్తోందనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం జిల్లా పరిధిలోని గనుల్లో ఈటీఎస్(ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్) సర్వే నిర్వహిస్తే అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది. **పర్యావరణ అనుమతులు తప్పనిసరి:** జిల్లాలోని కంకర, రాతి క్వారీల్లో ఉల్లంఘనలు ఎక్కువగా ఉన్నాయి. గనుల్లో తవ్వకాలు పెరగడం, నిబంధనలు పాటించక పోవడంతో వాటి చుట్టూ పర్యావరణంపై ప్రభావం చూపుతోంది. 1994లో అప్పటి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం అయిదు హెక్టార్లకు మించి గనుల్లో చేపట్టే తవ్వకాలకు పర్యావరణ అనుమతులు తప్పనిసరి.

**ప్రధాన ఉల్లంఘనలు ఇలా..** లీజు గడువు ముగిసినా.. హద్దులు దాటి తవ్వకాలతో పాటు అనుమతి తీసుకోకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ పన్నులు ఎగవేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. లీజు గడువును రెన్యువల్ చేయని చోట్ల మళ్లీ తవ్వకాలు చేపట్టకుండా.. అధికారులు పర్యవేక్షించాలి.ప్రభుత్వానికి రాయల్టీ ఎగవేసే క్వారీ యజమానుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో క్వారీల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు ఇటీవల ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తవ్వకాలు, కంకర తరలింపుపై రెవెన్యూశాఖ పర్యవేక్షణ ఉండాలి.

## 'అనంత' దూరం.. ఎంతెంతో భారం



మేడిపల్లి: అందరికీ ఇష్టమైన కూరగాయ టమాట. కూర ఏదైనా అందులో టమాట ఉంటేనే రుచికరం. నిత్యావసరమైనా స్థానికంగా సాగు లేక ఏపీలోని అనంతపురం నుంచి జగిత్యాలకు దిగుమతి చేసుకుంటున్నారు. అంటే దాదాపు 600 కిలోమీటర్ల దూరం నుంచి తీసుకు రావాల్సి వస్తోంది. అనంతపురంలో రూ.26కు దొరుకుతుండగా జగిత్యాలలో వినియోగదారుకు చేరేసరికి రూ.100 అవుతోంది. అంటే ప్రతి రోజూ ప్రజలపై రూ.9 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు అదనపు భారం పడుతోంది.

అనంతపురం మార్కెట్‌లో 25 కిలోల డబ్బాకు టోకు ధర రూ.650. అంటే కిలో ధర రూ.26.

అనంతపురం నుంచి జగిత్యాలకు దూరం దాదాపు 600 కిలోమీటర్లు. ప్రతి రోజూ టోకు వ్యాపారులు రెండు, మూడు వ్యాన్లలో టమాటాలు తెప్పిస్తున్నారు.

150 నుంచి 250 క్వింటాళ్ల వరకు రానుపోను 1200 కిలోమీటర్ల దూరానికి డీజిల్, వాహన ఖర్చు, హమాలీ, కమీషన్, టోల్‌టాక్స్ తదితర ఖర్చులన్నీ కలిపి రూ.40 వేల వరకు అవుతోంది. ఈ భారమంతా వినియోగదారులపైనే పడుతోంది.

వినియోగదారులకు రూ.100 వరకు విక్రయిస్తున్నారు. అంటే సగటున 200 క్వింటాళ్లకు కిలోకు రూ.74 చొప్పున భారం పడుతోంది.

జగిత్యాలలో డబ్బాను చిరు వ్యాపారులకు రూ.1250 వరకు అమ్ముతున్నారు. వారికి సరాసరి రూ.50 వరకు పడుతోంది.

స్థానికంగా దొరికితే సగానికే..

జిల్లాలో ప్రతి వంటకంలో టమాటాను వినియోగిస్తున్నారు. అయితే సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. కోతుల బెడద, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. పల్లెల్లో పెరటి తోటగా, పట్టణాల్లో మిద్దె పంటగా, రైతులు పొలంలోని ఖాళీ స్థలాల్లో సాగు చేస్తే సగం ధరకే అందే అవకాశం ఉంది. దీనిపై ఉద్యాన శాఖ ప్రచారం పెంచాలి.

## నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్లు



కరీంనగర్ : జిల్లా కేంద్రంలో వ్యాపార, వాణిజ్య సంస్థలు అనుమతుల ప్రకారం పార్కింగ్ కోసం వదలాల్సిన స్థలాలు వదలకపోవడంతో వాహనాలన్నీ రోడ్ల మీదనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. విధిగా వాహనాలు నిలిపేందుకు స్థలం ఉండాల్సి ఉండగా, అలాంటి విషయాన్ని ఇన్నాళ్లు ఎవరూ పట్టించుకోలేదు. వీటిని ఎక్కడ పడితే అక్కడ రోడ్డుపై నిలుపుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.పట్టణ ప్రణాళిక నిబంధనల ప్రకారం వాణిజ్య భవనాలకు కచ్చితంగా పార్కింగ్ సౌకర్యం ఉండాలి. అక్కడికి వచ్చే వాహనాలను లోపలకు నిలుపుకోవడానికి సెల్లార్లు ఉండాల్సి ఉండగా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేసుకున్నారు. వాటిని ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. కొందరైతే వాటిని వాడకుండా తాళం పెడుతున్నారు.శ్రీ రద్దీ ఎక్కువైన సమయాల్లో రోడ్ల మీద వాహనాలు నిలుపుతున్నారు. రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. నివాసిత భవనాలకు సెట్‌బ్యాక్ మాటే కనిపించడంలేదు. రోడ్డు మీదకు వచ్చి ఫిల్లర్లు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

**రాకపోకలకు నరకయాతన..** నగరంలోని టవర్‌సర్కిల్, మార్కెట్, సిక్కువాడీ, మదీన కాంప్లెక్స్, రాజీవ్‌చౌక్, ఉస్మాన్‌పుర, గాంధీరోడ్డు, డాక్టర్ స్ట్రీట్, ప్రభుత్వాసుపత్రి వెనుకాల, కోర్టు నుంచి మంచిర్యాల చౌరస్తా వైపు, కలెక్టరేట్ రోడ్డు, ముకరంపుర నుంచి మంకమ్మతోట, రాంనగర్ వైపు, రాజీవ్‌చౌక్ నుంచి రూరల్ పోలీస్‌స్టేషన్ మీదుగా కమాన్ వైపు, జ్యోతినగర్ నుంచి విద్యానగర్, నాకా చౌరస్తా నుంచి అశోక్‌నగర్ తదితర ప్రాంతాలు ఉదయం, సాయంత్రం రద్దీగా ఉంటాయి. ఆసుపత్రులు, బ్యాంకులు, హోటళ్లు, టిఫిన సెంటర్లు ఉన్న చోట అయితే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొవాల్సిందే.

**రెండు రోజుల్లో 41 నోటీసులు జారీ**

నగర పరిధిలో నుంచి 'బెటర్ స్పేసెస్..బెటర్ కేఎంసీ' పేరుతో ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ప్రారంభించారు. రద్దీ ప్రాంతాల్లోని సెల్లార్లు వినియోగంలోకి తెచ్చే విధంగా కార్యాచరణ తీసుకున్నారు. పట్టణ ప్రణాళిక అధికారులు రెండు రోజుల వ్యవధిలో 64 సెల్లార్లు ఉన్న భవనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 41 సెల్లార్లకు నోటీసులు జారీ చేశారు. సెల్లార్లను పార్కింగ్ కోసం వినియోగిస్తే ఆయా ప్రాంతవాసులకు సౌకర్యంగా మారనుంది.

## ఖాళీ స్థలాలు.. వ్యాధులకు కారకాలు

గోదావరిఖని : నగరంలోని వివిధ కాలనీల్లోని ఖాళీ ప్రదేశాలు(ప్లాట్లు) వ్యాధులకు కారకాలుగా మారుతున్నాయి. వర్షాకాలంలో ఆయా ప్రదేశాల్లో వరద, మురుగునీరు నిలవడం, దోమలు, పందులకు ఆవాసంగా మారడం, పరిసరాల్లో నివసించేవారికి దుర్గంధంతో పాటు వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఖాళీ ప్రదేశాల్లో వరద, మురుగునీరు, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రంగా ఉంచాలని.. లేకపోతే నగరపాలిక ఆధ్వర్యంలో శుభ్రం చేయించి జరిమానా విధిస్తామని పేర్కొనడంతో కొందరు యజమానులు మాత్రమే స్పందించి ఆయా స్థలాలను శుభ్రం చేయించారు. నగరపాలిక నిబంధనల ప్రకారంగా జరిమానాలు విధించేందుకు రంగం సిద్ధం చేసినప్పటికీ వివిధ కారణాలతో ఆచరణకు నోచుకోలేదు.

నగరంలోని కాకతీయనగర్, మార్కండేయకాలనీ, శాంతినగర్, శ్రీనగర్ కాలనీ, ఇందిరానగర్, శివనగర్, రాజ్యలక్ష్మి తదితర కాలనీల్లో ఖాళీ ప్రదేశాల్లో మురుగు, వరద, చెత్తాచెదారం సమస్య తీవ్రంగా ఉంది. నివాసాల మధ్య ఖాళీ ప్లాట్లలో మురుగునీరు నిలుస్తుండటంతో దానికి ఇరువైపులా ఇళ్లలోని వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బహుళ అంతస్తుల భవనాలున్న కాలనీల్లోనే సమస్య తీవ్రంగా ఉంది. స్థలం ఖాళీగా ఉండటంతో సమీపంలోని వారు చెత్తను అందులోనే



పడేస్తుండటంతో కొన్ని కాలనీల్లో ఖాళీ ప్రదేశాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి.స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరించి నోటీసులు జారీ చేస్తామని గతంలో నగరపాలక అధికారులు పేర్కొన్నా ఆచరణకు నోచుకోవడం లేదు. స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న స్థలాల్లోనూ మురుగు, చెత్త సమస్య లేకుండా శ్రద్ధ వహిస్తే అధిక శాతం సమస్య పరిష్కారం కానుంది.అధిక రేటు వస్తే విక్రయిద్దామని, వీలున్నప్పుడు ఇల్లు కట్టుకుంటామని ప్లాట్ల యజమానులు నిశ్చింతంగా ఉండగా, వాటి పక్కన ఇళ్లు కట్టుకొని నివసించే వారు రోగాల బారిన పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నగరపాలక అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి యుద్ధ ప్రాతిపదికన ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోయిన మురుగు, వరద, చెత్త సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు.

## కొలువులకు మార్గం

సిరిసిల్ల : జిల్లాలో డిగ్రీలు, ఆపై చదువులు పూర్తిచేసిన యువత చాలా మంది ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. వీరిలో కొందరు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడాలనే ఆకాంక్ష ఉంటే.. మరికొందరు ప్రైవేటు సంస్థల్లోనైనా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. ఎందులోనూ పూర్తిస్థాయి ఉద్యోగావకాశాలు లభించకపోవచ్చు. అందుకే జిల్లాలోని ఉపాధికల్పన కార్యాలయానికి అనుబంధంగా మోడల్ కెరీర్ సెంటర్ (ఎంసీసీ)ని ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టరేట్లో 2,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో సుమారు రూ.30 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

**అవకాశాలను మెరుగుపర్చేందుకు..**

దేశంలోని ప్రైవేటు సంస్థలతోపాటు విదేశాల్లోనూ విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయి. జిల్లా ఉపాధికల్పనశాఖ కార్యాలయంలో తొమ్మిది వేల మంది నిరుద్యోగులు తమ వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి నెలకు సగటున 30 మంది నిరుద్యోగులు తమకు ఉద్యోగాలు కల్పించాలని దరఖాస్తులతో వస్తున్నారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగులకు దిశానిర్దేశం చేయాల్సిన ప్రభుత్వ వ్యవస్థ (ఉపాధి కల్పన కార్యాలయం) స్థితిగతులు, పనితీరు, లక్ష్యాలను మెరుగుపరిచేందుకు మోడల్ కెరీర్ కేంద్రం ప్రారంభించనుంది.

ఎంసీసీలో ఉద్యోగ సమాచారం, నిరుద్యోగులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వటంతోపాటు ప్రతినెలా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తారు. వాటన్నింటికి అవసరమైన సమాచారం ఎంసీసీలో అందుబాటులో ఉంటుంది. ఉద్యోగమేళాకు హాజరయ్యే అభ్యర్థులు ఆయా సంస్థల్లో అనుసరించాల్సిన తీరు. బృంద చర్చలు, ఆన్‌లైన్ ముఖాముఖిలో పాటించాల్సిన మెలకువలను ఈ కేంద్రంలో తర్ఫీదు ఇస్తారు.

విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే యువతకు తెలంగాణ విదేశీ మానవ వనరుల సంస్థ (టామ్‌కామ్) జిల్లాల వారీగా ఉద్యోగ మేళాలను నిర్వహిస్తోంది. గల్ఫ్ దేశాలతోపాటు జపాన్, యూరప్, మిడిల్‌ఈస్ట్ దేశాలు, ఇంగ్లాండ్, కెనడా, జర్మనీ ఆస్ట్రేలియాతో కలిపి 20 దేశాల్లో ఈ సంస్థ విస్తరించింది. నర్సింగ్, హోటళ్లు, నిర్మాణరంగం, డ్రైవింగ్,



కేర్‌టేకర్లు వంటి 15 రకాల విభాగాల్లో అవకాశాలు కల్పిస్తుంది. ఆయా దేశాల నిబంధనల ప్రకారం భాషలు, అందుకు అవసరమైన నైపుణ్యాలను నేర్పిస్తారు. ఆయా మేళాలు నిర్వహణ సమయంలో ఎంసీసీలో ప్రత్యేకంగా నిపుణులకు నియమించి శిక్షణనిస్తారు. విదేశీ ఉద్యోగాలకు వెళ్లాలనుకునే జిల్లా యువతకు ఇది మంచి అవకాశం.

**అందుబాటులోకి తీసుకొస్తాం**

జిల్లాలో త్వరలోనే ఎంసీసీ అందుబాటులోకి తీసుకొస్తాం. ప్రతినెలా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నాం. వాటిలోని ప్రైవేటు కార్పొరేట్ సంస్థల్లో తొలుత తక్కువ వేతనాలు ఉంటాయి. హైదరాబాద్ లాంటి నగరాల్లో తక్కువ వేతనాలకు చేయలేమని మధ్యలోనే మానేసి వస్తున్నారు. మరికొందరు ప్రైవేటు సంస్థల్లోనూ క్రమక్రమంగా ఉన్నతస్థాయికి చేరినవారు ఉన్నారు. ఎంసీసీలో ఉద్యోగాల స్థితిగతులు.. కంపెనీలపై అవగాహన కలిగించడటం.. ఈ కేంద్రంలో ఇంటర్‌నెట్తో కూడిన కంప్యూటర్లు, ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులకు అనుమానాలు నివృత్తి చేసేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారు.

రాఘవేందర్, జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి

## అధికలోడు.. అతివేగం.. అదుపేది?

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి టిప్పర్ డ్రైవర్ అతివేగం.. పరిమితికి మించి కంకర రవాణా చేస్తుండటమే కారణమని అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. గ్రేటర్ హైదరాబాద్‌లోనూ టిప్పర్ వాహనాలు నిబంధనలు ఉల్లంఘిస్తూ యథేచ్ఛగా చక్కర్లు కొడుతున్నాయి. ఇన్ని జరుగుతున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. నగరంలో నిర్మాణాలు పెద్దఎత్తున జరుగుతుండటంతో.. కంకరతో పాటు భారీ బండరాళ్లను తరలించడానికి ఈ వాహనాలను వినియోగిస్తున్నారు. ఆయా వాహనాల్లో రెట్టింపు లోడు తరలిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

**ఈ ఏడాది 2,200 కేసుల నమోదు**

గ్రేటర్ పరిధిలో ఈ ఏడాది ప్పటి వరకు అధిక లోడు తరలించిన టిప్పర్ వంటి గూడ్స్ వాహనాలపై 2,200 కేసులు నమోదు చేశారు. ఈ భారీ వాహనాల నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా నగరవాసులు బెంబేలెత్తున్నారు. సాధారణంగా భారీ వాహనాలు నగరంలోనికి రాత్రి



10 గంటల తర్వాత ప్రవేశించాలనే నిబంధన ఉన్నా.. రాత్రి 8.30 నుంచే రాకపోకలు సాగిస్తున్నాయి. కూడళ్లు, ఇరుకైన దారుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

**తరలింపులో నిర్లక్ష్యం**

టన్నుల కొద్దీ ఇసుక, బండ రాళ్లు, కంకర తరలిస్తున్న వాహనాలు భద్రతను గాలికి వదిలేస్తున్నాయి. వెనుకవైపు డోర్‌ను సరిగ్గా మూయకుండా నిర్లక్ష్యంగా తరలిస్తున్నారు. కాస్త జారినా వెనుక వచ్చే వాహనదారుల ప్రాణాలకే ముప్పు. టన్నుల బరువు, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా రోడ్లు ధ్వంసం అవుతున్నాయి.

## పార్కు సిద్ధం.. ప్రవేశం నిషిద్ధం!

హైదరాబాద్: మహానగరంలో హిమాయత్‌సాగర్ చెంత హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన ఏకోపార్కు ప్రారంభానికి ఎదురు చూస్తోంది. కార్తిక మాసంలోనైనా అందుబాటులోకి తెస్తే కుటుంబాలతో వెళ్లి ప్రకృతిలో గడిపేందుకు అవకాశం ఉంటుందని నగర వాసులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. శంషాబాద్ సమీపంలోని కొత్వాల్‌గూడలో 85 ఎకరాల విస్తీర్ణంలో ఏకో పార్కును దాదాపు రూ.75 కోట్లతో హెచ్ఎండీఏ తీర్చిదిద్దింది. పార్కు సిద్ధమైనా సందర్శకులను అనుమతించడం లేదు. తొలుత సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నప్పటికీ కార్యక్రమం వాయిదా పడుతూ వస్తోంది. ఆకట్టుకునే పక్షుల గ్యాలరీ.. పార్కులో వివిధ రకాల పక్షుల గ్యాలరీ విశేషంగా ఆకట్టుకుంటోంది. వివిధ దేశాల నుంచి వేయి రకాల పక్షులను తెచ్చిపెట్టారు. పార్కును ప్రారంభిస్తే సందర్శకులకు ఇవి కనువిందు చేయనున్నాయి. ఇదే పార్కులో సాహస క్రీడల కోసం 6 ఎకరాల్లో రకరకాల అంశాలను సిద్ధం చేశారు. అతిపెద్ద అక్వేరియం లేనట్టే... ఇదే పార్కులో దేశంలోనే అతిపెద్ద భూగర్భ అక్వేరియం ఏర్పాటు చేయాలని తొలుత హెచ్ఎండీఏ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో రకరకాల సముద్ర జీవులు, చేపలు, సరీసృపాలు లాంటివి ఈ అక్వేరియంలో అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. ఈ అక్వేరియం ఏర్పాటుకు గ్లోబల్ టెండర్లు



పిలిచినప్పటికీ పెద్దగా స్పందన రాకపోవడంతో ప్రస్తుతానికి ఈ ప్రాజెక్టును విరమించుకున్నట్లు తెలుస్తోంది.

**ఇవీ ప్రత్యేకతలు...**

85 ఎకరాల్లో పచ్చిక బయళ్లతో పార్కు
రకరకాల పక్షులతో అవియరీ(గ్యాలరీ)
బోర్డు వాక్, ఎలివేటెడ్ వాక్ ఏరియా (2.5 కి.మీ)
బటర్‌ఫ్లై పార్కు, వివిధ రకాల వృక్షాలు
రకరకాల పువ్వులతో పెద్ద తోట
అడ్వెంచర్ జోన్
ఓపెన్ ఎయిర్ థియేటర్, ఫుడ్‌కోర్టు
లగ్జరీ ఫుడ్ కాటేజీలు, మినీ కన్వెన్షన్ సెంటర్

## క్యూఆర్ కోడ్ స్కాన్‌తో తితిదే సమాచారం



హిమాయత్‌నగర్: భక్తులు ఎప్పటికప్పుడు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) సమాచారం తెలుసుకునేలా హిమాయత్‌నగర్ (లిబర్టీ)లోని తితిదే దేవాలయం వద్ద 'క్యూఆర్ కోడ్'లతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. భక్తులు ఆ క్యూఆర్ కోడ్‌లను చరవాణితో స్కాన్ చేస్తే చాలు ఎస్ఎస్‌డీ టికెట్లు, ఆర్జిత సేవా టికెట్లు, స్పెషల్ దర్శనం, సేవా ఎలక్ట్రానిక్ డీప్, శ్రీవాణి టికెట్లు, వసతి తదితరాల సమాచారం కళ్ల ముందు ప్రత్యక్షమవుతుంది. శ్రీవారి సేవలు, టికెట్ల బుకింగ్ కోసం సంప్రదిం చాల్సిన అధికారిక వెబ్‌సైట్ (%https://ttdevasthanams.a p.gov.in%) యూఆర్ఎల్‌ను కూడా ఫ్లెక్సీపై ముద్రించారు. ఏదైనా సమాచారాన్ని తెలుసుకోవడానికి, సేవలు పొందటానికి తితిదే అధికారిక వెబ్‌సైట్, సామాజిక మాధ్యమ పేజీలను మాత్రమే ఉపయోగించాలని తితిదే అధికారులు సూచిస్తున్నారు.

# వణికిస్తున్న వల్లూరు యూటర్న్



చేగుంట: వల్లూరు యూటర్న్ అంటే ప్రతి ఒక్కరికి హడల్.. ఇక్కడ రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. గడిచిన మూడు దశాబ్దాల్లో సుమారు 150 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. మరెందరో క్షతగాత్రులు అయ్యారు. పలు కుటుంబాలు ఛిన్నాభిన్నం అయ్యాయి. గతంలో జరిగిన ఒక ప్రమాదంలో వల్లూరు గ్రామానికే చెందిన సుమారు 12 మంది మృతిచెందడం గమనార్హం.

**ఎలా జరుగుతున్నాయంటే..**

చేగుంట వైపు నుంచి వల్లూరుకు యూటర్న్ తీసుకొని వెళ్లే క్రమంలో చేగుంట నుంచి, నిజామాబాద్ నుంచి వాహనాలు వేగంగా వచ్చి ఢీకొంటున్నాయి. బైక్‌లు, సైకిల్‌పై, నడుచుకుంటూ వెళ్తున్న వారు కూడా మరణించడం విచారకరం.

**సర్వీస్ రోడ్డు ఎందుకంట..**

ఆర్వోబీ కోసం గ్రామస్థులు అధికారులు, ప్రజాప్రతినిధులకు తరచూ విన్నవిస్తే రోడ్డుకు ఇరువైపులా సర్వీసు రోడ్డు మంజూరు చేశారు. దీనివల్ల ఎలాంటి ప్రయోజనం లేదని వాపోతున్నారు.

**విషాదం నింపిన ఘటనలు**

వల్లూరుకు చెందిన చాకలి కిష్టయ్య అనే రైతు 2024 జనవరి 24న సైకిల్‌పై పొలం వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. ఆయన అల్లుడు కిషన్ 2019 డిసెంబరు 5న బైక్‌పై గ్రామానికి వస్తుండగా వాహనం ఢీకొని మరణించాడు. వీరి కుటుంబాలు దయనీయ పరిస్థితిలో ఉన్నాయి. ఇల్లు కూడా లేకపోవడంతో అద్దెకు ఉంటున్నారు. కుటుంబ పోషణ భారమైంది.

**ఇల్లు కట్టుకోలేని పరిస్థితి**

గ్రామానికి చెందిన వడ్ల రమేష్ 2024 డిసెంబరు 3న పని ముగించుకొని చేగుంట నుంచి వస్తున్నాడు. వల్లూరు వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో వాహనం ఢీకొనటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈయనకు భార్య లత, కుమారుడు వంశీ ఉన్నారు. ప్రస్తుతం ఉరుస్తున్న ఇంట్లో ఉంటున్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైనా కట్టుకునేందుకు చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. రైతుబీమా వస్తే అప్పులకే సరిపోయింది.

**హతవిధి.. ఈ శోకం తీరనిది**

ఆనందాస్ శేఖర్ అనే యువకుడు 2025 ఆగస్టు 14న బైక్‌పై వస్తుండగా యూటర్న్ వద్ద జరిగిన ప్రమాదంలో మరణించాడు. ఆ సమయంలో అతడి భార్య నవ్య ఆరు నెలల గర్భిణి. ఇక్కడ ఆర్వోబీ నిర్మిస్తే తన కొడుకు బతికేవాడని అతని తల్లిదండ్రులు బాల్‌నర్సవ్వ, నాగభూషణం బోరున విలపించారు. నాగభూషణం తమ్ముడి కుమారుడు మధు సైతం మూడేళ్ల క్రితం ఇక్కడే జరిగిన ప్రమాదంలో చనిపోయాడు. అప్పుడు ఆయన భార్య కూడా గర్భిణిగా ఉన్నారు.

ఎన్‌హెచ్ 44 ఇలా..
జిల్లా పరిధి: 55 కి.మీ.
ఎక్కడి నుంచి ఎక్కడికి.. కాళ్లకల్ నుంచి దామెరచెరువు
ప్రమాదకరమైన యూటర్న్ వల్లూరు వద్ద
ప్రాణాలు కోల్పోయింది: సుమారు 150 మంది
ప్రమాదాలు తగ్గాలంటే వల్లూరు వద్ద ఆర్వోబీ నిర్మాణం చేపట్టాలి

# అనుమతులు లేకుండానే.. అడ్డగోలుగా కనెక్షన్లు



హైదరాబాద్: నగరంలో విద్యుత్తు కనెక్షన్ కావాలంటే జీహెచ్ఎంసీ, శివార్లలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఇంటి నిర్మాణ అనుమతి పత్రం ఉండాలి. నిర్మాణం 10 మీటర్లు దాటితే ఆయా సంస్థల నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) తప్పనిసరి. ఓసీ లేకున్నా.. నకిలీ ఓసీ సమర్పించి విద్యుత్తు కనెక్షన్లు పొందుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. వీటిపై టీజీఎస్పీడీసీఎల్ విజిలెన్స్ విభాగం విచారణ జరపగా విస్తుపోయే అక్రమాలు వెలుగుచూశాయి. సైబర్‌సిటీ సర్కిల్‌లోని గచ్చిబౌలి టీఎన్‌జీవో, గౌలిదొడ్డి, కంచ గచ్చిబౌలి, నానక్‌రాంగూడ తదితర ప్రాంతాల్లో అనుమతులే లేని భవనాలకు విద్యుత్తు కనెక్షన్లు, ఏకంగా ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేశారు.

**యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘనలు**

ఐటీకారిడార్ కేంద్రంగా ఉన్న సైబర్‌సిటీ సర్కిల్‌లో ఇటీవల పలువురు విద్యుత్తు ఇంజినీర్లు ఏసీబీకి పట్టుబడ్డారు. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టిన కేసులో జైలు కెళ్లారు. పలువురు అధికారులు లక్షలు ఖర్చుచేసి ఈ ప్రాంతంలో పోస్టింగ్ తెచ్చుకుని వసూళ్లకు పాల్పడుతున్నారు. ఓసీ, అనుమతి లేకుంటే వారి పంట పండినట్లే. విజినెన్స్ విచారణలో ఇక్కడ పనిచేసిన లైన్ ఇన్‌స్పెక్టర్ నుంచి ఏడీఈ వరకు నిబంధనలు ఉల్లంఘించారని గుర్తించింది. వీరిపై చర్యలు తీసుకోవాలని సీఎండీకి నివేదిక ఇచ్చింది.

**అవకతవకల చిట్టా ఇది..**

గచ్చిబౌలి టీఎన్‌జీవో కాలనీ ఫేజ్2లో ఒక ప్రభుత్వ ఉద్యోగి జీం4 అంతస్తుల భవనం నిర్మించారు. ఆ ఇంటికి నాలుగు విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చారు. అసలు భవనం నిర్మాణానికి జీహెచ్ఎంసీ అనుమతి లేదని టీజీఎస్పీడీసీఎల్ విచారణలో తేలింది. టీఎన్‌జీవో సొసైటీ అనుమతి తీసుకుని నాలుగంతస్తుల భవనం కట్టారు. ఇది పూర్తిగా అక్రమ నిర్మాణం. అప్పుడు అక్కడ పనిచేసిన సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేశ్ క్షేత్రస్థాయిలో పరిశీలించిన నివేదిక లేకుండా మీటర్లు జారీ చేశారు. జీహెచ్ఎంసీ అనుమతి లేకుండా నిర్మించిన మరో భవనానికి, జర్నలిస్టు కాలనీలో కట్టిన మరో భవనానికి మీటర్లు జారీ చేశారు.

టీఎన్‌జీవో కాలనీలోనే 10 మీటర్లు పైన కట్టిన మరో భవనానికి ఓసీ లేకుండా అప్పటి గచ్చిబౌలి ఏఈ, ప్రస్తుతం సైఫాబాద్ సీబీడీ ఏఈగా విధులు నిర్వహిస్తున్న పి.వి.బి.వేణుగోపాల్ మీటర్లు జారీ చేశారు. మరో భవనానికి ఏకంగా ప్యానల్ బోర్డు జారీ చేశారు.

కంచ గచ్చిబౌలిలో రెండు భవనాలు, నానక్‌రాంగూడలో కట్టిన మరో బహుళ అంతస్తుల భవనాలకు జీహెచ్ఎంసీ అనుమతులే లేవు. 10 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో కట్టారు. ఓసీ లేకున్నా.. వీటికి గచ్చిబౌలి ఆపరేషన్స్ ఏఈ టి.భాస్కరరావు ప్యానెల్‌బోర్డులు, ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేశారు.

గౌలిదొడ్డిలో జీం5 భవనానికి జీహెచ్ఎంసీ అనుమతే లేదు. ఏఈ టి.వెంకట్ నారాయణ రెడ్డి దీనికి ప్యానల్ బోర్డు, ట్రాన్స్‌ఫార్మర్‌లను మంజూరు చేశారు.

# ఫ్యాబ్‌సిటీలో ఐటీ సంస్థలు.. పరిశ్రమలు



హైదరాబాద్ : బాహ్యవలయ రహదారికి సమీపంలోని తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. వీటిని భారత్ ఫ్యూచర్‌సిటీలోని సంస్థలకు అనుసంధానం చేసేలా రెవెన్యూ, పరిశ్రమల శాఖ అధికారులు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఫ్యాబ్‌సిటీ ప్రత్యేక ఆర్థిక మండలిలోని 922 ఎకరాలను సెజ్ నుంచి మినహాయించడంతో రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది. ఫ్యాబ్‌సిటీకి 15 కి.మీ. దూరంలోనే భావినగరం నిర్మాణమవుతున్న నేపథ్యంలో.. మార్గమధ్యలో మరిన్ని ఐటీ సంస్థలు, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్ సంస్థలు ఏర్పాటయ్యేలా, ఏడాదిలోపు రూ.5వేల కోట్ల పెట్టుబడులు రాబట్టేలా కార్యచరణ రూపొందించారు

సెమీ కండక్టర్లు... ఇంధన నిల్వ కేంద్రాలు ఇరవై ఏళ్ల క్రితం ఫ్యాబ్‌సిటీ నిర్మాణ దశలో సెమీ కండక్టర్ల పరిశ్రమలకు ఆ శాఖ అధికారులు ప్రాధాన్యమిచ్చినా ఆశించినస్థాయిలో రాలేదు. వెయ్యి ఎకరాలు మిగిలిపోయాయి. సెమీకండక్టర్ల పరిశ్రమలను ప్రోత్సహించాలంటూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సూచించడంతో.. ఫ్యాబ్ సిటీలో సెమీ కండక్టర్లు, ఇంధన నిల్వల కేంద్రాలకు ప్రాధాన్యమివ్వాలని సంబంధిత అధికారులు నిర్ణయించారు. ఐటీ, ఎలక్ట్రానిక్ సంస్థలు, పరిశ్రమలకూ పాధాన్యమివ్వనున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా.. పరోక్షంగా 15 వేల మందికి ఉద్యోగ, ఉపాధి లభించనుందని అధికారుల అంచనా.

**ప్రత్యేక రహదారులు... మౌలిక సదుపాయాలు**

ఫ్యాబ్‌సిటీ, భారత్ ఫ్యూచర్ సిటీల మధ్య ప్రత్యేక రోడ్లు, మౌలికసదుపాయాలను అధికారులు కల్పించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్–శ్రీశైలం రోడ్డు, శంషాబాద్–గచ్చిబౌలి బాహ్యవలయ రహదారులు మాత్రమే ఉన్నాయి. వీటితోపాటు ఫ్యూచర్ సిటీకి కొంగరకలాన్ నుంచి 330 అడుగుల రోడ్డు నిర్మించనున్నారు. విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీ వరకు మెట్రోరైలునూ అందుబాటులోకి తేవాలని యోచిస్తున్నారు. శంషాబాద్ నుంచి తుక్కుగూడ మీదుగా కలెక్టరేట్ వరకు రహదారి కూడా అందుబాటులోకి రానుంది. తద్వారా ఫాక్స్‌కాన్, మరో రెండు పరిశ్రమలకు అనుసంధానం ఏర్పడనుంది.

## వ్యాపార విస్తరణకు చేయూత

పరిగి : వీధి విక్రయదారులకు ఆర్థికంగా చేయూత నిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ నిధి యోజన పథకాన్ని అమలు చేస్తోంది. అధిక వడ్డీల భారం నుంచి వీరిని గట్టెక్కించి స్వశక్తితో నిలదొక్కుకునేలా చేయడం దీని ఉద్దేశం. ఈ క్రమంలోనే మూడు విడతలుగా వీధి వ్యాపారులను గుర్తించి ఆర్థిక సాయం అందజేస్తోంది. వాయిదాలు క్రమం తప్పకుండా చెల్లిస్తున్న వారిని ప్రోత్సహించేందుకు రాయితీ సదుపాయాన్ని కల్పిస్తోంది. దీన్ని కొందరు చక్కగా వినియోగించుకుంటూ వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నారు. తద్వారా వారి కుటుంబాలకు చేదోడుగా నిలుస్తున్నారు. నాలుగు పురపాలికల్లో 7,887 మంది వీధి వ్యాపారులను అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు వారికి సుమారు రూ.2.76 కోట్లు రుణంగా అందించారు. కొత్తగా క్రెడిట్‌కార్డులు అందించేందుకు కసరత్తు చేస్తున్నారు.

**నాలుగో విడతలో ఇలా..**

ఇప్పటివరకు ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ నిధి యోజన పథకాన్ని పట్టణ ప్రాంతాల్లోనే అమల్లో ఉంది. ఎంపిక చేసిన వీధి వ్యాపారులకు తొలి విడతలో రూ.10వేల చొప్పున 7,887 మందికి, రెండో విడతలో 4,875 మందికి రూ.20వేల చొప్పున, మూడో విడతలో 2,070 మంది వ్యాపారులకు రూ.50వేల చొప్పున రుణ సదుపాయం కల్పించారు. నాలుగో విడతలో వికారాబాద్ పురపాలికలో 793



మందికి, తాండూరులో 840, పరిగిలో 250, కొడంగల్‌లో 280 మందికి క్రెడిట్ కార్డులు అందించనున్నారు. గతంలో రుణం తీసుకొని క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించినవారే నాలుగో విడతకు అర్హులుగా నిర్ధారించారు.

**పరిమితి రూ.30 వేలు..**

నిరుపేద కుటుంబాల్లోనూ ఆర్థిక అక్షరాస్యతను తీసుకొచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగానే క్రెడిట్ కార్డులను అందించేందుకు క్షేత్రస్థాయిలో సర్వే ముమ్మరం చేశారు. వచ్చిన దరఖాస్తులను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఒక్కో క్రెడిట్ కార్డుపై రూ.10వేల నుంచి గరిష్ఠంగా రూ.30వేల దాకా పరిమితి ఉంటుందని అధికారులు తెలిపారు.వచ్చే ఏడాది మార్చికల్లా లక్ష్యం పూర్తి చేస్తాం..: రవికుమార్, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్, మెప్మానిర్దేశిత లక్ష్యాన్ని వచ్చే ఏడాది మార్చికల్లా పూర్తి చేయాలని పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నాం. వ్యాపారంతో ఎప్పటికప్పుడు వచ్చిన డబ్బులు చాలా వరకు ఖర్చు చేస్తున్నారు. పొదుపు అలవాట్లతో ఆర్థిక క్రమశిక్షణ అలవడుతుంది. ఆ దిశగా వారిని ప్రోత్సహిస్తున్నాం.

## జీరో దందా.. తలో వంద..!

నల్గొండ : ఉమ్మడి నల్గొండ జిల్లాలో జాతీయ, రాష్ట్ర రహదారులతో పాటు కంకర, ఇసుక నిల్వలను తీసుకెళ్లే వాహన చోదకుల అతివేగానికి అంతే లేకుండా పోయింది. మూడు జిల్లాల్లోని క్వారీలు, రీచ్‌ల్లో భూగర్భ గనులు, రెవెన్యూ అధికారుల అనుమతుల ప్రకారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సజావుగా సాగుతున్నా.. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అనధికారికంగా నిర్వహించే అక్రమ రవాణా వల్లే రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయి.

**రాజకీయ అండ**

నల్గొండ జిల్లాలో రావులబండ(దోమలపల్లి), నార్కట్‌పల్లి, కేతేపల్లి, కట్టంగూరు, దేవరకొండ, కొండమల్లేపల్లి, గాజీనగర్, పోలేపల్లి, దామరచర్ల, తిప్పర్తి, పెద్ద సూరారం, కనగల్, ఇనుపాముల, బొల్లేపల్లి, పోతినేనిపల్లి, ఇండ్లూరు, వేలాల ప్రాంతాల్లో యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తుండటతో రహదారులు దెబ్బతింటున్నాయి. రహదారి పనులకు ఉచితంగా 'జీరో' బిల్లు ఇచ్చేలా ఆయా క్రషర్ల యజమానులకు గనులు, ఆర్అండ్‌బీ అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో భారీగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి.యాదాద్రి భువనగిరి జిల్లాలోని బొమ్మలరామారం, పోచంపల్లి, బీబీనగర్ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా కంకర తవ్వకాలు జరుగుతున్నాయి.

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో రెండు, గరిడేపల్లి మండలంలో ఆరు కంకర మిల్లులున్నాయి. అప్పన్నపేట, హుజూర్‌నగర్–కోదాడ రోడ్ మధ్యలో ఉన్న కంకర మిల్లుల నుంచి వచ్చే పొగతో స్థానికులు, రవాణా వల్ల వెలువడే దుమ్ముతో వాహనదారులు ఇబ్బందులు



పడుతున్నారు.జీరో దందాను ఆసరాగా చేసుకుని క్రషర్ల నిర్వాహకులు ఒక బిల్లు చీటీతో దొంగ వేబిల్లులు సృష్టించి రెండు, మూడు లారీలను అక్రమంగా తరలిస్తున్నారు. దీనికి అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు సమయాన్ని ఎంచుకుంటున్నారు. అన్ని విభాగాల అధికారులకు, సిబ్బందికి 'నాలుగు రాళ్లు' వెనకేసుకునేలా చేస్తుండటంతో వారూ కూడా చూసీచూడనట్లు ఉంటున్నారనే ఆరోపణలున్నాయి.

జాతీయ, రాష్ట్ర రహదారులపై ఒకే నంబరు ప్లేట్లతో నాలుగైదు వాహనాలు ఉంటున్నాయి. బిహార్, ఒడిశాకి చెందిన వారిని డ్రైవర్లుగా నియమించడంతో వారు ఇష్టారీతిన నడిపిస్తున్నారు.

టిప్పరు, లారీలో గరిష్ఠంగా 30 టన్నుల కంకర నింపాలి. కానీ యజమానులు 70 టన్నుల వరకు నింపేస్తున్నారు. దీంతో వాహనాలు వంగి ప్రయాణించి.. వేగంపై పట్టు తప్పుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా భూగర్భ గనులశాఖాధికారి జాకబ్ సామ్యూల్‌తో ప్రస్తావించగా.. తనిఖీలు చేపట్టి అక్రమాలకు పాల్పడ్డ క్రషర్ యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# పరిశీలన పైపైనే..!



చిత్తూరు : 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' పథకం పేరుతో నాటి వైకాపా ప్రభుత్వం ఆ పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులకు ఇళ్ల పట్టాలు కట్టబెట్టింది. డబ్బులు తీసుకుని అనర్హులకు విలువైన స్థలాలు ఇచ్చారు. పేదలను మాత్రం కొండలు, గుట్టల్లోకి పంపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ బాగోతంపై విచారణకు ఆదేశించింది. కానీ రెవెన్యూ యంత్రాంగం తూతూమంత్ర పరిశీలనతో అనర్హుల సంఖ్య భారీగా తగ్గిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోసారి విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

**భూసేకరణలో చేతివాటం..**

2020 డిసెంబరులో పట్టాల పంపిణీ మొదలైంది. అంతకుముందుకు జరిగిన భూసేకరణలోనూ వైకాపా నేతలు చేతివాటం ప్రదర్శించారు. శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజకవర్గాల్లో ప్రైవేటు భూములు సేకరించారు. మార్కెట్లో ఎకరా రూ.20 లక్షలు ఉండగా రూ.35-40 లక్షల వరకు చెల్లించి ప్రభుత్వంతో కొనుగోలు చేయించారు. ఈ మొత్తం నాయకుల జేబుల్లో వేసుకున్నారు. దీంతోపాటు జాతీయ రహదారులు, పురపాలికలు, మండల కేంద్రాల సమీపంలోని లేఔట్లలో అనర్హులైన పార్టీ శ్రేణులకు స్థలాలు ఇచ్చారు.

చిత్తూరు నగరం ఇరువారంలో వైకాపా నాయకులు, మాజీ, ప్రస్తుత కార్పొరేటర్లు పట్టాలు పొందారు. ఒక్కొక్కరూ 3, 4 సెంట్ల మేర తీసుకొని భవంతులు నిర్మించారు.

అనర్హుల నుంచి రూ.2 లక్షల- రూ.3 లక్షలు వసూలు చేసినట్లు అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్‌లోనూ ఇలానే జరిగింది.

**తిరుపతిలో 456.. చిత్తూరులో 446..**

ఇళ్ల పట్టాల పంపిణీపై తీవ్ర విమర్శలు రావడంతో కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. 6 నెలల పాటు సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించారు. లేఔట్లకు వెళ్లకుండా ప్రక్రియ పూర్తి చేశారు. తిరుపతి జిల్లాలో 456, చిత్తూరు జిల్లాలో 446 మంది మాత్రమే అనర్హులున్నారని, మొత్తంగా 902 మందిని లెక్కల్లో చూపించారు. రెండు జిల్లాల్లో 24 మంది ప్రభుత్వ ఉద్యోగులకు సైతం పట్టాలు ఇచ్చినట్లు తేలింది. తిరుపతిలో 43 మంది స్థలాలు అమ్మేసినట్లు అధికారులు నిర్ధారించారు.

**ప్రతి లేఔట్‌కు వెళ్తేనే..**

అనర్హుల సంఖ్య తేలాలంటే వీఆర్వోలు, వీఆర్ఏలు అన్ని లేఔట్లకు వెళ్లాలి. నిర్మాణం ఆపేసిన, ఇల్లు కట్టిన వ్యక్తులతో మాట్లాడితే వాస్తవాలు బయటకు వస్తాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గ్రామాల్లో 2 సెంట్లు, పట్టణాల్లో 3 సెంట్లు కేటాయించాలని భావిస్తున్న తరుణంలో అనర్హుల పట్టాలు రద్దుచేసి పేదలకు న్యాయం చేయాల్సి ఉంది.

## నిఘా నేత్రం... జరభద్రం!

ఒంగోలు : నేరాల నియంత్రణ, పరిశోధనలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. సంచలనాత్మక కేసులను ఛేధించడంలో పోలీసులకు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. ఈ క్రమంలో తమ వ్యక్తిగత అవసరాలకు వ్యాపారులు, గృహావసరాల కోసం వినియోగిస్తున్న కెమెరాల కోణంలో కొన్ని మార్పులు చేయడం ద్వారా మరింత ప్రయోజనకరంగా ఉండేవిధంగా మార్పులు చేస్తున్నారు. తద్వారా ఎక్కడైనా, ఏదైనా నేరం జరిగితే దాన్ని సత్వరం ఛేధించేవిధంగా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు కెమెరాల కోణంలో మార్పులకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో 5,722 సీసీ కెమెరాలు ఉన్నాయి. ఒంగోలు నగరంతోపాటు జిల్లాలోని ప్రధాన పట్టణాలైన మార్కాపురం, గిద్దలూరు, దర్శి, కనిగిరి, చీమకుర్తి, పొదిలితో సహా కీలకమైన మండల కేంద్రాలు, కొన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిలో కొన్నింటిని పోలీసుశాఖ నిఘా కోసం ఏర్పాటు చేయగా, వాణిజ్య సముదాయాలు, వ్యాపార కేంద్రాలు, రద్దీ కూడళ్లు, ప్రాంతాలు, స్వీయరక్షణ కోసం గృహాల్లో పలువురు వీటిని ఏర్పాటు చేసుకున్నారు. జిల్లాలోని కీలక పట్టణాల్లో ఏర్పాటు చేసిన 502 కెమెరాలు జిల్లా పోలీసు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానమై ఉంటాయి. ఇక్కడి సిబ్బంది వీటిలో నమోదవుతున్న దృశ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంటారు. ఎక్కడైనా, ఏమైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినట్లు గుర్తిస్తే వెంటనే క్షేత్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తారు.

**కెమెరాల కోణం మార్పు ద్వారా..**

తమ వ్యక్తిగత భద్రత కోసం ఏర్పాటు చేసుకునే కెమెరాల్లో ఎక్కువ శాతం తమ దుకాణాలు, వ్యాపార సముదాయాల్లో ఏం జరుగుతోందో



తెలుసుకునే విధంగా ఎక్కువ మంది కెమెరాలు ఏర్పాటు చేసుకుంటారు. అదే సమయంలో తమ ప్రాంతంలోనే రహదారులను కవర్ చేసేలా ఏర్పాటు చేస్తున్నవి చాలా తక్కువ. పలుచోట్ల నేరాలు జరిగిన సమయంలో ఆయా ప్రాంతాల్లోని కెమెరాలను పరిశీలిస్తే, అవి రోడ్లను కవర్ చేయకపోవడంతో నేరస్థులను గుర్తించి పట్టుకోవటానికి కాస్త కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో ఆయా కెమెరాల యాంగిల్‌ను కాస్త మార్చి రోడ్డు సైతం కవర్ అయ్యేలా చేయడం ద్వారా మరింత ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు జిల్లాలో వెయ్యిదాకా కెమెరాల కోణాలను మార్చారు. మిగిలిన వాటిని కూడా త్వరలోనే మార్చనున్నారు.

## పునాదులు దాటని టమాటా పరిశ్రమ

కర్నూలు : జిల్లాలో టమాటా రైతులను ఆదుకోవడానికి పత్తికొండ నియోజకవర్గం కనకదిన్నె గ్రామంలో చేపట్టిన 'సమీకృత టమాటా ప్రాసెసింగ్ పరిశ్రమ' పునాదులకే పరిమితమైంది. శంకుస్థాపన చేసి 7 నెలలైనా పనులు ఒక్క అడుగు ముందుకు పడలేదు. జిల్లాలో సుమారు 7,900 హెక్టార్లలో టమాటా సాగవుతోంది. పంట చేతికొచ్చే సమయానికి ధరలు పడిపోయి రైతులకు నష్టాలు మిగులుతున్నాయి. వారిని ఆదుకునేందుకు పరిశ్రమే దిక్కని నాయకులు భావించారు. వైకాపా అధ్యక్షుడు జగన్ పరిశ్రమ ఏర్పాటుకు 2017 నుంచి హామీ ఇస్తూ వచ్చి.. చివరికి 2023లో వివాదాస్పద భూమిలో శంకుస్థాపన చేశారు. భూ వివాదం కారణంగా అది ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కనకదిన్నెలో 2.50 ఎకరాలను కేటాయించింది. ఈ ఏడాది మార్చిలో రూ.11 కోట్ల అంచనాతో పనులు మొదలుపెట్టింది. ఆగస్టు నుంచి చేతికొచ్చే పంటను పరిశ్రమకు అందించాలనుకుంది. రాష్ట్ర వాటా నిధులతో భూమి కేటాయించి, పునాదులు వేయించింది. కేంద్ర వాటా నిధులు రాకపోవడంతో ప్రాజెక్టు



ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది. జాప్యం వల్ల నిర్మాణం వ్యయం పెరిగి.. రూ.15.50 కోట్లకు చేరేలా ఉందని గుత్తేదారు సంస్థ అధికారులకు ప్రతిపాదన పంపింది.

**నిత్యం 60 టన్నులు**

పరిశ్రమతో రోజుకు 60 టన్నుల టమాటాలు శుద్ధి చేయడం.

250 టన్నుల సరకు నిల్వకు శీతల గిడ్డంగుల నిర్మాణం.

32 మందికి ప్రత్యక్షంగా, వంద మందికి పరోక్ష ఉపాధి.

రోజుకు 10-15 టన్నుల టమాటా గుజ్జు, 2-3 టన్నుల టమాటా కెచప్, పచ్చళ్ల తయారీ యూనిట్లు ఏర్పాటుకు ప్రణాళికలు.

## చెత్త ఎత్తాలంటే కష్టమే

కదిరి: మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ పరికరాలు కరవయ్యాయి. ఇంటింటి చెత్తసేకరణ, వీధులను ఊడ్చటం, డ్రైనేజీల్లో మురుగు తొలగింపు వంటి పనులకు రక్షణ సామగ్రి లేదు. ప్రజారోగ్యానికి తమ ఆరోగ్యం పణంగా పెడుతున్నట్లు స్వచ్ఛ సైనికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్‌శాఖ ఏడాదికోసారి కార్మికులకు గ్లౌజులు, గన్‌బూట్లు, సబ్బులు, నూనె, రేడియం జాకెట్లు ఇవ్వాల్సి ఉంది. వాటిని సమకూర్చటాన్ని విస్మరించారు. కొన్ని మున్సిపాలిటీల్లో పరికరాలను కార్యాలయాలకే పరిమితం చేస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే మున్సిపల్ ఆస్తి కాబట్టి ఆఫీసులోనే ఉండాలంటున్నారు. కార్మికులు మాత్రం పాదరక్షలు, తొడుగుల్లేకుండా హానికారక వ్యర్థాలను తొక్కుతూ, చేతులతో ఎత్తుతున్నారు. అధికారులు స్పందించి రక్షణ వస్తు సామగ్రిని సమకూర్చాలని కార్మికులు కోరుతున్నారు. ధర్మవరంలో పారిశుద్ధ్య కార్మికులకు గన్‌బూట్లు గ్లౌజులు, సబ్బులు, నూనె, రేడియం జాకెట్లు తదితర వస్తు పరికరాలు ఇచ్చి రెండేళ్లవుతోంది. తర్వాత ఎలాంటి సామగ్రి సమకూర్చలేదు. విషయాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసన్ దృష్టికి తీసుకెళ్లగా గుత్తేదారులతో మాట్లాడి త్వరలోనే పంపిణీ చేస్తామని తెలిపారు. కదిరి మున్సిపాలిటీలో గ్లౌజులు, గన్‌బూట్లు ఆఫీసులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. రక్షణ పరికరాలు పదిలంగా పెట్టి, పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ నటరాజ్‌బాబును సంప్రదించగా బూట్లు, గ్లౌజులు ఉన్నాయి. వాటిని కార్మికులకు ఇచ్చినా ఉడుకు అని వేసుకోవటం లేదని చెప్పారు.

జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో పాతబడిన దుస్తులతోనే కార్మికులు చెత్తను వాహనాల్లోకి ఎత్తుతున్నారు. ఏడాదిగా కంపాక్టర్లు మూలనపడ్డాయి. సరైన వస్తు సామగ్రి లేక పారిశుద్ధ్య కార్మికులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఈ విషయంపై కమిషనర్ క్రాంతికుమార్ స్పందిస్తూ సామగ్రి తెప్పించాం. కార్మికులు అందించి సమస్య లేకుండా చూస్తామన్నారు.

# అక్రమ భవనాలు.. 2,196



పుత్తూరు : నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన భవనాలు క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2025 ఆగస్టు 31లోపు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన గృహాలకు అవకాశం ఇస్తూ 2026 మార్చి 11లోపు దరఖాస్తు చేసుకోవాలని నిర్దేశించింది.

అంతా టీపీవోలదే.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇప్పటికే అనధికార కట్టడాలు 2196 ఉన్నట్లు గుర్తించారు. పురపాలికల్లో అక్రమ నిర్మాణాలు, ఉల్లంఘనలకు కర్త, కర్మ, క్రియలు అంతా పట్టణ ప్రణాళికా విభాగం అధికారులే. అనుమతులు తీసుకున్నాక 90 శాతం వరకు నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపడుతున్నట్లు అంచనా. అనుమతి తీసుకున్నాక అధికారులు విధిగా పరిశీలన చేయాలి. లోటుపాట్లు ఉంటే అప్పుడే సరిచేయాలి. తప్పదనుకుంటే కూల్చేయాలి. కానీ చేతివాటం ప్రదర్శిస్తుండటతో అక్రమ కట్టడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి.

**బీపీఎస్‌కు అర్హులు వీరే..**

1985 జనవరి నుంచి 2025 ఆగస్టు 31 మధ్య జరిగిన అక్రమ నిర్మాణాలు

**దరఖాస్తు ఇలా..**

ప్రభుత్వం ప్రకటించిన తేదీ నుంచి 120 రోజుల్లో విధిగా దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు సమయంలో రూ.10వేలు చెల్లించాలి.

స్థలం విస్తీర్ణం, ఏమేరకు అతిక్రమణ జరిగింది, భూమి రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

డిసెంబరు 31, 1997 లోపు ఇళ్లకు ఫీజులో 25%, మురికివాడల్లో అయితే 50 శాతం రాయితీ వర్తిస్తుంది.

**సద్వినియోగం చేసుకోండి - డి.వి.నాగేశ్వరరావు, కమిషనర్, పుత్తూరు**

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని పురప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. వార్డు సచివాయాల్లోని ప్లానింగ్ కార్యదర్శుల ద్వారా మరోదఫా సర్వే చేయించి ఎన్ని అక్రమ నిర్మాణాలు ఉన్నాయో లెక్కలు తీస్తాం.

## పీఎంశ్రీ పాఠశాలలు.. సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రాలు




నాయుడుపేట : ప్రధాన మంత్రి పాఠశాలలు ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) ద్వారా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. కేంద్ర నిధులతో పలు విడతల్లో వసతులకు శ్రీకారం చుడుతున్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేలా సదుపాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

**ప్రయోగాలకు ల్యాబ్‌లు**

విద్యార్థుల్లో సృజనాత్మకత శక్తిని వెలికి తీసేలా, సరికొత్త ఆవిష్కరణలకు ప్రయోగాలు తప్పనిసరి. అందుకు అవసరమైన వసతులు, వస్తు సామగ్రిని దిగుమతి చేశారు. పీఎంశ్రీ ద్వారా పాఠశాలల్లో ల్యాబ్‌లు నిర్వహించడానికి ప్రత్యేక తరగతి గదులను నిర్మిస్తున్నారు. నాయుడుపేట బిరదవాడ గురుకులంలో కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌ల కోసం నిర్మిస్తున్న భవనాలు పూర్తి అయ్యాయి.

**పరుగు ట్రాక్‌లు, కోర్టులు**

పాఠశాలల్లో వసతుల మేరకు నిధులు కేటాయించారు. ఒక్కో పాఠశాలకు రూ.70 లక్షల చొప్పున కేటాయించి భవన వసతి మొదలు క్రీడా ప్రాంగణం బాగు, వస్తు సామగ్రి, పరుగు ట్రాక్, కోర్టులు, విద్యార్థులకు సమదుస్తులు సమకూరుస్తున్నారు. ఇందులో భాగంగానే మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. విద్యార్థులకు చదువుతో పాటు పర్యాటక విజ్ఞానాన్ని అందిస్తున్నారు.

**క్విజ్, ఆటల పోటీలు**

ఈ పథకం కింద ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసి, నోబ్యాగ్ డేకు ఒక్కో బడికి రూ.25 వేలు కేటాయించారు. విద్యార్థులకు క్విజ్, ఆటల పోటీలు జరుపుతున్నారు. సకల వసతులు కల్పిస్తున్నారు.

**తప్పిదాలివే** పీఎంశ్రీ పాఠశాలల ఎంపిక సమయంలో విద్యాశాఖ అధికారులు చేసిన తప్పిదాలతో కొన్ని బడుల్లో అభివృద్ధి చేయలేని పరిస్థితి. నాయుడుపేట బ్రాహ్మణ వీధిలోని బాలికల ఉన్నత పాఠశాలను అధికారులు 2023 సంవత్సరంలో ఎంపిక చేశారు. ఇక్కడ గదులు, ఇతర అభివృద్ధి పనులు చేసేందుకు అవసరమైన స్థలం లేదు. మరుగుదొడ్లు, స్నానపు గదులకు సమస్యగా ఉంది. ఇక క్రీడా ప్రాంగణం అస్సల్లేదు. ఇక్కడ అభివృద్ధి చేసేందుకు అవకాశం లేదు. మరో పాఠశాలను ఎంపిక చేసి ఉంటే ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసే అవకాశముండేది. కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తి చేయక అవస్థలు తప్పడం లేదు. తాజాగా మరికొన్ని పీఎంశ్రీ పాఠశాలలుగా మారనున్నాయి.

## పైన 'పట్టా'రం.. లోన బండారం

ఎమ్మిగనూరు : పునరావాస కాలనీని అక్రమార్కులు చెర'పట్టా'రు. నకిలీ పట్టాలు సృష్టించి బేరం పెట్టారు.. లబ్ధిదారులకు తెలియకుండా మార్చేసి 'వంద' పట్టాల వరకు అమ్మేశారు. ఒక్కో దానికి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. గత మూడేళ్లుగా ఈ దందా కొనసాగుతోంది.. అక్రమార్కులు రూ.5 కోట్ల వరకు వెనకేసుకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కొందరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

**అధికారుల అండ**

లబ్ధిదారులకు ఇంటి స్థలాలకు సంబంధించి పట్టాలు జిరాక్స్ కాపీలు ఇచ్చారు. అసలైన పట్టాలు రెవెన్యూ శాఖ ఆధీనంలోనే ఉన్నాయి. ఇంటిని నిర్మించుకునే లబ్ధిదారులు ఒరిజినల్ పట్టా గృహ నిర్మాణ శాఖకు ఇవ్వాల్సి ఉంది. అయితే రెవెన్యూ అధికారుల ఆధీనంలో ఉండటంతో రాజకీయ అండతో దళారులు అవినీతికి తెరతీశారు.

లబ్ధిదారులకు ఇచ్చిన పట్టాలను మార్చి ఇతరుల పేరిట చేయించుకుంటున్నారు. కొందరు రహదారి పక్కన విలువైన పట్టాలను ఆక్రమించి షెడ్లు నిర్మించుకున్నారు.

లబ్ధిదారుల పట్టాలను దౌర్జన్యంగా ఆక్రమించడమే కాకుండా తమకు ఇచ్చిన నకలు పట్టాను తీసుకెళ్లి చూపినా ప్రయోజనం లేదు. గత మూడేళ్లుగా దందా కొనసాగుతోంది.

**కన్నేసిన నేతలు**

సర్వే నంబరు 135లోని పునరావాస కాలనీ ఏర్పాటు చేశారు. 15



ఏళ్ల కిందట పట్టాలిచ్చినప్పుడు ధర నామమాత్రమే. ప్రస్తుతం అక్కడ సెంటు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షలు పలుకుతోంది. చేనేతలకు 3 సెంట్ల పట్టా, మిగతా లబ్ధిదారులకు రెండున్నర సెంట్ల ఇంటి స్థలాలు ఇచ్చారు. అక్కడున్న ఖాళీ స్థలాలపై అక్రమార్కుల కన్నుపడింది. రాజకీయ అండతో దళారులు అధికారులతో కుమ్మక్కై పట్టాదారులను ఏ'మార్చి'తున్నారు. ఆక్రమించి ఇంటి స్థలాల పట్టాలు మార్చి రూ.లక్షలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. మంచినీటి ట్యాంకు సమీపంలో ఓ వైకాపా నేత ఆక్రమించుకొని ఏకంగా రెండతస్తుల భవనాన్ని నిర్మించారు.

**85 ఎకరాలు.. 1,955 మంది**

2009లో తుంగభద్ర నదికి పెద్ద ఎత్తున వరదలొచ్చాయి..పలు గ్రామాలు నీట మునిగాయి. నందవరం మండలం నాగలదిన్నె పూర్తిగా జలమయమైంది. అక్కడి గ్రామస్థులకు ఎమ్మిగనూరు-గద్వాల రహదారికి ఇరువైపులా 85 ఎకరాల్లో పునరావాస కాలనీని ఏర్పాటు చేసింది. అప్పట్లో 1,955 మందికి పట్టాలు మంజూరు చేశారు. అందులో 1,686 మందికి పట్టాలు అందజేశారు. మిగిలిన లబ్ధిదారులకు ఇవ్వలేదు. అప్పట్లో చాలా మంది ఇళ్లు నిర్మించుకోలేదు.

**నా కుమార్తె స్థలాన్ని కబ్జా చేశారు: చాంద్‌బాషా, నాగలదిన్నె**

వరదల్లో సర్వం కోల్పోయాం. నా కుమార్తె మాబీ, అల్లుడు చాంద్‌బాషా ఇల్లు పూర్తిగా నేలమట్టమైంది. ప్రభుత్వం పునరావాసం కింద కొత్త కాలనీలో పట్టా ఇచ్చింది. నా కుమార్తె స్థలాన్ని వేరే వ్యక్తి ర్జన్యంగా ఆక్రమించుకుని బండలు పాతాడు. కబ్జా చేసిన వ్యక్తే మా కుమార్తెకు కోర్టు నోటీసులు ఇప్పించారు. బతుకుతెరువు కోసం అల్లుడు, బిడ్డ రాజోలిలో ఉంటున్నారు.

## ఉర్దూ విద్యకు ఊరట

కర్నూలు : రాయలసీమ ప్రాంతంలోని మైనారిటీ విద్యార్థులకు ఉన్నత చదువులను చేరువ చేసేందుకు నెలకొల్పిన డాక్టర్ అబ్దుల్‌హక్ ఉర్దూ వర్సిటీకి మహర్దశ పట్టనుంది. ఈ విశ్వవిద్యాలయాన్ని 2018లో తెదేపా ప్రభుత్వం ఓర్వకల్లు వద్ద ప్రారంభించింది. సొంత భవనం లేకపోవడంతో నగరంలోని అద్దె భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రారంభంలో యూజీ, పీజీలో 40 మంది విద్యార్థులు ఉండేవారు. ఓర్వకల్లు వద్ద చేపట్టిన భవన నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. 2019లో అధికారంలోకి వైకాపా ప్రభుత్వం ఉర్దూ యూనివర్సిటీ అభివృద్ధిని గాలికొదిలేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టింది. దాతలు సైతం ముందుకొచ్చి తమవంతు చేయూతనం దిస్తుండటంతో పనుల్లో కదలిక వచ్చింది.

**మార్గం సుగమం**

ప్రధాన రహదారి నుంచి వర్సిటీ భవనం వద్దకు వెళ్లేందుకు రహదారి లేదు. అక్కడ భూములు కలిగున్న బీకే సింగ్‌ను స్థలం ఇవ్వాలని అధికారులు కోరారు. ఆయన స్పందించి 13 సెంట్ల స్థలాన్ని రహదారి కోసం కేటాయించారు. వర్సిటీ పేరున రిజిస్ట్రేషన్ కూడా చేయించి ఇచ్చారు. దీంతో ఈ రహదారికి బీకే సింగ్ పేరు పెట్టారు. ఇక్కడ సీసీరోడ్డు నిర్మాణం కోసం గతంలోనే రూ.50 లక్షలు కేటాయించారు. ప్రస్తుతం పనులు జరగుతున్నాయి.

వర్సిటీ భవన నిర్మాణం (జీ ప్లస్-1) పూర్తి చేసేందుకు కోసం రూ.2



కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీంతో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ స్పందించి రూ.కోటి విరాళం అందించారు. ప్రభుత్వం నుంచి మరో రూ.కోటి నిధులు విడుదల చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అందుబాటులో ఉన్న కోర్సులు

పీజీలో ఎంఏ తెలుగు, ఇంగ్లిష్, ఎకనామిక్స్, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్సు, బోటనీ, జువాలజీ, ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు ఉన్నాయి.డిగ్రీలో.. బీకాం (ఆనర్స్), బీఏ ఎకనామిక్స్ (ఆనర్స్), బీఏ స్పెషల్ ఉర్దూ కోర్సులు ఉన్నాయి.

ఈ ఏడాది పీజీలో 321 సీట్లు అందుబాటులో ఉండగా ప్రథమ సంవత్సరం 91, రెండో ఏడాది 86 మంది విద్యార్థులున్నారు. డిగ్రీలో 180 సీట్లు ఉండగా 32 మంది విద్యార్థులు చదువుతున్నారు.

# ఆడుదాం.. ఆనందంగా!

చిత్తూరు : చిత్తూరు జిల్లాలో క్రీడాకారులు పుష్కలంగా ఉన్నా సౌకర్యాలు మాత్రం అంతంతగానే ఉంటున్నాయి. దీంతో కొందరు లక్ష్యాలు చేరుకోలేకపోతున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో సమస్యలతో ఆటలు ఆడాల్సిన పరిస్థితి ఎదురైంది. ఈ నేపథ్యంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలోని మెసానికల్ మైదానం అభివృద్ధికి రూ.2.59 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇటీవల మైదానాన్ని పరిశీలించిన శాప్ ఛైర్మన్ రవినాయుడు సూచనలతో చర్యలు చేపట్టారు. మెసానికల్ మైదానం బహుళ క్రీడల సాధనకు వేదిక. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులతో పాటు నడకకు వచ్చే వారి సంఖ్య 400 వరకు ఉంటుంది. వీరితోపాటు క్రికెట్, ఖోఖో,



బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ తదితర క్రీడల సాధనకు మరో 100 మంది వస్తుంటారు. కానీ వసతుల లేమి ఇబ్బందిగా మారింది. మరుగుదొడ్లు సక్రమంగా లేవు. రాత్రి వేళల్లో మందుబాబులు మద్యం సీసాలను మైదానంలో వేసి వెళ్తుంటారు.

**ఇవీ సౌకర్యాలు..**

మైదానం చుట్టూ ప్రహరీకి విద్యుత్తు కంచె ఏర్పాటు.
పరుగు సాధనకు 400 మీటర్ల అధునాతన అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మాణం.
క్రీడాకారులకు వేర్వేరుగా మరుగుదొడ్లు, స్నానపు గదుల నిర్మాణం.
డార్మిటరీ మొదటి అంతస్తులో వంటగది, భోజనశాల ఏర్పాటు.
గ్యాలరీల్లో మల్టీపర్పస్‌గా వినియోగించేందుకు పెయింటింగ్, స్కేటింగ్ రింగ్‌ల ఆధునికీకరణ.

# పోషణ లోపం.. బాలల భవితకు శాపం



అనంతపురం : సమాజ పురోభివృద్ధికి ప్రాథమిక కొలబద్ధ మానవ వనరుల ఎదుగుదలే ప్రామాణికం. మానవ వనరుల అభివృద్ధి, ప్రగతి సూచికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా వెనుకబడింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఆరేళ్లలోపు ఉన్న పిల్లల్లో పోషణ లోపం ప్రమాద స్థాయిలో నమోదు అవుతోంది. ఇందుకు నీతి అయోగ్ గణంకాలే నిదర్శనం. చిన్నారుల వయసుకు తగ్గ బరువు, ఎత్తు పెరుగుదల బాగా క్షీణిస్తోంది. 0–6 ఏళ్లలోపు బాలలు ఉమ్మడి జిల్లాలో 4.25 లక్షల మంది ఉంటారని అంచనా. జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో 2 లక్షల మందికిపైగా పిల్లలు నమోదు అయ్యారు. దీన్ని బట్టి చూస్తే సగానికిపైగా అంగన్‌వాడీలకు దూరంగా ఉన్నట్లే. ఈ గణంకాలను పరిగణలోకి తీసుకున్నా పోషణ లోపంతో సతమతమయ్యే పిల్లల సంఖ్య అమాంతం పెరుగుతోంది.

**ప్రతి ముగ్గురిలో ఒకరు ఎదగలేక..**

పోషణ లోపం పిల్లల ఎదుగుదలను పూర్తిగా అడ్డుకుంటుంది. ప్రతి ముగ్గురిలో ఒకరికి శరీర ఎదుగుదల (ఎత్తు) పెరగడం లేదు. ప్రతి ఐదుగురిలో ఒకరు తగిన బరువు ఉండటం లేదు. పుట్టిన నాటి నుంచే తొలి వెయ్యి రోజులు దాకా పౌష్టికాహారం పుష్కలంగా, సంపూర్ణంగా అందివ్వాల్సిన అవసరం ఉంది.

**సమతుల ఆహారం**

ఆరేళ్లలోపు పిల్లలకు సమతుల ఆహారం క్రమం తప్పకుండా ఇవ్వాలి. వయసుకు తగ్గ బరువు, ఎత్తు ప్రామాణికంగా పోషణ లోపాన్ని కొలుస్తారు. మాంసకృత్తులు, పిండి, కొవ్వు, పీచు పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు.. వంటి వాటిని కలిపే పౌష్టికాహారం అంటాం. ఇవన్నీ శరీర ఎదుగుదల, శక్తికి ఎంతో కీలకం. తాజా ఆకుకూరలు, కూరగాయలు, పప్పు దినుసులు, పాల ఉత్పత్తులు, చేపలు, మాంసం.. వంటి వాటిని సమపాళ్లల్లో ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**ఖర్చు తక్కువతో ఆరోగ్యం**

నువ్వుల ఉండలు, బెల్లం చిక్కీలు, చిరుధాన్యాలతో చేసిన చిరుతిండ్లు, కోడిగుడ్లు, మాంసాహారం, పండ్లు, ఆకుకూరలు, కూరగాయలతోపాటు కొబ్బరి నీరు, పాలు, పెరుగు.. క్రమం తప్పకుండా తీసుకుంటే రక్తహీనత ఉండదు. పోషణ లోపం తలెత్తదు. తెలివితేటలు, చురుకుదనం పెరుగుతాయి. వ్యాధి నిరోధక శక్తి పుష్కలంగా ఉంటుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

**అధిక వ్యయంతో అనారోగ్యం**

వివిధ రకాల చిప్స్ (ప్యాకేజ్డ్), బిస్కెట్లు, చాక్‌లెట్లు, ఐస్‌క్రీం, పానీపూరి, శీతల పానీయాలు, వేపుళ్లతో చేసిన వంటకాలు.. తదితరాల్లో సమతుల ఆహారం ఉండదు. పైగా శారీరక, మానసిక ఎదుగుదల ఉండదు. వ్యాధి నిరోధక శక్తి క్షీణించి.. కాలానుగుణ వ్యాధుల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు.

# ఇస్తే వస్తాం.. లేదంటే రాలేం..!

పలమనేరు: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది. ఛైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్వర్యంలో చేపట్టాల్సిన సాధారణ సమావేశానికి ఉద్దేశ పూర్వకంగా వైకాపా కార్యవర్గ సభ్యులు హాజరు కాలేదు. కమిషనర్ ఎన్వీ రమణారెడ్డితో పాటు అధికారులు, సిబ్బంది నలుగురు తెదేపా కౌన్సిలర్లు హాజరయ్యారు. మొత్తం 26 మంది సభ్యుల్లో 22 మంది రాకపోవడంతో కమిషనర్ సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఇదే రోజు 12 తర్వాత బడ్జెట్ సమావేశాన్ని కూడా నిర్వహిస్తున్నట్లు సమాచారమిచ్చినా వారు రాకపోవడంతో రెండు సమావేశాలు వాయిదా పడ్డాయి.

**దుకాణ సముదాయాలే కారణమా..?**

వైకాపా హయాంలో అనుమతులు లేకుండా కొన్ని దుకాణ సముదాయాలను కౌన్సిల్ సభ్యుల ప్రోద్బలంతో అధికారులు నిర్మించారు. వీటిని సొంతం చేసుకోడానికి సమావేశంలో ఆమోదం కోసం




ప్రయత్నించారు. అవి నిబంధనలకు అనుగుణంగా లేవని, అనుమతులు కూడా లేనందున సమావేశంలో అజెండా అంశంగా పెట్టడానికి అధికారులు నిరాకరించారు. దీంతో సమావేశానికి దుమ్మా కొట్టినట్లు సమాచారం.

**ఏమా గదుల వ్యవహారం..**

మున్సిపల్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండు వద్ద 8 గదులను వైకాపా హయాంలో అనుమతులు లేకుండా రాచకాలువను కుదించి కొందరు కౌన్సిలర్లు నిర్మించారు. వీటికి దారి ఇవ్వడానికి ఆర్టీసీ వారు అడ్డుపడటంతో ఏడాదిగా నిరుపయోగంగా ఉన్నాయి. ఈ క్రమంలో వైకాపా కౌన్సిలర్లు తలా ఒకటి పొందటానికి ఎత్తుగడ వేశారు. అలాగే బాలికోన్నత పాఠశాల ఎదురుగా నిబంధనలకు విరుద్ధంగా నాలుగు గదులు నిర్మించారు.

# సులభంగా పొందండి.. విద్యుత్తు కనెక్షన్

చిత్తూరు : విద్యుత్తు కనెక్షన్ పొందాలంటే ఇకపై కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. ఇన్నాళ్లు కొత్త కనెక్షన్ కావాలంటే ఇంటికి 30 మీటర్ల దూరం దాటితే స్తంభాల ఖర్చు వినియోగదారుడే భరించాల్సి ఉండేది. దరఖాస్తు, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం రుసుం నిర్ణయించేవారు. వీటికి సర్వీస్ లైన్, డెవలప్‌మెంట్ ఛార్జీలు అదనం. అనధికారికంగా సిబ్బంది సైతం కొంత వసూలు చేసేవారు. ఇకపై వినియోగదారులకు సులభంగా సేవలు అందించేలా ఆ శాఖ చర్యలు చేపట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీఈఆర్‌సీ) కొత్త విద్యుత్తు కనెక్షన్ల జారీలో సంస్కరణలు తీసుకొచ్చింది. కొత్త




కనెక్షన్, అదనపు లోడ్ కేటగిరీ ఆధారంగా స్థిరఛార్జీలు నిర్ణయించింది. అదనపు ఛార్జీలు లేకుండా చేసింది. ఎస్పీడీసీఎల్ ఆదేశాలతో సత్వర కనెక్షన్ అందిస్తామని జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు.

**ఎల్‌టీకి ఇలా..**

గృహావసరాల కనెక్షన్లు (ఎల్‌టీ) కిలోవాట్‌కు రూ.1,500, ఒకటి నుంచి 20 కిలోవాట్ వరకు అదనంగా ప్రతి కిలోవాట్‌కు రూ.2 వేల చొప్పున చెల్లించాలి. 20 నుంచి 150 వరకు ప్రతి కిలోవాట్‌కు రూ.12,600 చొప్పున చెల్లించాలి. వాణిజ్యం: కిలోవాట్‌కు రూ.1,800, 20 కిలోవాట్ల వరకు అదనంగా ప్రతి కిలోవాట్‌కు రూ.2 వేల చొప్పున చెల్లించాలి. 20 నుంచి 150 వరకు ప్రతి కిలోవాట్‌కు రూ.12,600 చొప్పున కట్టాలి. హెచ్‌టీ : 75 నుంచి 150 వరకు ప్రతి కిలోవాట్‌కు రూ.4,400 చొప్పున చెల్లించాలి. నియంత్రికను వినియోగదారుడే ఏర్పాటు చేసుకోవాలి.

# బుక్కచర్లలో.. భూకబ్జా



అనంతపురం : అధికారం ఉన్నా... లేకున్నా వైకాపా నాయకులు భూకబ్జాలకు తెగబడుతున్నారు. కొండలు, గుట్టలపై కన్నేశారు. రాప్తాడు మండలం బుక్కచర్లలో స్థానిక వైకాపా నాయకులు తమ పొలానికి ఆనుకుని ఉన్న సర్కారు భూమిని ఆక్రమించి పండ్లతోటలు సాగు చేస్తున్నారు. పక్కన రైతుల పొలాలకు వెళ్లే దారిని మూసేసి.. మీ దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. బుక్కచర్ల పరిధిలోని సర్వే నంబరు 304లో గుట్టతో కలిపి 34 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనికి ఆనుకుని అదే గ్రామానికి చెందిన వైకాపా నాయకులు నల్లపరెడ్డి, గోవింద్‌కు పొలాలు ఉన్నాయి. వైకాపా హయాం నుంచి కొద్దికొద్దిగా ప్రభుత్వ భూమిని తమ పొలంలో కలిపేసుకుంటూ వస్తున్నారు. సదరు ప్రభుత్వ భూమిలో నుంచే స్థానికులు సమీపంలోని ఈరలమ్మ ఆలయానికి వెళ్లేవారు. వైకాపా నాయకులు భూమిని ఆక్రమించి దారిని మూసేశారు. 30 మంది రైతులు తమ పొలాలకే వెళ్లాలంటే ఇదొక్కటే దారి. వైకాపా నాయకుల దందా కారణంగా అవస్థలు పడుతున్నారు.

**ఎర్రమట్టి తవ్వి..**వైకాపా నాయకులు తాము ఆక్రమించిన భూమి పక్కనే ఉన్న గుట్టపై కన్నేశారు. జేసీబీలతో ఎర్రమట్టి తవ్వుతూ టిప్పర్ల ద్వారా అనంతపురం తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి తవ్వగా గుట్టపై చదునైన భూమిని కొద్దికొద్దిగా ఆక్రమించుకుంటూ వస్తున్నారు. ఈ విషయంపై రాప్తాడు తహసీల్దార్ విజయకుమారిని వివరణ కోరగా స్థానికుల ఫిర్యాదు మేరకు భూకబ్జాను అడ్డుకున్నాం. జేసీబీని పోలీస్‌స్టేషన్‌కి తరలించామన్నారు. త్వరలోనే ఆక్రమించుకున్న భూమిని స్వాధీనం చేసుకుంటామన్నారు. నల్లపరెడ్డి 2 ఎకరాలు, గోవింద్ 2.5 ఎకరాలు ఆక్రమించి తోటలు సాగు చేస్తున్నారు. మరో కానిస్టేబుల్.. బినామీ పేరుతో 1.5 ఎకరాలు ప్రభుత్వ భూమి కబ్జా చేయడం గమనార్హం.

# శిశువిలాపం

కర్నూలు : నవజాత శిశు సంరక్షణ కేంద్రాలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. వివిధ స్థాయుల్లో వైద్య సేవలందించేందుకు ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ఎస్ఎన్‌సీయూ (స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్)లు ఏర్పాటు చేశారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, సున్నిపెంట, ఆత్మకూరు, వెలుగోడు మండల కేంద్రాల్లోని ఆసుపత్రుల్లో కేంద్రాలు ఉన్నాయి. నవజాత శిశువుల్లో ఏవైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే ఈ కేంద్రాల్లో ఉంచి సంరక్షిస్తారు. పుట్టిన పిల్లలు ఏడవకపోవడం, తక్కువ బరువుతో జన్మించడం.. 35 వారాలు నిండకుండా ప్రసవం కావడం, ఫిట్స్ వచ్చే శిశువులు, ఉమ్మనీరు మింగినవారు, శ్వాస సంబంధిత సమస్యలున్న శిశువులకు కేంద్రాల్లో వైద్య సేవలందిస్తారు..

**ప్రైవేటు బిల్లు.. గుండె గుబేలు**

ఎస్ఎన్‌సీయూ సేవలు అత్యంత ఖరీదైనవి. వివిధ సమస్యలతో బాధపడుతున్న పిల్లలను వార్మర్లపై ఉంచి తల్లి గర్భంలోని వాతావరణం ఉండేలా చేస్తారు. ఒక శిశువును ప్రైవేటుగా ఉంచాలంటే.. ఆస్పత్రి స్థాయిని బట్టి రూ.2 నుంచి 8 వేల వరకు వసూలు చేస్తారు. వైద్య సేవలను బట్టి బిల్లులుంటాయి. మూడు నాలుగు రోజులుంటే.. రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేయాల్సిందే. అప్పుడే పుట్టిన పిల్లల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటంతో ఇన్‌ఫెక్షన్లు వేగంగా సోకే ప్రమాదం ప్రమాదముంటుంది.

**ఎక్కడ.. ఎలా ఉందంటే..**

ఆదోని ప్రభుత్వ మహిళా, శిశు ఆస్పత్రిలో 2022లో భవ్య ఏజెన్సీ నిర్వహణలో ఎస్ఎన్‌సీయూ సేవలు పీపీపీ విధానంలో ప్రారంభమయ్యాయి. పది పడకలు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ప్రతి నెలా జనన నమోదు 120–130 వరకు ఉంటుంది. పది పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రెండు కాన్సన్‌ట్రేటర్లు మరమ్మతులకు గురయ్యారు. ఆక్సిజన్ ప్లాంట్ పనిచేయక నాలుగేళ్లు దాటింది. ఆక్సిజన్ సిలిండర్లు కొనుగోలు చేసి సేవలందిస్తున్నారు. ఇంత పెద్ద కేంద్రం ఏర్పాటుచేసినప్పటికీ అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన శిశువులను నెలలో కనీసం 10–15 మందిని కర్నూలుకు రెఫర్ చేస్తున్నారు.

కర్నూలు జీజీహెచ్‌లో 60 పడకలు ఏర్పాటు చేశారు. ఇందులో 12 వెంటిలేటర్లకు గాను ఆరు మాత్రమే పనిచేస్తున్నాయి. ఎనిమిది మంది వైద్యులు, 25 మంది సిబ్బంది ఉన్నారు. రోజు 30 ఐపీ, నెలకు వెయ్యి మంది వైద్య సేవలు పొందుతున్నారు. ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని కేంద్రాన్ని పబ్లిక్, ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# ఆక్రమణకు ఇదో వంక!

రేణిగుంట : ప్రభుత్వ భూముల కబ్జాకు అక్రమార్కులు కొత్త దారులు వెతుకుతున్నారు. తన పొలంలో వెళ్తున్న వంకపై కల్వర్టు నిర్మించుకుంటానని అనుమతి తీసుకున్న వ్యక్తి ఆ స్థలం ఆక్రమణకు యత్నించిన వైనం రేణిగుంట మండలంలో వెలుగులోకి వచ్చింది.

ప్రభుత్వాలు మారినా రేణిగుంట మండలంలో కబ్జాలు ఆగడం లేదు. కాలువలు పూడ్చి నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా కొత్తపాళెం రెవెన్యూ గ్రామం లెక్క దాఖలా సర్వే నంబర్ 89లో వంక పారుతోంది. ఇటీవల స్థానిక రైతు ఒకరు తన పొలంలో మట్టి తోలి చదును చేసుకున్నారు. రాళ్లతో కూడిన ఈ మట్టి పక్కగా వెంచర్‌కేనని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. దీనికితోడు సదరు వ్యక్తి పొలం మధ్యలో వెళ్తున్న వంకపై కల్వర్టు నిర్మించుకుంటానని జలవనరుల శాఖ అధికారుల నుంచి అనుమతి పొందారు. అయితే వంకలో పైపులు వేసి మట్టితో చదును చేశారు. దీనివల్ల తమ భూములకు సాగునీరు సక్రమంగా రాదని, సాగు భూముల్లో కల్వర్టు నిర్మాణానికి అనుమతి ఇస్తారే కానీ ఇలా స్థిరాస్తి వ్యాపారానికి అనుకూలంగా వ్యవహరించరని స్థానిక రైతులు అభ్యంతరం తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు ఈ పైపులైన్లను తొలగించారు.

**అధికారులు ఏమన్నారంటే..**

ఈ అంశంపై తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా రైతుల ఫిర్యాదు మేరకు పైపులు తొలగించామ న్నారు. ఉన్నతాధికారులు పేర్కొన్న నిబంధనల మేరకు ఇక్కడ నిర్మాణాలు జరగలేదని జలవనరుల శాఖ ఏఈ హరికృష్ణ తెలిపారు.

# నాడు- నేడు పూర్తయ్యేది ఏనాడు?



హిందూపురం : కార్పొరేట్ పాఠశాలలకు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయల కల్పన నేటికీ కలగానే మిగిలింది. నాడు–నేడు, తొలి, రెండో విడత కింద జిల్లా సౌకర్యాలు లేని పాఠశాలలకు అవి అందుబాటులోకి వస్తాయని ఎంతో ఆశతో ఎదురు చూశారు. 2019లో ప్రారంభమై పథకం పనులు మూడు సంవత్సరాల్లో రెండు విడతల పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. తొలివిడత కింద చేపట్టిన పనులు దాదాపు పూర్తికాగా రెండో విడత కింద చేపట్టిన పనుల్లో ఒక్కటీ పూర్తి కాకపోవడం గమనార్హం. ఈ పథకం కింద చేపట్టిన అదనపు గదులు, ప్రహరీలు, మరుగుదొడ్లు, భవనం పై కప్పు మరమ్మతు పనులు నేటికి అసంపూర్తిగా ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2024–25 సంవత్సరంలోనైన ఈ పనులు పూర్తవుతాయని ఎంతో ఆశించారు. పనుల్లో ఎలాంటి పురోగతి లేనందున పనులు చేపట్టేందుకు తరలించిన ఇనుము తుప్పు పట్టి, సిమెంట్ గడ్డకట్టి ఎందుకు పనికి రాకుండా పోయింది.

**వచ్చే విద్యాసంవత్సరంపై ఆశలు**

వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం లోపు అసంపూర్తిగా నిలిచిన వాటిని పూర్తి చేసి విద్యార్థులకు సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొస్తారనే ఆశతో విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.

**నిధులు మంజూరైన వెంటనే పనులు**

రెండో విడత కింద మంజూరైన పనుల్లో కొన్ని అసంపూర్తిగా నిలిచాయి. వీటి పూర్తికి అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం మంజూరైన వెంటనే పనులు పూర్తిచేస్తాం.
దేవరాజ్, కేజీబీవీ అదనపు కోఆర్డినేటర్, పుట్టపర్తి

# పార్శిల్ సేవల్లో ఆర్టీసీ వేగం

చిత్తూరు: ఆర్టీసీలోని కార్గో సేవలు రోజు రోజుకు పుంజుకుంటున్నాయి. పార్శిల్ సేవలను ప్రజలకు చేరువ చేస్తూ అంతకంతకు ఆదాయాన్ని ఆర్జిస్తోంది. లాజిస్టిక్ విభాగంలోనూ పైచేయిగానే నిలుస్తోంది. ఒకేసారి 10 నుంచి 12 టన్నుల సరకును నిర్ణయించిన సమయం లోపు చేరవేస్తూ.. ప్రజల్లో నమ్మకాన్ని సంపాదిస్తోంది. 2017లో ప్రారంభమైన కార్గో సేవలు మొదటి రోజు రూ.10 వేల ఆదాయంతో అడుగులు పెట్టి.. ప్రస్తుతం రోజుకు రూ.1.50 లక్షలు సమకూరుస్తోంది. సింగూ సొల్యూషన్స్ ప్రైవేటు సంస్థ ఏజెన్సీల ద్వారా పార్శిల్ బుకింగ్ సేవలు నిర్వహిస్తూ.. వాటికి కమీషన్ చెల్లిస్తోంది. ముమ్ముందు పార్శిల్ సేవలతో పాటు డోర్ డెలివరీలను మరింత పెంచే దిశగా ఆర్టీసీ అడుగులు వేస్తోంది.

**నెలకు రూ.42 లక్షల ఆదాయం..**

చిత్తూరు ఒకటి, రెండో డిపో, పలమనేరు, కుప్పం, పుంగనూరు డిపోలతో పాటు వి.కోట బస్టాండులో కూడా పార్శిల్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ డిపోల పరిధిలో రోజుకు కనీసం 650 పార్శిళు బుక్ అవుతుండగా.. వాటి ద్వారా నెలకు రూ.42 లక్షలకు పైగానే ఆదాయం సమకూరుతోంది.

80 ప్రాంతాల్లో..చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు ఆర్టీసీ కార్గో సేవలు అందుతున్నాయి. రాష్ట్రంలోని 80 ప్రాంతాల్లో ఉన్న డిపోలకు 10 కి.మీ దూరం వరకు డోర్ డెలివరీలు ఉంటున్నాయి. జిల్లా నుంచి బంతి, చామంతి, బెల్లం, ప్లాస్టిక్, పన్నీరు, కోవా తదితర సరకులు ఎగుమతి అవుతున్నాయి. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సైతం కార్గో సేవలు అందడం విశేషం.

# ఐటీ రంగం.. ఐక్యతారాగం

ముదిగుబ్బ : అదొక చిన్న పల్లెటూరు. దొరిగల్లు కొండ శివార్లలోని ఒక మారుమూల గ్రామం. మొత్తం 150 నివాసాలున్నాయి. అన్నీ వ్యవసా యాధారిత కుటుంబాలే. కష్టాలెన్ని వచ్చినా పిల్లలకు చదువే ముఖ్యం అని గట్టిగా తలిచారు. ఇటీవల అధికారులు వర్క్ ఫ్రమ్ హోం సర్వే నిర్వహించగా గ్రామంలో మొత్తం 50 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నట్లు గుర్తించారు. ఇంత చిన్న ఊరిలో అంతమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులా..అని అందరూ ముక్కున వేలేసుకున్నారు. గ్రామంలో పదేళ్ల క్రితం రమేష్ ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు. తర్వాత మరి కొందరు.. స్థిరపడినవారు గ్రామంలో మిగిలిన వారికి ఉద్యోగాల్లోకి వచ్చేలా ప్రోత్సహించారు. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై ఇతర ప్రాంతాల్లో పలు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నవారు కొందరైతే.. గ్రామంలోనే వర్క్‌ఫ్రంహోం చేస్తూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉన్నవారు ఇంకొందరు. ఇంటికొకరు చొప్పున ఉద్యోగాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న వైనానికి ఐకమత్యమే ఆలంబన..

# సేవలందే మార్గమిదే




డోన్ : ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా రెండు జాతీయ రహదారులు వెళ్తున్నాయి. ఎన్‌హెచ్–40 పరిధిలో చాగలమర్రి, నంద్యాల, నన్నూరు శివారు, ఎన్‌హెచ్ 44 పరిధిలో అమకతాడు వద్ద టోల్‌ప్లాజాలున్నాయి. ఆయా మార్గాల్లో ప్రతిరోజూ 30 వేలకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. టోల్ చెల్లిస్తున్న నేపథ్యంలో వాహనదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. అత్యవసర సేవలు సైతం పొందొచ్చు. ఏదేని ఇబ్బందులు కలిగితే ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు.

**1033తో సత్వర సాయం**

జాతీయ రహదారులపై వాహనం ఆగిపోయినా.. పెట్రోల్, డీజిల్ అయిపోయినా 1033 నంబరుకు ఫోన్ చేస్తే చాలు.. తక్షణ సాయం అందుతుంది.

**బటన్ నొక్కితే చాలు..**

జాతీయ రహదారిపై ప్రతి కి.మీ. నుంచి 2 కి.మీ. మధ్యలో రోడ్డు పక్కన స్తంభాలకు ఎస్‌వోఎస్ పెట్టెలుంటాయి. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు లేదా ఇతర అత్యవసర సమయాల్లో తక్షణ సాయం కావాలంటే ఈ పెట్టెపై ఉన్న బటన్ నొక్కి మనం ఉండే ప్రదేశం చెబితే వెంటనే టోల్ సిబ్బంది అక్కడికి చేరుకుని అవసరమైన సాయం అందిస్తారు.

**చిత్రం తీయ్.. రివార్డు అందుకో**

రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని టోల్‌ప్లాజాల వద్ద మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్న చిత్రం తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫొటోతోపాటు పంపినవారి పేరు, వాహనం, రిజిస్ట్రేషన్ నంబరు, లొకేషన్ తదితర వివరాలు నమోదు చేయాలి.
రోజూ వచ్చిన చిత్రాల్లో అర్హత ఉన్న వాటిని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఎంపిక చేస్తారు.
ఫిర్యాదుదారుడి వాహన రిజిస్ట్రేషన్ నంబరుకు అనుసంధానమైన ఫాస్టాగ్‌కు రూ.1,000 రీఛార్జి రూపంలో రివార్డు అందిస్తారు.

## పాలిథిన్ ముట్టమని ప్రమాణం..15 ఏళ్ల ప్రయాణం

బొబ్బిలి : బొబ్బిలి పట్టణం జిల్లాలోని మిగతా పురపాలికలకు ఆదర్శంగా నిలుస్తోంది. శతశాతం ప్లాస్టిక్ నిషేధం.. తడి చెత్తతో ఎరువు తయారీ.. వ్యర్థాలతో బయో గ్యాస్ ఉత్పత్తి.. పొడి చెత్తలో పనికొచ్చే వ్యర్థాలు వేరుచేసి విక్రయించడం తదితర కార్యక్రమాలతో ఉత్తమ పురపాలికగా పేరొందుతోంది. పట్టణాలు, గ్రామాల్లోకి అడుగుపెట్టగానే ప్లాస్టిక్ గ్లాసులు, సంచులు గుట్టలుగా కనిపిస్తాయి. ఖాళీ ప్రదేశాలన్నీ వాటితోనే నిండి ఉంటాయి. బొబ్బిలిలో 15 ఏళ్లుగా 120 మైక్రాన్ల కంటే తక్కువ ఉండే పాలిథిన్‌ను నిషేధించారు. ఎక్కడ చూసినా కాగితం, జనపనార, వస్త్రాలతో తయారు చేసిన సంచులే కనిపిస్తాయి. తాగునీటి ప్యాకెట్లను కూడా నిషేధించారు. కల్యాణ మండపాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో ట్యాంకర్లతో పురపాలిక తాగునీటిని అందిస్తుంది. ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంతో శతశాతం అమలవుతోంది. లార్వా కంపోస్టు విధానంలో వ్యర్థాల నుంచి 15 రోజుల్లోనే ఎరువును తయారు చేస్తున్నారు.



ట్యాంకుల అడుగున కొంత ఇసుక, మెటల్ వేసి రోజుకు 40 కిలోలు తడి చెత్త వేస్తారు. వీటిపై పురుగులుగా మారే గుడ్లు 10 గ్రాములు పిచికారీ చేస్తున్నారు. ఇవి తడిచెత్తను ఆహారంగా తీసుకుంటున్నాయి. అవి విసర్జించిన వ్యర్థాలు ఎరువుగా మారుతున్నాయి. ప్రస్తుతం 30 ట్యాంకులు అమర్చారు. వీటి నుంచి వచ్చే నల్లటిరసం పంటలకు ఎరువుగా వాడుకోవచ్చు. దీనికోసం ట్యాంకు దిగువన ట్యాపులు ఏర్పాటు చేశారు. గుడ్లుతో తయారయ్యే పురుగులు బయటకు వచ్చేందుకు పైన పైపు ఏర్పాటు చేశారు. వాటిని కోళ్ల మేతగా ఉపయోగిస్తారు. పుర కార్యాలయం పైన సోలార్ పలకలు అమర్చారు. దీనివల్ల నెలకు రూ.50 వేలు విద్యుత్తు బిల్లు ఆదా అవుతోంది.

## అలుగు పారితే అడుగు పడదు

ఆత్మకూరు: నల్లమల అటవీ ప్రాంతంలో కర్నూలు–గుంటూరు ఎన్‌హెచ్–340సీపై ప్రయాణానికి సిద్ధాపురం చెరువు తరచూ ఆటంకం కలిగిస్తోంది. భారీ వర్షాలతో అలుగు ఉప్పొంగితే రాకపోకలు ఆగిపోతున్నాయి. లోలెవెల్ వంతెన నిర్మిస్తే రాకపోకలకు ఇబ్బందులు ఉండవు.

**దూరాభారమే** ఆత్మకూరు–దోర్నాల మధ్య 60 కి.మీ.దూరాన్ని 2 గంటల్లో చేరుకోవచ్చు. వాహనాలను నంద్యాల వైపు మళ్లిస్తే.. నంద్యాల–గిద్దలూరు మీదుగా దోర్నాలకు 190 కి.మీ. మేర ప్రయాణించాల్సి ఉంటుంది. కర్ణాటక నుంచి కోల్‌కతాకు లారీల్లో సరకును సమయానికి చేర్చితే డ్రైవర్‌కు రూ.5–10 వేలు ఎక్కువ ఇస్తారు. ఆలస్యమైతే డ్రైవర్ బత్తాలో కొంత కోత విధిస్తారు.


**అటవీ మార్గంలో అనుమతుల్లేవ్**



కర్నూలు–గుంటూరు ఎన్‌హెచ్ విస్తరణకు గతంలో సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారు. 2016 నుంచి 2018 వరకు సర్వేలు జరిగాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం దీనిని పట్టించుకోలేదు. ప్రస్తుతం వెంకటాపురం వరకు మాత్రమే విస్తరణ పనులు జరుగుతున్నాయి. అటవీ మార్గంలో 38.8 కి.మీ. మేర విస్తరణకు సంబంధించి అనుమతుల్లేవు. ఇటీవల శ్రీశైలం పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అనుమతులు సాధిస్తామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.
ఆలస్యమైతే బత్తాలో కోత: మహబూబ్‌బాషా, లారీ డ్రైవర్, ఆత్మకూరు
కర్ణాటక నుంచి కోల్‌కతాకు క్యాబేజీ లోడును 48 గంటలు, ఇతర లోడును 50 గంటల్లో చేర్చాల్సి ఉంటుంది. సమయానికి చేర్చితే అదనపు నగదు ఇస్తారు. ఆలస్యమైతే మా బత్తాలో కోత విధిస్తారు.

## గోవులకే జీతం.. జీవితం

నాయుడుపేట: ఆయనో ప్రభుత్వ చిరుద్యోగి. తిరుమల కొండపై ప్రొటోకాల్ వీఆర్వో. నెలకు వేతనం రూ.57 వేలు. ఈ మొత్తం గోశాలకే కేటాయిస్తున్నారు. ఈయన భార్య నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టులో ప్రాసెస్ సర్వరు. ఈమె నెల జీతాన్ని



కుటుంబ పోషణకు ఖర్చు చేస్తున్నారు. వీరి కుమార్తెలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీబీఏ, బీసీఏ తృతీయ ఏడాది చదువుతున్నారు.
నాయుడుపేట మండలం పుదూరుకు చెందిన అల్లాడి శేషగిరి దంపతులు పదేళ్లుగా గోశాల నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యులు ఉదయం, సాయంత్రం గోశాలలోని పనుల అనంతరం వారి పనుల్లో నిమగ్నమవుతారు. గోశాల్లోని లేగ దూడలకు దంపతుల కుమార్తెలు సాయి పావని, చంద్రికా మహారాణిలు నామకరణం చేస్తారు.
దూడలే పాలు తాగేలా..
దూడలకు ప్రత్యేక గదుల్లో పంకాలు ఏర్పాటు చేసి సంరక్షిస్తున్నారు. ఆవుల పాలను దూడలే తాగేలా చూస్తారు. దాతల సాయంతో వసతులు కల్పిస్తున్నారు. కార్తిక మాసంలో వన భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు.
గోశాల పేరు: మాతా అల్లాడి ట్రస్టు
విస్తీర్ణం: 2.5 ఎకరాలకు పైగా.
గోవులు: 85

## రూ. లక్షలు పక్కదారి.. చేతలు నీరుగారి !



ఒంగోలు: గత ప్రభుత్వ హయాంలో సింగరాయకొండ పంచాయతీ సాధారణ నిధులు రూ13,91,071బీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.32,77,732 కలిపి మొత్తం రూ.46,68,803 దుర్వినియోగమయ్యాయి. స్థానికులు ఫిర్యాదుతో డీఎల్‌పీవో విచారణ అనంతరం... బాధ్యులైన గ్రామ కార్యదర్శి, జూనియర్ సహాయకురాలు, కంప్యూటర్ ఆపరేటర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు. అంతకు ముందు ఇదే పంచాయతీలో రూ.30 లక్షలకుపైగా అవకతవకలకు పాల్పడిన కార్యదర్శిని సస్పెన్షన్ చేశారు. తరువాత వీరందరినీ విధుల్లోకి తీసుకున్నా... దారిమళ్లిన నిధులను మాత్రం నేటికీ రికవరీ చేయలేదు.
2021–24 మధ్య జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగమయ్యాయి. స్థానికుల ఫిర్యాదులతో విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు రూ.లక్షల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఎవరికి అందిన మొత్తం వారు జేబులో వేసుకున్నట్లు తేల్చారు. నేటికీ పల్లె ఖాతాల్లోని మొత్తం పక్కదారి పడుతున్న ఘటనలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. జమా ఖర్చులకు సంబంధించిన దస్త్రాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం... ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం.

**కానరాని దస్త్రాల నిర్వహణ...**

జిల్లాలో 729 గ్రామ పంచాయతీలున్నాయి. ఆర్థిక సంఘం, సాధారణ నిధులే వీటికి ప్రధాన ఆదాయ వనరు. వీటిని ప్రాధాన్యతా పనులకు మాత్రమే ఖర్చు చేయాలి. అయినప్పటికీ ఇష్టానుసారం డ్రా చేస్తున్నారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామాల్లో కనీసం 36 దస్త్రాలు నిర్వహించాల్సి ఉన్నా... అయిదు దస్త్రాలైనా నిర్వహిస్తున్న దాఖలాలు లేవు. దీంతో చాలా పంచాయతీల్లో నిబంధనలకు విరుద్ధంగా నిధులు డ్రా చేస్తున్నారు. ఫిర్యాదులొస్తే వెలుగులోకి వస్తున్నాయి. లేదంటే మరుగున పడిపోతున్నాయి. ఆడిట్ అభ్యంతరాలు సైతం పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉండడం సమస్య తీవ్రతకు దర్పణం పడుతోంది. విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా... నిధుల దుర్వినియోగంపై విచారణ జరుగుతోందని, త్వరలోనే బాధ్యులపై చర్యలు ఉంటాయని తెలిపారు.
నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరులో రూ.42.70 లక్షలు దుర్వినియోగమయ్యాయి. రాజంపల్లె (దర్శి)లో రూ.29.47 లక్షలుబీ కురిచేడు మండలం పశ్చిమ వీరాయపాలెంలో రూ.13.09 లక్షలుబీ బయ్యవరంలో రూ.10.75 లక్షలుబీ కొండపి మండలం పెద కండ్లగుంటలో రూ.31.45 లక్షల మేర నిధులు దారిమళ్లాయి. బాధ్యులైన గ్రామ కార్యదర్శులపై నివేదికలు సిద్ధం చేసినా ఇంతవరకు చర్యలు లేవు.
ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, డీఎల్‌పీవోలు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పంచాయతీల దస్త్రాలను తనిఖీ చేయాలి. ఆయా గ్రామాలను సందర్శించేందుకు ఎంపీడీవోలకు కారు అద్దె కింద నెలకు రూ.35 వేలు చొప్పున ఇస్తున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత పేరిట ఇతర కార్యక్రమాలకు వెళ్తున్నా... దస్త్రాల తనిఖీని మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే కొందరు కార్యదర్శులకు అలుసుగా మారుతోంది.

## చిన్నారుల బడి.. నైపుణ్యాల జడి



డోన్ : పిల్లల్లో విద్యా నైపుణ్యాలు, సామాజిక, భావోద్వేగ, అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ 'జాదూయి పిటారా(మాయా పెట్టె)' కిట్ల కార్యక్రమాన్ని ప్రారంభించింది. పిల్లలు సరదాగా అభ్యసించేందుకు, ప్రోత్సహించేందుకు రూపొందించిన ఒక ఆట ఆధారిత అభ్యాస సామగ్రి ఇది. ఈ పెట్టెలో 62 రకాల వస్తువులు ఉంటాయి. ఎన్‌సీఈఆర్టీ, రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అందిస్తోంది.

**విద్యావిధానం అనుసరించి..**

ప్రాథమిక దశలోని పిల్లలకు ఆటల ద్వారా అభ్యసనను అందించడం కార్యక్రమ లక్ష్యం. పజిల్స్, పలు రకాల ఆట వస్తువులు, తోలుబొమ్మలు, పోస్టర్లు, ఫ్లాష్ కార్డులు, కథల పుస్తకాలు, వర్క్ షీట్లు, ప్లేబుక్ తదితరాలు ఉంటాయి. కొత్త జాతీయ విద్యావిధానం ప్రకారం అభ్యాస సామగ్రిని రూపొందించారు.

**ప్రాథమిక పాఠశాలలకు మంజూరు**

కర్నూలు జిల్లాలో వెయ్యికి పైగా ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 928 ప్రాథమిక పాఠశాలలు ఉండగా.. అందులో బాలురు 19,698 మంది, బాలికలు 22,670 మంది కాగా మొత్తం మీద 42,368 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఎక్కువ హాజరున్న ప్రాథమిక పాఠశాలలకు విద్యా సాధనాలను అందించింది. నంద్యాల జిల్లాలో 575 ప్రాథమిక పాఠశాలలకు రూ.54.50 లక్షల విలువ చేసే కిట్లు వచ్చినట్లు విద్యాధికారులు పేర్కొన్నారు. వాటిని 29 మండలాల్లోని ప్రాథమిక పాఠశాలలకు ఇటీవల డీఈవో జనార్దన్‌రెడ్డి అందజేశారు.

**ప్రయోజనం ఇలా..**

ఇది పిల్లల్లో జ్ఞాపకశక్తి, భాషాభివృద్ధి, సంఖ్యా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ఉపకరిస్తుంది. అభ్యాస, బోధనా వాతావరణాన్ని సుసంపన్నం చేసేందుకు, విద్యార్థి కేంద్రీకృత, ఆనందదాయకంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేసింది. పిల్లల ఆసక్తికర అభ్యాసానికి అనుగుణంగా ఉండేలా బొమ్మలు, పజిల్స్ ఉపయోగపడతాయి. కథలు చెప్పడం ద్వారా పిల్లల ఊహాశక్తిని, భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు తోలుబొమ్మలు, కథల పుస్తకాలు దోహదం చేస్తాయి. ఫ్లాష్‌కార్డులు గుర్తింపునకు, నామకరణం వంటి ప్రాథమిక భావనలను నేర్పించడంలో సాయపడతాయి. పోస్టర్లు, వర్క్‌షీట్లు వివిధ అభ్యాస కార్యకలాపాలకు ఉపయోగపడతాయి.

## మత్తు వదిలేదెలా?

విశాఖపట్నం: విద్యార్థులు, యువత, మధ్య వయస్కులనే తేడా లేకుండా చాలా మంది మద్యం, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు బానిసవుతున్నారు. వాటి బారిన పడి జీవితాలు సర్వనాశనం చేసుకుంటున్నారు. దీంతో కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి. అలాంటి వారికి చికిత్స అందించేందుకు కింగ్ జార్జి ఆసుపత్రి (కేజీహెచ్)లో 2020లో వ్యసన విముక్తి కేంద్రం ఏర్పాటుచేశారు. ఓపీతోపాటు ఐపీ సేవలూ అందించాలని నిర్ణయించారు. కానీ, తగినంత సిబ్బంది లేకపోవడం, అక్కడ పనిచేస్తున్న వారికి సమయానికి జీతాలు రాకపోవడంతో సేవలు సక్రమంగా అందడం లేదు.
మత్తుపదార్థాలకు బానిసైన వారికి డి–అడిక్షన్ కేంద్రంలో ఉచితంగా చికిత్స అందిస్తున్నారు. బాధితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. ఆ కేంద్రంలో వైద్యులు, సిబ్బంది బాధితులకు వ్యక్తిగత, ఫ్యామిలీ, బృంద కౌన్సెలింగ్ చేపడుతున్నారు.
శ్రీకాకుళం, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం మన్యం, పాడేరు తదితర ప్రాంతాల నుంచి రోజుకు కనీసం 15 మంది రోగులు ఇక్కడికి వస్తున్నారు. వారిలో 20 నుంచి 40 ఏళ్ల వయసు వారే ఎక్కువ.
ఇక్కడ ఐపీ సదుపాయం లేదు. దీంతో వైద్యుల పర్యవేక్షణ అవసరమైన బాధితులను ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలోని వ్యసన విముక్తి వార్డుకు పంపిస్తున్నారు.




ఇక్కడ ఉచితంగా మెరుగైన చికిత్స అందుతుండటంతో క్రమంగా కేంద్రానికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. సరిపడా సిబ్బంది లేకపోవడంతో అందరికీ సేవలందించలేని పరిస్థితి. దీంతో చాలా మంది ప్రైవేటు కేంద్రాలకు వెళ్తున్నారు. అక్కడ చికిత్సకు రూ.20 వేల నుంచి రూ.లక్షల్లో ఖర్చవుతుంది.

**విజ్ఞప్తి చేస్తే కొంత...**

ఈ కేంద్రంలో ఉద్యోగులు కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్నారు. మొత్తం తొమ్మిది పోస్టులు మంజూరు కాగా.. ప్రస్తుతం ఆరుగురు పనిచేస్తున్నారు. ఒకరు ప్రసూతి సెలవులో ఉన్నారు. అయిదు నెలలుగా అక్కడి ఉద్యోగులకు జీతాలు రావట్లేదు. గతేడాది ఏడాదిన్నర జీతం రాకపోవడంతో ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. దీంతో మొత్తం విడుదల చేశారు. తర్వాత ఈ ఏడాది జూన్ నుంచి మళ్లీ అదే పరిస్థితి. ఇప్పటివరకు జీతాలు రాలేదని, ఉన్నతాధికారులు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

## కాసులు ఇచ్చుకో.. దుకాణం పెట్టుకో!

ఆనందపురం : ఆనందపురం పూల మార్కెట్ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ మార్కెట్‌ను విస్తరించాలని ఎప్పటి నుంచో ప్రతిపాదనలు ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో కొంతమంది చోటా నాయకులు వసూళ్లకు పాల్పడుతున్నారు. అక్కడ దుకాణం పెట్టుకోవడానికి స్థలానికో ధర నిర్ణయించి వారి జేబులు నింపుకొంటున్నారు.
ఉత్తరాంధ్రలోనే అతిపెద్దదిగా ఆనందపురం పూల మార్కెట్ పేరుగాంచింది. ఇక్కడ బాగా గిరాకీ ఉండటంతో లాభాలు వస్తాయని రైతులు, వ్యాపారులు భావిస్తుంటారు. దీంతో జీవనోపాధి కోసం ఎలాగైనా అక్కడ దుకాణం పెట్టుకోవాలని పలువురు ఆసక్తి చూపుతు న్నారు. ఇదే అదనుగా భావించిన స్థానిక నాయకులు వసూళ్ల దందా కొనసాగిస్తున్నారు.
వెంటాడుతున్న ట్రాఫిక్ సమస్య: విచ్చలవిడిగా రోడ్డుపై, కూడలిలో దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంతో ఆనందపురం కూడలి వద్ద విపరీతమైన ట్రాఫిక్ ఏర్పడుతోంది. జాతీయ రహదారి కావడంతో నగరం నుంచి విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశాలకు ఇదే మార్గం గుండా అధిక సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ట్రాఫిక్ నిర్వహణ యంత్రాంగం అభ్యంతరం చెబుతున్నా స్థానిక నాయకులు తీరు మార్చుకోవడం లేదు. తరచూ ట్రాఫిక్ సమస్య తప్పటం లేదు.



రోడ్డుపై, కూడలిలో అక్రమంగా దుకాణాలను ఏర్పాటు చేయకుండా నియంత్రించాల్సిన అవసరాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు. అలాగే మార్కెట్‌ను విస్తరించి సరైన సదుపాయాలు కల్పిస్తే అన్నింటికీ పరిష్కార మార్గం లభిస్తుందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆ దిశగా అడుగులు వేయాలని కోరుతున్నారు.
ఇదీ పరిస్థితి..: కూడలి పరిసర ప్రాంతాల్లో స్థలానికో ధర నిర్ణయించారు. పాత వంతెన కింద ఒక రేటు, కొత్త వంతెన కింద మరో రేటు, పాత పంచాయతీ భవనం వద్ద, ఎన్టీఆర్ విగ్రహం వద్ద మరో ధర ఉంటోంది. బీఎస్ఎన్ఎల్‌కు కేటాయించిన స్థలం ముందు, తగరపువలస సర్వీస్‌రోడ్డులో, బంటుబిల్లి వారి కళ్లాలకు వెళ్లే చోట, వ్యవసాయ మార్కెట్, చేపల మార్కెట్ వద్ద కూడా వేర్వేరు చెల్లింపులు చేయాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వ్యాపారులు రూ.లక్షల్లో చెల్లించుకోవాల్సి వస్తోంది. ఈ మామూళ్లతో పాటు నెలనెలా అద్దెలు చెల్లించుకోవాల్సి ఉండటంతో ఆర్థిక భారం తప్పడం లేదని చిన్నచిన్న వ్యాపారస్థులు వాపోతున్నారు.
కొందరు నేతల అనుమతి ఉంటే కొంత తగ్గిస్తున్నారని, లేకుంటే వారు డిమాండు చేసినంత ఇచ్చుకోవాల్సిందేనని వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు చెబుతున్నారు.

చురకలు



# మఠం ఆస్తుల కబ్జా

గుత్తి: గుత్తి పట్టణంలో రూ.కోట్లు విలువైన మఠం ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయి. ప్రధానంగా గుత్తి నడిబొడ్డున ఉన్న సర్వేనంబరు 377లోని 4.37 ఎకరాల పుష్పగిరి శంకరాచార్యుల మఠం స్థలాన్ని కొందరు కబ్జా చేశారు. సదరు స్థలంలో గుడిసెలు, నివాస గృహాలు వెలిశాయి. ఇక్కడ సెంటు రూ.10 లక్షలు పలుకుతోంది.

**గుడిసెలు వేసి..**సర్వేనంబరు 569లో 8.80 ఎకరాలు కొనకొండ్ల విరక్తి మఠానికి చెందిన భూమిపై కొందరు కన్నువేశారు. నాలుగు నెలల కిందట స్థలాన్ని ఆక్రమించారు. ఓ పార్టీ నాయకుల సహకారంతో స్థానికులు గుడిసెలు వేసుకున్నారు. వారికి పట్టాలు ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేస్తున్నారు. పట్టణంలో సొంత ఇళు ఉన్నవారు, లేని వారు ఆక్రమించారు. పట్టణంలోని రెండు చోట్ల స్థలం అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తున్నా అతీగతీ లేకుండా పోతోంది.



**పట్టాలు జారీ**మఠం స్థలాలకు రెవెన్యూ అధికారులు ఇళ్లపట్టాలు మంజూరు చేస్తున్నారు. దస్త్రాలు పరిశీలించకుండానే ఇచ్చేస్తున్నారు. దీంతో మఠం స్థలాలపై హక్కులు సాధించారు. తర్వాత అనేక మంది ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయించారు. సర్వేనంబరు 327లోని 4.37 ఎకరాల విస్తీర్ణంలోని స్థలం కబ్జాకు గురైంది. ఆలస్యంగా గుర్తించిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు రిజిస్ట్రేషన్లు చేయడం లేదు. రెవెన్యూ అధికారులు మాత్రం ఏడాది కిందట వరకు పట్టాలలో పేర్లమార్పిడి చేశారు. తాజాగా పట్టణ శివారులోని భూమి ఆక్రమణలకు గురైంది.

**సమాచారం ఇచ్చాం..**

–నాగేంద్రుడు, ఈవో, గ్రూప్ టెంపుల్స్, గుత్తి

మఠం ఆస్తుల అన్యాక్రాంతంపై తాము నిర్వాహకులకు సమాచారం ఇచ్చాం. పోలీసుల సాయంతో మఠం ఆస్తులను స్వాధీనం చేసుకోవచ్చు. శంకరాచార్యుల మఠం ఆస్తుల అన్యాక్రాంతంపై పోలీసులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కడపలోని మఠం అధికారులకు ఫిర్యాదు చేశాం.

# కళ్లు మూసుకుంటాం.. తవ్వుకోండి!

రాయదుర్గం : పట్టణ శివారులోని బొందనకల్లు అటవీ ప్రాంతంలో అడ్డగోలుగా మట్టిని తవ్వి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణానికి ఆనుకుని కుంటి మారెమ్మ ఆలయం ఎదురుగా.. రైల్వే ట్రాక్ పక్కన రెండువైపులా పది అడుగుల మేర మట్టిని తవ్వి తరలించారు. తవ్విన ఆనవాళ్లు లేకుండా ముళ్లకంపలు అడ్డు వేశారు. మరొక ప్రాంతంలో పది అడుగుల మేర తవ్వకాలు చేశారు. టిప్పర్ మట్టి తరలించాలన్నా అనుమతి తీసుకుని.. రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**ఎత్తుగా ఉండటంతో..**రైల్వే ట్రాక్ సుమారు ఇరవై అడుగుల మేర ఎత్తు ఉండటంతో అక్రమార్కులకు కలిసివస్తోంది. అటవీ ప్రాంతంలో మొక్కలు నాటిన చోట పొక్లెయిన్‌తో మట్టిని తవ్వి తరలించినట్లు ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

పట్టణ శివారులో రైల్వే ట్రాక్ బలోపేతానికి పనులు జరుగుతున్నాయి. గుత్తేదారు అనుమతులు తీసుకుని మట్టిని తరలించాల్సి ఉన్నా నిబంధనలు పట్టించుకోకుండా రాత్రి వేళ తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు.

**కేసులు నమోదు చేస్తాం** –దామోదర్‌రెడ్డి, డీఆర్‌వో, రాయదుర్గం

క్షేత్రస్థాయిలో పరిశీలించి మట్టిని తరలించిన వారిపై కేసులు నమోదు చేస్తాం. అవసరమైతే ఉన్నతాధికారుల అనుమతితో ఆ ప్రాంతానికి కంచె ఏర్పాటు చేసి తవ్వకాలు జరపకుండా చర్యలు తీసుకుంటాం.

# దారి మళ్లిన రూ.6 లక్షలు

శింగనమల : శింగనమల మండలంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో అవినీతి తాజాగా వెలుగులోకి వచ్చింది. రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో మహిళా రైతులకు వచ్చే ఎఫ్ఈవో నిధులను దారి మళ్లించి వెలుగు ఉద్యోగి బ్యాంకు ఖాతాకు బదిలీ చేశారు. ఆమె మరణించడంతో డబ్బు ఉపసంహరణకు ముప్పుతిప్పలు పడుతుండటంతో విషయం వెలుగులోకి వచ్చింది.

**అసలు ఏం జరిగిందంటే?**

శింగనమల మండలంలో డ్వాక్రా సంఘాలకు అనుబంధంగా రైతుఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేశారు. రైతులకు పంటల సాగుకు రుణాలు అందించి, వ్యవసాయ అభ్యున్నతికి సహాయ పడటం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. రైతులకు ఎఫ్ఈవో నిధులను రుణాలుగా ఇచ్చి నెల వాయిదాల్లో తక్కువ వడ్డీ వసూలు చేస్తారు. అయితే వెలుగు కార్యాలయంలో పని చేసే మహిళా ఉద్యోగి బ్యాంకు ఖాతాలోకి కొద్ది నెలల క్రితం ఎఫ్ఈవో నిధులను మూడు సార్లు రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.6 లక్షలు బదిలీ చేశారు. సాధారణంగా సంఘాలకు రుణాలు ఇవ్వాలంటే గ్రామ సంఘాల లీడర్లు, యానిమేటర్, సీసీ, ఏపీఎం సంతకాలను మినిట్స్ బుక్‌లో నమోదు చేసిన తర్వాతే రుణాలను బదిలీ చేస్తారు. అయితే రూ.6 లక్షల బదిలీ విషయంలో ఈ నిబంధన లేవీ పాటించలేదని తెలుస్తోంది.



**ఖాళీ చెక్కులపై సంతకాలు**

రైతు ఉత్పత్తిదారుల సంఘాల లీడర్లతో ఖాళీ చెక్కులపై సంతకాలు తీసుకుని నేరుగా నాలుగు నెలల కిందట మూడు దఫాలుగా వెలుగు ఉద్యోగి ఖాతాలకు బదిలీ చేశారు. ఈ నిధుల బదిలీ విషయంలో శింగనమల వెలుగు అధికారులు, కెనరాబ్యాంకు అధికారుల పాత్ర ఉందని స్పష్టమవుతోంది. నగదు బదిలీ చేసిన తర్వాత ఇటీవల వెలుగు ఉద్యోగి అనారోగ్యంతో మరణించడంతో బదిలీ చేసిన డబ్బులు పంచుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో అవినీతి విషయం వెలుగులోకి వచ్చింది.

**ఏపీఎం ఏమన్నారంటే?**

ఏపీఎం ఈశ్వరయ్య శింగనమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన స్పందిస్తూ రూ.6 లక్షలు మరణించిన ఉద్యోగి ఖాతాలో జమా అయిన విషయం వాస్తవమేనని అంగీకరించారు. నా సంతకాలు లేకుండానే రూ.6 లక్షలు బదిలీ అయ్యాయని, ఇప్పటికీ మరణించిన ఉద్యోగి ఖాతాలోనే డబ్బులు ఉన్నాయని గుర్తించామన్నారు.

# పేరుకు పూర్తి.. తీరని దాహార్తి



కందుకూరు : వలేటివారిపాలెంలో జల్‌జీవన్ మిషన్(జేజేఎం) నిధులు సుమారు రూ. 60 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకు, పైప్‌లైన్ల నిర్మాణానికి టెండరు పిలిచారు. దాన్ని దక్కించుకున్న గుత్తేదారు.. ట్యాంకు నిర్మాణం పూర్తి చేశారు. నాటి వైకాపా ప్రభుత్వం దాదాపు రెండేళ్లపాటు బిల్లులు చెల్లించకపోవడంతో పనులను అర్ధాంతరంగా ఆపేశారు. దాంతో ఎప్పటిలాగే ఆర్.ఆర్. పథకం ద్వారా వచ్చే నీరే దిక్కయింది. ఇటీవల ఈ పథకం మరమ్మతుల నేపథ్యంలో 20 రోజులు నీటిసరఫరా జరగలేదు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


కందుకూరు నియోజకవర్గంలో 2024 ఏప్రిల్ నాటికి 43 పనులు నిధుల సమస్యతో ప్రారంభమే కాలేదు. 'కూటమి' అధికారంలోకి వచ్చాక.. అందులో 20 పనులు అవసరమని ప్రభుత్వం నుంచి అనుమతులు పొందారు. వాటిలో ఆరు పనులకు టెండర్లు పిలవగా.. ఇటీవల ఒక్కటి ప్రారంభమైంది. జేజేఎం పనుల తీరుకు ఇవి అద్దం పడుతున్నాయి. ఇంటింటికి మంచినీరు అందించాలన్న లక్ష్యంతో కేంద్రం తీసుకొచ్చిన జల్‌జీవన్ మిషన్ పథకానికి గత వైకాపా ప్రభుత్వం తూట్లు పొడిచింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ పథకానికి శ్రీకారం చుట్టగా– నాటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు. ఫలితంగా పలు గ్రామాల్లో అర్ధాంతరంగా నిలిచిపోగా.. పూర్తయినట్లు చెబుతున్న చోట్లా చుక్కనీరు రాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

**1226 పూర్తి..**

జేజేఎం కింద జిల్లాలోని 37 మండలాల్లో 3060 పనులు మంజూరు కాగా– వీటన్నింటిని 2024 మార్చినాటికి పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్‌కు అప్పగించారు. మొదట్లో వేగంగానే జరిగినా.. బిల్లుల చెల్లింపు జరగకపోవడంతో గుత్తేదారులు అర్ధాంతరంగా ఆపేశారు. రాష్ట్ర వాటా నిధులు చెల్లించకపోవడంతో.. బిల్లుల సమస్య ఏర్పడింది. అనేకచోట్ల కనీసం పనులను ప్రారంభించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రారంభంకాని 1335 పనులను రద్దు చేసింది. వివిధ దశల్లో ఉన్న 1725ను 2026 మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యం విధించారు. వీటిలో ఇప్పటికే 1226 పూర్తయ్యాయని, 282 వివిధ దశల్లో ఉన్నాయని, 217 ప్రారంభం కానివని గుర్తించారు. కాగా పూర్తయినట్లు చూపుతున్న వాటిలో 50 శాతం కూడా వినియోగంలో లేవు. ట్యాంకులు నిర్మించినా పైప్‌లైన్లు, కుళాయి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో ప్రజలకు చుక్కనీరు అందడం లేదు. మరోవైపు వాటర్‌గ్రిడ్ పనులపై ఆశలు పెట్టుకున్నారు. సోమశిల, కండలేరు నుంచి నీటిని సరఫరా చేయాలని నిర్ణయించినా.. ఇందుకు సంబంధించి ఇంకా తుది డ్రాఫ్ట్ ఖరారు కాలేదని సమాచారం.

**చెల్లింపులు జరుగుతున్నాయి**ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ. 20 కోట్ల బిల్లులు చెల్లించారు. మరో రూ. 34 కోట్లు చెల్లించేందుకు సిద్ధం చేశారు. 2026 మార్చి నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యం. టెండర్ పూర్తయినవి త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. జి.రెడ్డయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ

# భద్రతకు భరోసా ఏదీ?



అనంతపురం: రోడ్డుపైకి వస్తే సురక్షితంగా ఇంటికి చేరతామా.. అనే సంశయం తలెత్తుతోంది. ఏ వైపు నుంచి ప్రమాదం ముంచుకొస్తుందో అంచనా వేయలేని పరిస్థితి. ఎక్కడ ఏ గుంత నోరు తెరుచుకుని.. వాహనదారులను మింగేస్తుందో తెలియడం లేదు. రెప్పపాటులో సంభవిస్తున్న ప్రమాదాలు ఎన్నో కుటుంబాలను వీధిన పడేస్తున్నాయి. ఏటా వందల సంఖ్యలో దుర్ఘటనలు జరుగుతున్నా భద్రతపై అధికారులు దృష్టి పెట్టడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే పోలీసు, రవాణా శాఖ అధికారులు హడావుడి చేస్తున్నారు. తర్వాత షరా మాములే. ఉమ్మడి అనంత జిల్లాలో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

**యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన**

జాతీయ రహదారిలోని కీలక కూడళ్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణను గాలికొదిలేశారు. చాలాచోట్ల సర్వీస్ రోడ్లు లేకపోవడం వల్ల స్థానికులు వ్యతిరేక దిశలో ప్రయాణం సాగిస్తున్నారు.

కూడళ్ల నుంచి గ్రామాలకు వెళ్లే ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. చాలా సందర్భాల్లో డ్రైవర్‌కు రెండువైపులా కూర్చోబెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో వాహనాన్ని నియంత్రించలేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

**పనిచేయని స్పీడ్‌గన్లు**

ఉమ్మడి జిల్లా పరిధిలో 600 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు విస్తరించి ఉన్నాయి. వేగ నియంత్రణకు స్పీడ్‌గన్లు ఉపయోగించడం లేదు. ఉన్న రెండూ పని చేయకపోవడంతో మూలనపడేశారు. కొత్తవాటి కోసం ప్రతిపాదనలు పంపినా మోక్షం లభించలేదు.

**ప్రతిపాదనలు పట్టాలెక్కేనా..**

ప్రమాదాలు ఎక్కడ జరిగినా ఆర్‌అండ్‌బీ లేదా ఎన్‌హెచ్‌ఏఐ ఇంజినీర్లు, రోడ్డు రవాణాశాఖ ఎంవీఐ, పోలీసు అధికారి కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. నిర్మాణ లోపమా? వాహన కండిషన్‌లో లేదా? మానవ తప్పిదమా? నిర్లక్ష్యమా? తదితర అంశాలను నివేదికలో పొందుపరచాలి. వీటిపై ప్రతినెలా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో సమీక్షించాలి. రహదారి డిజైన్‌లో లోపం ఉంటే మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు సమావేశాలు జరుగుతున్నా అందులో ప్రతిపాదించే అంశాలు చాలావరకు అమల్లోకి రావడం లేదు.

**బ్లాక్‌స్పాట్‌లు ఎక్కడంటే..**

1 ఎన్‌హెచ్ 44 (హైదరాబాద్–బెంగళూరు): గుత్తి చౌరస్తా, పామిడి, కల్లూరు, గార్లదిన్నె, తపోవనం, రాప్తాడు, రామినేపల్లి, సీకే పల్లి, పెనుకొండ, సోమందేపల్లి, పాలసముద్రం, కొడికొండ చెక్‌పోస్ట్.

2 ఎన్‌హెచ్ 42 (బళ్లారి–కదిరి): పాల్తూరు, ఉరవకొండ, చిన్నముష్టూరు, పంగల్‌రోడ్డు, ముదిగుబ్బ, పట్నం

3 ఎన్‌హెచ్ 67 (బళ్లారి–తాడిపత్రి): కొత్తపేట, టి.కొత్తపల్లి క్రాస్, వంగనూరు, అర్జాస్ స్టీల్‌ప్లాంట్, చుక్కలూరు, రాయలచెరువు

4 ఎన్‌హెచ్ 544డి (అనంతపురం–తాడిపత్రి): ఎర్రగుంటపల్లి, వెంకటరెడ్డిపల్లి

**తగిన చర్యలు తీసుకుంటున్నాం**

– జగదీశ్, ఎస్పీ, అనంతపురం

రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ప్రతిపాదనలను వీలైనంత వరకు అమలు చేస్తున్నాం. ప్రమాదాల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవలే బ్లాక్‌స్పాట్‌ల వద్ద సీసీ కెమెరాలు, లైటింగ్, సూచికబోర్డులు ఏర్పాటు చేశాం.

# భగ్గుమంటున్న కూరగాయల ధరలు



ధర్మవరం: మార్కెట్లో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. ఏదీ కొనాలన్నా కిలో రూ.100 పలుకుతున్నాయి. గతంలో ఎన్నడూలేని విధంగా ధరలు పెరగడంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. కేవలం పది రోజుల వ్యవధిలోనే ధరలు పెరగడం గమనార్హం. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో నీరు చేరి కూరగాయలు, ఆకుకూరల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నీరు తగ్గకపోవడంతో పంటలకు తెగుళ్లు సోకి పాడయ్యాయి. దీంతో మార్కెట్‌కు ఆశించిన మేర దిగుబడి రావడం లేదు. కూరగాయలు స్థానికంగా దొరక్కపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, దాంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

**సంచి నిండటం లేదు**– నారాయణమ్మ, పుట్టపర్తి

మార్కెట్‌కు రూ.500 తీసుకెళ్తే చిన్న సంచికి కూడా కూరగాయలు రావడం లేదు. వంటలు రుచిగా వండాలంటే పోషకాలతో కూడిన మంచి కూరలు ఉండాల్సిందే. ప్రతి రోజు తాజా కూరగాయలు అవసరం. అందుకే ధర పెరిగినా తప్పని పరిస్థితుల్లో కొంటున్నాం. ఇలాగైతే సామాన్యులు బతకలేని పరిస్థితి.

# అక్రమాల.. పని'పట్టా'లని

శ్రీకాళహస్తి: అక్రమాలకు అడ్డాగా.. అక్రమార్కులకు సిరులు పండించే రాజీవ్‌నగర్‌లో మళ్లీ సర్వేకు రెవెన్యూ శాఖ శ్రీకారం చుట్టింది. 2007లో ఇళ్లులేని పేదలకు పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు రాజీవ్‌నగర్‌లో పట్టాలిచ్చారు. విడతల వారీగా 6,500 ఇళ్లు మంజూరు చేశారు. ఇళ్లు నిర్మించుకోలేని పేదల స్థలాలను కబ్జాచేసి అమ్ముకుంటున్నారు అక్రమార్కులు.

**ఖాళీ జాగాలతో కాసులే**

రాజీవ్‌నగర్‌లో సమస్యంతా ఖాళీ జాగాల విషయంలోనే. వైకాపా హయాంలో ఇక్కడి స్థలాలను అడ్డగోలుగా అమ్ముకున్నారనే విమర్శలున్నాయి. పిచ్చాటూరు–శ్రీకాళహస్తి రహదారి స్థలాన్ని అమ్ముకున్నారు. ఓ ప్రభుత్వ ఉద్యోగి వెయ్యికి పైగా పట్టాలు కలిగి ఉండటంపై కేసులు నమోదయ్యాయి.



**కూటమి ప్రభుత్వం వచ్చాక..**

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాజీవ్‌నగర్‌లో సర్వే చేపట్టారు. అప్పట్లో సమగ్రంగా నిర్వహించలేదన్న విషయమై మలి విడత సర్వేకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారు. ఆ ప్రకారం అక్కడున్న వంద ఎకరాల్లోని 6,500 ఇళ్లను 12 బ్లాక్‌లుగా విభజించారు. వీటిని సర్వే చేసేందుకు ఏడు బృందాలు ఏర్పాటు చేశారు. ఖాళీ స్థలాల్లో పట్టాలు పరిశీలించడం, అర్హులైన లబ్ధిదారులను తేల్చేలా సర్వే ప్రారంభమైంది.

**అపోహలు వద్దు**

సర్వే నేపథ్యంలో ఇళ్లు కూల్చేస్తారన్న అపోహలు వద్దు. ఇళ్లు నిర్మించుకున్న వాళ్ల పట్టాల పరిశీలనతో పాటు ప్రధానంగా ఖాళీగా ఉన్న స్థలాలకు సంబంధించి పట్టాలు తనిఖీ చేస్తాం. అర్హులైతే వాళ్ల పట్టాను అనుమతిస్తూ ధ్రువీకరణ పత్రం ఇస్తాం. ఆధారాలు లేని వాటిని స్వాధీనం చేసుకుని నిజమైన లబ్ధిదారులకు అందజేస్తాం.

భానుప్రకాష్‌రెడ్డి, ఆర్డీవో

పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలు: 6,500
నిర్మాణాలు జరిగినవి: 4,700
ఖాళీగా ఉన్నవి: 1,800
విభజించిన బ్లాక్‌లు: 12
సర్వే బృందాలు: 7

# సెస్సు ఏ'మిర్చి'.. వ్యాపారుల మాయాజాలం

నంద్యాల : జిల్లాలో శీతల గోదాములు కేంద్రంగా మిర్చి కొనుగోళ్ల మాయాజాలం జరుగుతోంది. నిబంధనల ప్రకారం మార్కెట్‌యార్డులో క్రయవిక్రయాలు జరగాల్సి ఉన్నా.. గోదాముల వద్దే దందా సాగుతోంది. మరోవైపు అక్రమార్కులు సరకును రైతు పేరుతో తరలించేస్తూ పెద్దఎత్తున సెస్సు ఎగ్గొడుతున్నారు. జిల్లాలో 11 శీతల గోదాములుండగా.. సగటున ఒక్కో గోదాములో రూ.60 కోట్ల విలువ చేసే మిరప దిగుబడులు ఉన్నాయి. ఈ లెక్కన రూ.660 కోట్ల మిర్చి దిగుబడులు ఉండగా వీటి విక్రయాల ద్వారా ప్రభుత్వానికి సెస్సు రూపంలో ఏడాదికి రూ.6 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశముంది. దళారులు గోదాముల వద్దే సరకు కొనుగోలు చేస్తుండటంతో ప్రభుత్వానికి భారీ నష్టం జరుగుతోంది.

**ట్రేడ్ లైసెన్సులు లేకుండానే 'బేరాలు'**

నిబంధనల ప్రకారం రైతులు మిర్చిని యార్డుకు తీసుకొచ్చి ప్రభుత్వ లైసెన్సు పొందిన కమీషన్ ఏజెంట్ల ద్వారా విక్రయించాలి.

నంద్యాల మార్కెట్ యార్డులో మాత్రమే మిర్చి యార్డు ఉంది. ప్రత్యేకంగా రెండేళ్ల కిందట మిర్చి రైతుల కోసమే ఈ యార్డును ఏర్పాటుచేసి 20 మంది ఏజెంట్లకు లైసెన్సులు ఇచ్చారు.

రైతు నుంచి కొనుగోలు చేసే మొత్తానికి ఏజెంట్లు రసీదులు ఇస్తారు. ఇదే సమయంలో క్రయవిక్రయాలతో యార్డుకు ఒక శాతం సెస్సు రూపంలో జమవుతుంది. సంబంధిత ఏజెంటు కొనుగోలు చేసిన



మొత్తానికి చెల్లించిన సెస్సు వివరాలు ఉండడంతో రైతుకు చెల్లించాల్సిన డబ్బుకు ఒక రకంగా గ్యారెంటీ ఉంటుంది. ఇవన్నీ ప్రైవేటు గోదాముల వద్ద ఉండవు.

**ధర తగ్గిందని దాచుకొంటే**

నంద్యాల, కోవెలకుంట్ల, గడివేముల, పాణ్యం, మిడుతూరు, నందికొట్కూరు, వెలుగోడు, మహానంది, చాగలమర్రి, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో రైతులు విస్తారంగా మిర్చి సాగు చేస్తున్నారు. గత రెండేళ్లుగా ఈ పంటకు తగిన గిట్టుబాటు ధర లభించడం లేదు. గతంలో కిలో రూ.280 వరకు ధర పలకగా.. ప్రస్తుతం రూ.125 నుంచి రూ.140కు పడిపోయింది. పలువురు రైతులు సరకును రెండేళ్లపాటు గోదాముల్లో నిల్వ ఉంచినప్పటికీ ఆశించిన ధర లభించడం లేదు. దీనికితోడు మిర్చిపై నల్లటి పొర వస్తుండటంతో దాచిన సరకును రైతులు విక్రయించేస్తున్నారు. ఇదే అదనుగా మధ్య దళారులు రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని గోదాముల వద్దే మిర్చి కొనుగోలు చేస్తున్నారు.

**అక్రమాలకు దారి**

గోదాముల వద్ద మిర్చి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు కాటాల్లోనూ మోసాలకు పాల్పడుతున్నారన్న అనుమానాలున్నాయి. మరోవైపు రైతుల నుంచి మిర్చి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు వారి పేరుతోనే గుంటూరు యార్డుకు తరలిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వానికి ఒక్క పైసా ఆదాయం రావడం లేదు.

" రెండేళ్ల కిందట శీతల గోదాములో 66 బస్తాల మిర్చి నిల్వ చేశా. అప్పుడు కిలో రూ.180 మాత్రమే పలుకుతుండటంతో ధర లేదన్న ఉద్దేశంతో నిల్వ చేశా. ప్రస్తుతం రూ.125కే అమ్ముతున్నా. గోదాముల్లో రెండేళ్ల కంటే ఎక్కువగా నిల్వ చేయలేం. ఇప్పటికే మిరపపై కొంతమేర నల్లటి రంగు కనిపిస్తోంది. యార్డుకు తీసుకెళ్లలేక గోదాము వద్దనే అమ్ముకుంటున్నట్లు" పాణ్యానికి చెందిన ఎల్లప్ప వాపోయారు.

శీతల గోదాములు : 11
ఒక్కోదాని సామర్థ్యం : 1.20 లక్షల సంచులు

చురకలు



## చీరలో శ్రీలీల గుబులు పుట్టించే ట్రీట్

తనదైన ప్రతిభతో ప్రజల హృదయాలలో ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్న శ్రీలీల పోటీలో ఎందరు ఉన్నా తన రేంజ్ వేరే లెవల్ అని ప్రతిసారీ నిరూపిస్తోంది. ఈ బ్యూటీ టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకూ కెరీర్ పరంగా దూసుకెళుతోంది. అన్ని పరిశ్రమల్లోని టాప్ హీరోల సరసన అవకాశాలు అందుకుంటోంది. ఓవైపు కెరీర్ పరంగా ఎంత బిజీగా ఉన్నా శ్రీలీల వరుస ఫోటోషూట్లతో అన్ లిమిటెడ్ ట్రీట్ ఇస్తోంది. 24 ఏళ్ల ఈ బ్యూటీ ఇప్పుడు చీరలో తన అందచందాలను ఎలివేట్ చేసిన తీరుకు కుర్రకారు సాహో అనేస్తున్నారు. ప్రస్తుతం ఈ యూనిక్ ఫోటోషూట్ ఇంటర్నెట్‌లో గుబులు పెంచుతోంది. డార్క్ గ్రీన్ కలర్ శారీలో బీచ్ పరిసరాలలో ప్రత్యేకంగా ఈ ఫోటోషూట్ ని ప్లాన్ చేయడం ఆసక్తిని కలిగిస్తోంది. సముద్రపు అంచున నల్లని మట్టి దిబ్బలపై సాహసోపేతంగా శ్రీలీల ఈ ఫోటోషూట్ లో పాల్గొంది. ఈ యూనిక్ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. ప్రస్తుతం బాలీవుడ్ లో ఆరంగేట్రమే కార్తీక్



ఆర్యన్ సరసన శ్రీలీల అవకాశం అందుకుంది. అనురాగ్ బసు దర్శకత్వం వహిస్తున్న రొమాంటిక్ మ్యూజికల్ డ్రామాకు తు మేరీ జిందగీ హై అనే అధికారిక టైటిల్‌ను ఫిక్స్ చేసారు. ఆషిఖి తరహాలో అద్భుతమైన మ్యూజికల్ డ్రామా నేపథ్యంలో ప్రేమకథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తుండడం ఆసక్తికరం. మే 2026లో ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. 2025 చివరి నాటికి టాకీ పూర్తవుతుంది.

పోస్ట్-ప్రొడక్షన్ పాటల చిత్రీకరణ 2026 ప్రారంభంలో జరుగుతుంది. మే 2026 లో సినిమాని విడుదల చేస్తారు. మరోవైపు శ్రీలీల టాలీవుడ్ లోను పలు క్రేజీ ప్రాజెక్టులకు కమిట్ అయింది. మాస్ జాతర ఇప్పటికే చిత్రీకరణ పూర్తయింది. పరాశక్తి, ఉస్తాద్ భగత్ సింగ్ లాంటి భారీ చిత్రాలలోను ఈ బ్యూటీ నటించనుంది. కెరీర్ లో మొదటిసారి పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సరసన ఉస్తాద్ భగత్‌సింగ్‌లో నటించే అవకాశం దక్కించుకుంది. ఈ క్రేజీ సినిమాలో తన పాత్ర చిత్రణ కోసం శ్రీలీల ఎంతో ఎగ్జయిటింగ్ గా వేచి చూస్తోంది. హరీష్ శంకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో పవన్ పవర్ ఫుల్ పోలీసాఫీసర్ గా నటించనున్నారు.

### ఆ రిమార్క్ తో అవకాశాలు కష్టమేనా?

ఈ మధ్య కాలంలో శ్రీలీల ఫేమస్ అయినంతగా మరో తెలుగు నటి వెలుగులోకి రాలేదు. అంజలి తర్వాత ఆమెను మించిన ఫాలోయింగ్ దక్కించుకున్న నటిగా పేరులోకి వచ్చింది. మహేష్, రవితేజ , బాలయ్య, నితిన్ లాంటి స్టార్ హీరోల సినిమాల్లో భాగమవ్వడంతో అమ్మడి కెరీర్ కి తిరుగుండదనుకున్నారు. వాటితో పాటు ఐటం భామగాను సంచలనమవ్వడంతో? కొన్నాళ్ల పాటు వెనక్కి తిరిగి చూడకుండా కెరీర్ సాగుతుందనుకున్నారంతా.

ఆ రకంగా అవకాశాలు కూడా అందుకుంది. కానీ తిరస్కరణలో అమ్మడిని ఇరకాటంలో పడేసినట్లు కనిపిస్తోంది.

**సెకెండ్ ఛాన్స్ అంత సులభం కాదు:** అఖిల్ ఈరోగా నటిస్తోన్న లెనిన్ చిత్రంలో వచ్చిన అవకాశం వదులకున్న సంగతి తెలిసిందే. హిందీ సినిమాతో డేట్లు క్లాష్ అవ్వడంతో తెలుగు సినిమా ఛాన్స్ వదులుకుంది. అలాగే మరో స్టార్ హీరోకి జోడీగా కూడా ఛాన్స్ వచ్చింది. ఆ అవకాశాన్ని కూడా అమ్మడు చేతులారా వదులకుంది. మరి ఈ రకమైన పరిస్థితులతో టాలీవుడ్ లో ఛాన్సులు కష్టమేనా అంటే? సన్నివేశం అలాగే కనిపిస్తోంది. వచ్చిన అవకాశాలు వద్దనుకుని



వెళ్లిన నటీమణులకు టాలీవుడ్ సెకెండ్ ఛాన్స్ ఇవ్వదు. పూజాహెగ్డే, రకుల్ ప్రీత్ సింగ్ టాలీవుడ్ కి అలాగే దూరమయ్యారు.

**శ్రీలీలకు ఆ పరిస్థితి తప్పదా?...** కెరీర్ పీక్స్ లో ఉండగానే ఇద్దరు తెలుగు బాలీవుడ్ కి వెళ్లారు. అటుపై మళ్లీ తెలుగులో నటించాలని ఉందని ప్రయత్నాలు చేస్తున్నా? ఎవరూ ఛాన్స్ లివ్వడం లేదు. శ్రీలీలకు కూడా ఆ పరిస్థితి తప్పదనే విమర్శ వ్యకమవుతుంది. ప్రస్తుతం శ్రీలీల చేతిలో ఉన్న ఒకే ఒక్క చిత్రం ఉస్తాబ్ భగత్ సింగ్. పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రమిది. శ్రీలీల నటిగా బిజీగా ఉన్న సమయంలో కమిట్ అయిన ప్రాజెక్ట్ ఇది. కానీ ఇకపై కొత్త వకాశాలు అంత సులభం కాదు. గత రిజెక్షన్లను దృష్టిలో పెట్టుకుని ఇకపై మేకర్స్ అప్రోచ్ అవకాశం ఉంటుంది.

**రిజెక్షన్లు ఓ రిమార్క్ లా:** ఎంతటి ప్రతిభావంతురాలికైనా? రిజెక్షన్లు అన్నవి ఓ రిమార్క్ లా పడతాయి. సాయి పల్లవి విషయంలో కూడా ఇదే సందేహం వ్యక్తమవుతోందిప్పుడు. బాలీవుడ్ లో రామాయణం కమిట్ అయిన తర్వాత వచ్చిన కొన్ని ఆఫర్లను వదిలేసింది. అలాగే ఆమెని కథ తో మెప్పించడం కూడా ఏ దర్శకుడికైనా కత్తిమీద సాము లాంటిందే అన్న వాదన ఉంది. వెరసీ ఇవన్నీ సాయి పల్లవిని టాలీవుడ్ కి దూరం చేసేలా కనిపిస్తున్నవే. ఇలా మరి ఏడాది పాటు తెలుగు సినిమాలు చేయకుండా ఉంటే స్వీటీలా చప్పుడు లేకుండా ఉండాల్సిందే.




## డిసెంబర్‌లో రికార్డ్ బ్రేకింగ్ ట్రీట్‌కి సిద్ధమవుతోంది



నవంబర్ వెళుతోంది.. డిసెంబర్ లో అడుగుపెడుతున్నాం. ఈ క్షణం నుంచి డిసెంబర్ 31 రాత్రి సెలబ్రేషన్స్ గురించి యూత్ ఎక్కువగా ఆలోచిస్తోంది. చాలా మంది సెలబ్రిటీలు క్రిస్మస్ తో పాటు, కొత్త సంవత్సరం వేడుకలను జరుపుకునేందుకు దేశ విదేశాల్లోని ఎగ్జోటిక్ లొకేషన్లకు బయల్దేరుతున్నారు. ఇలాంటి సమయంలో భారతదేశంలో రికార్డులు బ్రేక్ చేసేందుకు వస్తోంది ఒక హాలీవుడ్ సినిమా. అది కచ్చితంగా జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన అవతార్ 3. అవతార్: ఫైర్ అండ్ యాష్ డిసెంబర్ 19న విడుదల కానుంది. అవతార్ ఫ్రాంచైజీలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ఈ చిత్రం మునుపటి భాగాల కంటే భారీ యాక్షన్ తో రక్తి కట్టిస్తుందని కామెరూన్ ఇప్పటికే ప్రకటించాడు. ఇది ప్రపంచవ్యాప్తంగా సరికొత్త రికార్డులను తిరగరాస్తుందని కూడా అంచనా వేస్తున్నారు. అయితే అవతార్ 3 ముందస్తు బుకింగుల పరిస్థితి భారతదేశంలో ఎలా ఉంది? ఇక్కడ బాక్సాఫీస్ వద్ద వసూళ్లు అసాధారణంగా ఉండటానికి ఛాన్స్ ఉందా? అనేది ట్రేడ్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అవతార్ ఫ్రాంచైజీలో అవతార్ 1, అవతార్ 2 భారతదేశంలో అద్భుత వసూళ్లను సాధించాయి. 2022లో అవతార్: ది వే ఆఫ్ వాటర్ - మొదటి రోజు దాదాపు రూ. 39.90 కోట్లు వసూలు చేసింది. ఇది అవెంజర్స్: ఎండ్‌గేమ్ తర్వాత భారతదేశంలో రెండవ అత్యధిక ఓపెనింగ్ వసూళు సాధించిన హాలీవుడ్ చిత్రంగా రికార్డులకెక్కింది.

తదుపరి పార్ట్ 3ని మొదటి రెండు భాగాల కంటే అత్యంత భారీగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. అయితే బుకింగులు కొంత నెమ్మదిగా ఉన్నాయి. దీనివల్ల ఓపెనింగ్ డే భారతదేశంలో 35 కోట్లు మించకపోవచ్చని భావిస్తున్నారు. అయితే రెండో భాగం కోసం దాదాపు 13 ఏళ్లు వేచి చూసిన ఆడియెన్ సినిమా థియేటర్లలోకి రాగానే ఉత్కంఠగా టికెట్లు బుక్ చేసారు. దీని కారణంగా ఓపెనింగ్ డే 39కోట్లు వసూలైంది. అయితే ఆరంభ వసూళ్లతో సంబంధం లేకుండా అవతార్ 3 భారతదేశంలో 500కోట్లు గ్యారెంటీగా వసూలు చేస్తుందని అంచనా వేస్తున్నారు. బుక్ మై షోలో 12లక్షలు పైగా ప్రజలు ఈ సినిమా చూడటానికి ఆసక్తిగా ఉన్నామని వెల్లడించారు. అందువల్ల ఓపెనింగ్ ల సంగతి ఎలా ఉన్నా కానీ, అవతార్ 3 గ్రాండ్ సక్సెసవుతుందని అంచనా వేస్తున్నారు.

## ప్రభాస్ 'రాజా సాబ్'.. ఒక్క తెలుగులోనే అన్ని కోట్లా?




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ లీడ్ రోల్ లో దర్శకుడు మారుతి ది రాజా సాబ్ మూవీ తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. హారర్ కామెడీ ఎంటర్టైనర్ గా రూపొందుతున్న ఆ సినిమా.. మరికొన్ని రోజుల్లో థియేటర్స్ లో రిలీజ్ కానుంది. పాన్ ఇండియా స్థాయిలో వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా గ్రాండ్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఇప్పటికే మూవీపై ఆడియన్స్ లో మంచి అంచనాలు ఉండగా.. మేకర్స్ వాటిని భారీగా పెంచుతున్నారు. వరుస అప్డేట్స్ తో ఫుల్ హైప్ ను క్రియేట్ చేస్తున్నారు. అదే సమయంలో ఇప్పుడు ప్రీ రిలీజ్ బిజినెస్ ను పూర్తి చేస్తున్నట్లు తెలుస్తోంది. థియేట్రికల్, నాన్ థియేట్రికల్ రైట్స్ కు డిమాండ్ ఉందని, అనేక మంది ఎగబడుతున్నారని సమాచారం. తెలుగు, తమిళ, హిందీ, మలయాళం, కన్నడ వెర్షన్లకు వేర్వేరుగా బిజినెస్ డీల్స్ జరుగుతున్నట్లు వినికిడి. ముఖ్యంగా తెలుగు వెర్షన్ థియేట్రికల్ కోసం డిస్ట్రిబ్యూటర్ల మధ్య భారీ పోటీ నెలకొందని తెలుస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన హక్కుల కోసం రూ.130 కోట్లకు పైగా మొత్తంలో డీల్ కుదుర్చుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రూ.100 కోట్లకు పైగా ప్రీ రిలీజ్ బిజినెస్ చేసిన మరో సినిమాగా రాజా సాబ్ నిలిచినట్లు తెలుస్తోంది. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో ది రాజా సాబ్ మూవీ బ్రేక్ ఈవెన్ టార్గెట్ అందుకుని లాభాల్లోకి రావాలంటే రూ.200 కోట్లకుపైగా వసూళ్లను సాధించాల్సి ఉందని ఇప్పుడు ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. ఇక సినిమా విషయానికొస్తే.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, ఐవీవై ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్స్ పై ప్రముఖ నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల, ఇషాన్ సక్సేనా.. ది రాజా సాబ్ ను రూపొందిస్తున్నారు. దాదాపు 400 కోట్లకు పైగా భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నట్లు సమచారం. ప్రొడక్షన్ విషయంలో ఎక్కడా తగ్గకుండా తీశారని వినికిడి. మూవీలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ది కుమార్ లు హీరోయిన్లుగా నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బోమన్ ఇరానీ, జరీనా వహబ్, సముద్రఖని, బ్రహ్మానందం, వీటీవీ గణేష్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కార్తీక్ పళని సినిమాటోగ్రాఫర్ గా వ్యవహరిస్తున్నారు. కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్ గా వర్క్ చేస్తున్నారు. తమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. అయితే రాజా సాబ్ ఎలాంటి విజయం సాధిస్తుందో వేచి చూడాలి.

## ఉక్కిరి బిక్కిరి చేస్తున్న అందాల సోనమ్

పంజాబీ మూవీ 'శుభం కలుగుగాక'తో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ సోనమ్ బజ్వా. ఈ అమ్మడు తెలుగులోనూ వెంకటేష్ హీరోగా నటించిన బాబు బంగారం సినిమాలో ఐటెం సాంగ్ చేయడం ద్వారా పరిచయం ఉంది. ఆ సినిమా తర్వాత సోనమ్ తెలుగులో కనిపించలేదు. బాలీవుడ్‌కే ఈ అమ్మడు పరిమితం అయింది. పంజాబీ, హిందీ సినిమాలతో బిజీ బిజీగా ఉండే ఈ అమ్మడు సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా సౌత్‌లోనూ ఈ అమ్మడికి గుర్తింపు లభించింది.

ఎప్పటికప్పుడు ఈ అమ్మడి గురించి నెటిజన్స్ మాట్లాడుకుంటూనే ఉన్నారు. తాజాగా మరోసారి ఈ అమ్మడు ఆకట్టుకునే విధంగా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. సోనమ్ బజ్వా అందానికి ప్రతి ఒక్కరూ ఫిదా కావాల్సిందే అని మరోసారి నిరూపితం అయ్యింది.

**సోనమ్ బజ్వా అందాల ఆరబోత...**2012 ఫెమినా మిస్ ఇండియా కాంటెస్ట్‌లో పాల్గొనడం ద్వారా ఈ అమ్మడికి గుర్తింపు లభించింది.



పంజాబీ సినిమాతో ఎంట్రీ ఇచ్చినప్పటికీ వెంటనే తమిళ చిత్రంలోనూ నటించే అవకాశం దక్కింది. అయితే తమిళ సినిమాతో హిట్ దక్కక పోవడంతో అక్కడ మరిన్ని సినిమాలు చేయలేక పోయింది. అర్దాబ్ ముతియారన్ చిత్రంలోని ఈ అమ్మడి నటనకు గాను ఉత్తమ నటి అవార్డ్‌ను దక్కించుకుంది. పంజాబ్ నుంచి దక్కిన ఆ అవార్డ్ కారణంగా మరింతగా ఈమె బిజీ అయింది. తెలుగులో ఈమె ఆటాడుకుందం రా అనే సినిమాలోనూ నటించింది. కానీ కనీసం ఆ సినిమాలో ఈమె ఉన్న సంగతి కూడా ఎవరికీ తెలియదు. అందుకే ఆ సినిమా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పటికీ హిందీ, పంజాబీలో వరుస సినిమాలు చేస్తున్న ఈమె మరింత బిజీ కావాలని ప్రయత్నాలు చేస్తోంది.

**బాలీవుడ్‌లో వరుస సినిమాలు..** మూడు పదుల వయసు దాటిన తర్వాత సాధారణంగా హీరోయిన్స్ జోరు తగ్గుతుంది అంటారు. కానీ సోనమ్ బజ్వా ప్రస్తుత వయసు వికీపీడియా అనుసారం 36 ఏళ్లు, అయినప్పటికీ అమ్మడు చాలా బిజీగా సినిమాలు చేస్తూనే ఉంది. ఉదాహరణకు చెప్పాలంటే ఈ ఏడాదిలోనే ఈమె నటించిన నాలుగు సినిమాలు వచ్చాయి. అందులో హిందీ సినిమాలు సైతం ఉండటం విశేషం. కేవలం హీరోయిన్‌గా నటించాలి అనుకోకుండా వచ్చిన ప్రతి ఆఫర్‌ను ఈ అమ్మడు సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అందాల ఆరబోత విషయంలోనూ ఈమె వెనక్కి తగ్గదు. అందుకే గ్లామర్ పాత్రలు దక్కించుకుంటూ ఇప్పటికీ ఇండస్ట్రీలో తాను ఉన్నాను అంటూ ఉనికి చాటుకుంటుంది. ఇలా చేస్తే తప్పకుండా ముందు ముందు కూడా మంచి ఆఫర్లు వస్తాయనే విశ్వాసం వ్యక్తం అవుతోంది.

## అవమానించారని కసితో బెంజ్ కొన్న నటి!

ముంబై బ్యూటీ మృణాల్ ఠాకూర్ చిత్ర పరిశ్రమలో ఎలా ఎదిగందన్నది చెప్పాల్సిన పనిలేదు. బుల్లి తెరపై ఎంట్రీ ఇచ్చి అక్కడ సక్సెస్ అనంతరం వెండి తెరకు ప్రమోట్ అయింది. ఈ మధ్యలో ఎన్నో అవమానాలు...సవాళ్లు ఎదుర్కుంది. ఇండస్ట్రీలో బ్యాక్ గ్రౌండ్ లేకపోతే ఎదురయ్యే అన్ని రకాల ఇబ్బందులు ఎదుర్కుంది. బాలీవుడ్ అనే మహాస ముద్రంలో తాను చేప పిల్లలా మొదలై పెద్ద చేపగా మారింది. అక్కడ నుంచి సీతారామంతో టాలీవుడ్ లోనూ సంచలన భామగా మారింది. కేవలం సక్సస్ మాత్రమే తనని ఇంత దూరం తీసుకొచ్చింది.

**చిన్న తనంలో అలాంటి అవమానం:** ఎన్నో హేళనలు..అవమానాల తర్వాత ఈ స్థాయికి చేరుకుంది. కొత్తగా వచ్చే వాళ్లకు పరిశ్రమలో ఇవన్నీ సహజమే. వాటిని పట్టించుకుంటే గమ్యాన్ని చేరడం అసాధ్యం. కానీ జీవితంలో మర్చిపోలేని ఓ సంఘటనని తనని బాలీవుడ్ వైపు స్ట్రాంగ్ గా ఉండేలా చేసిందని తెలుస్తోంది. ఇటీవలే అమ్మడు కష్టపడి సంపాదించిన డబ్బుతో లగ్జరీ మెర్స్ డెస్ బెంజ్ కారు కొంది. ఈ సందర్భంగా ఓ అవమానం గురించి మరోసారి గుర్తు చేసుకుంది. తన చేతుల్లో డబ్బులేని సమయంలో? చిన్న తనంలో తన తల్లిని చుట్టాలే కారు ఎక్కించుకోవాలంటే? ఆలోచించేవారుట.

**చుట్టాలందరిలో బెంజ్ నాకే ఉంది:** ఓ సారి అయితే కారు ఎక్కే



అర్హతే తన తల్లికి లేదన్నట్లు అవమానించారట. అలా ఓసారి తన తల్లిని ఒంటరిగా వదిలేసి కారులో వెళ్లిపోయారట. ఆ సంఘటన గుర్తొచ్చినప్పుడల్లా తానెంతో బాధపడతానంది. ఆ ఘటన తర్వాత డబ్బు సంపాదించి ఖరీదైన కారులో అమ్మను తీసుకెళ్లాలని బలంగా డిసైడ్ అయిందిట. ఆ కల ఇప్పటికి నెర వేరిందని తెలిపింది. తమ బంధువుల్లో ఎవరికీ బెంజ్ కారు లేదని...తానే ఆ కారు మొదట కొన్న వ్యక్తిగా చెప్పు కొచ్చింది. ఇప్పుడా కారులో అమ్మను ఎక్కించుకుని తిరుగుతున్నప్పుడు ఆ పాత సంఘటనలు గుర్తొచ్చాయంది.

**మనుషుల నిజ స్వరూపం:** అప్పుడు వాళ్లు అవమానించారని..ఇప్పుడు వాళ్లను తక్కువ చేయడం తన ఉద్దేశం కాదని..దగ్గర అనుకునే వాళ్లు కొందరు ఎలా ఉంటారు? అన్నది డబ్బు లేనప్పుడే తెలుస్తుంది. డబ్బు లేనప్పుడు సమభావంతో చూసిన వాళ్లే గొప్ప మనసున్న వ్యక్తులు అవుతారంది. ఇప్పుడు తాను డబ్బు సంపాదించినా? డబ్బు లేని రోజుల్ని మాత్రం ఎప్పటికీ మర్చిపోనంది. ప్రస్తుతం మృణాల్ హిందీ సినిమాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. అలాగని తెలుగు సినిమాలకు దూరమవ్వలేదు. అడవి శేష్ హీరోగా నటిస్తోన్న డెకాయిట్ లో నటిస్తోంది. అలాగే అల్లు అర్జున్ హీరోగా నటిస్తోన్న 26వ చిత్రంలోనూ ఓ హీరోయిన్ గా నటిస్తోంది. వీటితో పాటు మరికొన్ని కమిట్ మెంట్లు కూడా ఉన్నాయి. కానీ వాటి వివరాలు ఇంకా అధికారికంగా బయటకు రాలేదు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536